# మరువు మహర్షి బోధలు

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంథకర్తవి, ప్రచురణకర్తవి.

ప్రథమ ముద్రణ : 2005 - గురుపూర్ణిమ ప్రతులు : 1,000
ద్వితీయ ముద్రణ : 2011 - గురుపూజలు ప్రతులు : 1,000

వెల : రూ॥ **60-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531
e-mail : dhanishta@rediffmail.com

ముద్రణ :
ఎక్సేలియస్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 9848075132.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ",** డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగా భ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసర ణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడి పించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ ఫౌండేషన్**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | పరిచయము | 10 |
| 1 | మహత్తు - శాస్త్రము | 25 |
| 2. | మా నివాసము | 26 |
| 3. | క్రతువు | 27 |
| 4. | మా దర్శనము | 28 |
| 5. | మా నిర్దేశము | 30 |
| 6. | లోకహితము - హెచ్చరిక | 31 |
| 7. | తాళం చెవి - తాళము - చెవి | 32 |
| 8. | సుశిక్షితుడు | 33 |
| 9. | సహాయము | 35 |
| 10 | హెచ్చరిక | 36 |
| 11. | సూక్ష్మము | 37 |
| 12. | త్రిపురము | 38 |
| 13. | శాసనము | 40 |
| 14. | పొట్టు - గింజ | 42 |
| 15. | నిరీక్షణ | 44 |
| 16. | విషమ స్థితి | 46 |
| 17. | ఏనుగు తొండము | 48 |
| 18. | మార్గానుసరణము | 49 |
| 19. | గురు వాక్యము | 50 |
| 20. | ఆలోచనము | 51 |
| 21. | వజ్ర చైతన్యము | 53 |
| 22. | స్త్రీ | 54 |
| 23. | మా అస్తిత్వము | 55 |
| 24. | ధీరత | 56 |
| 25. | మానవత | 57 |

| | | |
|---|---|---|
| 26. | కర్తవ్యము | 58 |
| 27. | నా యనుసంధానము | 59 |
| 28. | మా బోధనలు | 60 |
| 29. | మేలుకొలుపు | 61 |
| 30. | పరహితము | 62 |
| 31. | అస్వస్థత | 63 |
| 32. | సూచనలు - 1 | 64 |
| 33. | సూచనలు - 2 | 65 |
| 34. | స్వచ్ఛంద బోధ | 66 |
| 35. | నా దర్శనము | 67 |
| 36. | ఆశంసనము | 69 |
| 37. | విలువైన సలహా | 70 |
| 38. | నిద్ర - స్మృతి - 1 | 71 |
| 39. | నిద్ర - స్మృతి - 2 | 72 |
| 40. | నిద్ర - స్మృతి - 3 | 73 |
| 41. | నిద్ర - స్మృతి - 4 | 74 |
| 42. | నిద్ర - స్మృతి - 5 | 75 |
| 43. | నిద్ర - స్మృతి - 6 | 77 |
| 44. | నిద్ర - స్మృతి - 7 | 78 |
| 45. | జీవనము - సేవనము - 1 | 79 |
| 46. | జీవనము - సేవనము - 2 | 81 |
| 47. | జీవనము - సేవనము - 3 | 82 |
| 48. | జీవనము - సేవనము - 4 | 84 |
| 49. | జీవనము - సేవనము - 5 | 85 |
| 50. | గురు-శిష్య కర్తవ్యములు | 87 |
| 51. | హెచ్చరిక | 88 |
| 52. | అగ్ని ఆరాధనము | 90 |

| | | |
|---|---|---|
| 53. | స్వరాజ్ | 92 |
| 54. | రుద్ర తరంగము | 94 |
| 55. | అగ్ని | 96 |
| 56. | పర్వత శిఖరములు | 98 |
| 57. | దివ్య వృక్షములు | 100 |
| 58. | సమతుల్యము | 102 |
| 59. | మార్పులు | 103 |
| 60. | దివ్యశక్తులు | 104 |
| 61. | శబ్దము - అగ్ని | 106 |
| 62. | ధర్మము - దర్శనము | 108 |
| 63. | సౌందర్య సోపానములు | 109 |
| 64. | మౌన మార్గము | 111 |
| 65. | గుర్తు - గుర్తింపు | 112 |
| 66. | తొలగియుండుట | 113 |
| 67. | ఆనందము - ప్రయాస | 114 |
| 68. | నకిలీ - వెకిలి - కలి | 115 |
| 69. | అంతః పరిశీలనము | 116 |
| 70. | పొడుపు కథ | 117 |
| 71. | పనిముట్లు | 118 |
| 72. | నిర్మల హృదయము | 119 |
| 73. | అగ్ని మహర్షి | 120 |
| 74. | అగ్ని యోగము | 121 |
| 75. | నిదానము | 122 |
| 76. | మనోవికారము | 123 |
| 77. | మా సిద్ధాంతము | 124 |
| 78. | సూటి మార్గము | 126 |
| 79. | అరకొర దీక్ష **(Half-wayness)** | 128 |
| 80. | సదవగాహనము | 129 |

| | | |
|---|---|---|
| 81. | దేహ బాధలు | 131 |
| 82. | మూలవ్యాధి | 133 |
| 83. | ఉభయభ్రష్టులు | 135 |
| 84. | అక్కరకు రాని విద్య | 137 |
| 85. | రక్త దానము | 138 |
| 86. | స్ఫూర్తి | 139 |
| 87. | ఏకైక ఉపాయము | 141 |
| 88. | భావ భ్రమణము | 143 |
| 89. | శాంతి, ప్రశాంతి | 145 |
| 90. | పరమశాంతి | 147 |
| 91. | మనోకళ | 149 |
| 92. | గతము | 150 |
| 93. | వాసనా బలము-1 | 152 |
| 94. | వాసనా బలము-2 | 153 |
| 95. | సంకల్పబలము | 155 |
| 96. | కాలయాపన | 157 |
| 97. | భూతప్రేతములు | 158 |
| 98. | జిజ్ఞాసువులు | 160 |
| 99. | స్నేహము | 162 |
| 100. | విశ్వాసము - భయము - రోగము | 164 |
| 101. | ధ్యానము - మత్తు | 166 |
| 102. | యువత | 168 |
| 103. | అపాయము - ఉపాయము | 170 |
| 104. | సోదరత్వము | 172 |
| 105. | నమ్మిక | 174 |
| 106. | అసమగ్ర సాధన | 176 |
| 107. | క్రియాశక్తి | 178 |
| 108. | సనక సనందనాదులు | 180 |

# మరువు మహర్షి బోధలు

## పరిచయము

మరువు, దేవాపి మహర్షులు అనాది నుండి భూమిజీవుల యుద్ధరణకై నిర్విరామము కృషిచేయుచున్న మహర్షులు. వీరి పుట్టు పూర్వోత్తరములు ఎవ్వరికిని తెలియదు. అన్ని పురాణము లందును వీరు గోచరింతురు. విష్ణుపురాణము నుండి భాగవత పురాణము వరకుగల పురాణములలో అచ్చటచ్చట ప్రస్తుతి చేయ బడిరి. జీవులకు వర్ణాశ్రమ ధర్మములను నేర్పుచు, ధర్మము నందు రుచి కల్పించి, ధర్మమార్గమున నడిపింపజేసి, ఉత్తీర్ణులను గావించుట వీరుచేయు మహత్తర నిష్కామ కర్మయజ్ఞము. ఈ యజ్ఞము వీరు అనాదికాలముగ నిర్వర్తించుచున్నారు. జగద్గురువు మైత్రేయునికి దివ్యప్రణాళికలో తోడ్పాటు గావించుచున్నప్పటికిని వీరు మైత్రేయునికన్న పూర్వులు. వాసుదేవుని వ్యూహమునందు జీవుల ఉద్ధరణకై యుగముల తరబడి పనిచేయుచున్న మహానుభావులు.

మరువు మహర్షి సూర్యవంశపు రాజు. ఇక్ష్వాకు వంశము వాడు. అనగా శ్రీరాముని వంశము వాడు. అనగా త్రేతాయుగము నుండి భూమిపై నున్నవాడు. అంతకు ముందునుండి కూడ యుండి యుండవచ్చును. అట్లే దేవాపి మహర్షి చంద్రవంశపు రాజు. ఇతడు భీష్ముని తండ్రి అయిన శంతనమహారాజునకు

అగ్రజుడు. ఆ జన్మలో దేవాపి బ్రాహ్మణ ధర్మమును స్వీకరించి తనకు తానుగ కోరి రాజ్యము నుండి బహిష్కరించబడెను. నిజము నకు కురు సామ్రాజ్యమునకు అతడు చక్రవర్తియై యుండ వలసినది. కాని వాసుదేవుని వ్యూహము ననుసరించి వాసుదేవుడు శ్రీకృష్ణుడుగ అవతరించుటకు ముందుగనే రాజ్యపరిత్యాగము గావించెను.

దేవాపి మహర్షి ఆ జన్మలో శ్రీకృష్ణుని కన్న నాలుగు వందల సంవత్సరముల ముందు పుట్టినవాడు! నాలుగు వందల సంవత్సర ముల ముందు దైవము యొక్క వ్యూహమును గ్రహించి, అందు తన పాత్రను గ్రహించి, తదనుగుణముగ చక్రవర్తిత్వమును పరి త్యాగము చేయుటకు కొంత దూరదృష్టి కావలెను. అది ఋషి దృష్టి. దేవాపి ఋషి మాత్రమే కాదు, రాజర్షి. రాజర్షి మాత్రమే కాదు మహర్షి. దేవాపి, శంతనుడు, కాశీరాజగు దివోదాసు, జగద్గురు వగు పరాశర మహర్షి, వీరందరును సమకాలికులు, వీరు ఆ జన్మల యందు, ఆయా దేహములందుండుట పురాణ పురుషుని అవతరణమునకు నాలుగు వందల సంవత్సరముల ముందు జరిగినది. దేవాపి మహర్షియై నిలుచుట ఆ జన్మలో జరిగినదను కొనలేము. అట్లే మరువు మహర్షి కూడా.

ఈ ఇరువురు మహర్షులు వాసుదేవుని వ్యూహమున అనాది కాలముగ పనిచేయుచు తెరవెనుక నుండుట కెక్కువ అభిలషించి రని అనిపించును. మహర్షుల పుట్టు పూర్వోత్తరములు మనకు పురాణ సంహితలలో లభ్యమగును. వారు చేసిన సాధనలు కూడ లభ్యమగును. కాని ఈ మహర్షుల పుట్టు పూర్వోత్తరములు, సాధనలు

పురాణముల యందు కూడ లిఖింపబడలేదు. అది బహుశః వారి సంకల్పము కావచ్చును. పరాశరులు విష్ణుపురాణమున, వేద వ్యాసులు భాగవత, కల్కి పురాణములలో వీరిని తగుమాత్రము పరిచయముచేసి వదలినారు. అదియును అతి స్వల్పమే.

ఈ భూమి పుట్టుక ముప్పదికోట్ల సంవత్సరముల క్రితము జరిగినది. అందు ఆదిమానవుని అవతరణము ఒకకోటి, ఎనభై లక్షల సంవత్సరముల క్రితము జరిగినది. ఈ కోటి ఎనభై లక్షల సంవత్సరములలో కొన్ని మన్వంతరములు గడచినవి. ఎన్నియో యుగములు గడచినవి. మానవజాతి ఉద్ధరణమునకై కుమారులు, ఋషులెందరో భూమికి దిగి వచ్చిరి. ఈ మొత్తము భూమి కథ, మానవజాతుల కథ, ఈ మహర్షు లిద్దరికిని కరతలామలకములు. ఈ భూమిపై జరుగుచున్న జగన్నాటకమునంతయు వారు సాక్షీ భూతులుగ గమనించుచు తమ వంతు కర్తవ్యమును వాసుదేవుని కల్పితముగ నిర్వర్తించుచున్నారు. వీరిరువురును దివ్యదేహ ధారులు. అణువుల నుండి అప్పటికప్పుడు దేహమును కట్టుకొని ప్రత్యక్షము కాగలరు. అట్లే అదృశ్యము కాగలరు. స్మరణ మాత్ర మున సాన్నిధ్యమునివ్వగల వాసుదేవోపాసకులు. వీరు విష్ణు స్వరూపులు, త్రికాలజ్ఞులు వీరికి తెలియని మన్వంతర రహస్య ములు, మతాతీత సత్యములు, మానవజాతి కథలు, లేవన్నచో అతిశయోక్తి కాదు.

రాశిచక్రమున సద్గురుపరంపర అంతయు ఆషాఢ శ్రావణ ములను అధిష్టించి యుండగ మరువు మహర్షి మేషరాశిని, దేవాపి మహర్షి ధనుర్ రాశిని అధిష్ఠించి యున్నారు. ధనుర్‌రాశి మూలాధార

ప్రజ్ఞ. అచటనే యోగప్రజ్ఞ యున్నది. ఈ కేంద్రమునకు దత్తాత్రేయుడధిపతి. కపిలుడు గణపతి, హనుమంతుడు అచ్చటి గురుపరంపర. ఇట్టి మహత్తరమైనటువంటి యోగప్రజ్ఞకు అధిపతిగ ధనుర్ రాశిని పరిపాలించుచున్న దేవాపి మహర్షి, సమస్త యోగ మార్గములను ప్రచోదనము గావించుచు జీవులను త్వరితగతిని పురోగమింపచేయుచున్నారు. యోగమునకు మూలాధారము ఆరంభముకాగ సహస్రారము గమ్యమై యున్నది. అచ్చట ఆ ప్రజ్ఞను పరిపాలించుచు మరువుమహర్షి జీవుల నూర్ధ్వముఖమున కాకర్షించుచుండును. ఉత్తమలోకముల ప్రవేశము కల్పించుచుండును. యోగదండము లేక బ్రహ్మదండమునకు ఇరుపార్శ్వముల వీరిరువురు పనిచేయుచు భూమి యందలి సమస్త గురు పరంపరకు స్ఫూర్తినిచ్చుచు మరుగుననున్నారు.

రహస్య దివ్యాచరణము వీరిరువురి ప్రత్యేకత. రహస్యము, మౌనము, అనిర్వచనీయమగు పవిత్రత, ఆత్మత్యాగము వీరి సహజ లక్షణములు. తమకు పేరు ప్రతిష్టలు కలుగకుండ దైవమునకే పేరు ప్రతిష్ఠలు కలుగునట్లు ప్రవర్తించు దివ్యజీవులు, చిరంజీవులు.

చిరంజీవులు లోకకళ్యాణార్థమై భగవత్‌వ్యూహము ననుసరించి జన్మలెత్తుచు తామెవరో తమకు జ్ఞప్తి కలిగి వర్తింతురు. జన్మ ప్రయోజనములను మరువక, లోక హితార్థమగు కార్యముల నొనర్చుచు మనస్సు, ఇంద్రియము, శరీరములను హితకార్యముల కొరకై ఉపకరణములుగ వాడుదురు. చచ్చిన వెంటనే మనుష్యుడంతరించునని, శరీరముకన్న వేరుగ జీవుడు లేడని మ్లేచ్ఛ సిద్ధాంతము. ఇట్టివారు తమ శరీరమే తామనుకొని జీవించు

చుందురు. కాని శరీరములంతములైనపుడు జీవులా శరీరములతో మరణింపరన్నది శాశ్వత సత్యము. శరీరము మరణించినప్పుడు జీవుడు మరియొక శరీరమును కోరును. నూతన శరీరము కర్మాను బంధమై ఏర్పడును. నూతన శరీరమున జన్మించినపుడు మునుపటి జీవితము మరుపునకు వచ్చును. నిజమునకు మరుపే మృత్యువు. మరుపు లేనివానికి మృత్యువు లేదు. మృత్యువనగా మరుపేకాని, శరీరమంతమగుట కాదని పెద్దల యవగాహన. జన్మల తరబడి తామెవరో, తమ కర్తవ్యమేమో జ్ఞప్తి యున్న వారిని చిరంజీవు లందురు. వీరు మరపులేని వారు గనుక మృత్యువును దాటిన వారు. వీరికనేక జన్మలలో ఒకే స్మృతి అనుస్యూతముగ నుండును. ఒకే పవిత్రమైన కార్యము ఇన్ని జన్మల తరబడి నిర్వహించుటలో వారు నిమగ్నులైయుందురు.

ఇట్టి చిరంజీవులను గూర్చి వేద పురాణాది సంహితలలో ఉదహరించినపుడు ఏ జన్మలోని శరీర నామముతో చెప్పవలెను? జన్మమున కొకపేరు తల్లితండ్రుల ద్వారా ఏర్పడుచుండును. ఆ పేరు ఆ జన్మాంతము వరకే. మరల జన్మ ఎత్తినపుడు మరియొక పేరు యేర్పడుచుండును. దుస్తులు మారినట్లు జన్మములు మారు చుండగ, ఇన్ని దుస్తుల యందు ఒకే మనిషిని ఒకే నామముతో పిలుతుము గదా! అట్లే సూక్ష్మ లోకములలో శరీరములు మారి నప్పటికిని నామము ఒక్కటియే యుండును. చిరంజీవుల కిట్టి నామముండును. వారిని గూర్చి ప్రస్తావించినప్పుడు వారి మొత్తము వృత్తాంతమునకును, జన్మలన్నింటికిని సూచకమగు సంకేతనామ మొకటి యుండుట సదుపాయము. ఇది వేదసంప్రదాయము.

వేద పురాణములయందు గోచరించు ఋషుల పేర్లలో ఎక్కువ భాగమిట్టిదే. ఈ విధముగ దేవాపి, మరువు మహర్షులు, వేద వ్యాసుని పురాణములయందు పేర్కొనబడిరి. అంతకు ముందు పరాశరులున్నప్పటి దేవాపి, మరువు మహర్షుల శరీరములు వేరు. వేదవ్యాసులకు సమకాలికులుగ, మైత్రేయునికి ప్రాణమిత్రునిగ నున్న ఈ ఋషుల దేహములు వేరు.

ఈ మహర్షులు మూడు రకముల దేహములు కలిగి మూడు విధములగు కార్యములను ఒకేమారు నిర్వర్తింపగలరు. వీరికి వజ్ర శరీరముండును. ఇది దాదాపు శాశ్వత శరీరమే. దీనిని కారణ శరీరమని కూడ అందురు. ఇందుండి వెలుగు లోకముల కార్యము లను చక్కపెట్టుదురు. సూక్ష్మతరమగు దివ్య ప్రణాళికను గ్రహిం తురు. తదనుగుణముగ కర్మాచరణమేర్పరచుకొందురు. వీరికి సూక్ష్మ శరీరముకూడ నొకటి యుండును. ఇందుండి సూక్ష్మ శరీర కార్యములు చక్కబెడదురు. భౌతిక శరీరమొకటి యుండును. ఇందుండి భూలోక కార్యములను చక్కబెడుదురు. అవసరమగుచో ఒకే సమయమున పలుచోట్ల కనిపింపగలరు. ఈ శరీరము లన్నియు అష్టాంగ యోగమున మానవునికి సిద్ధించగలవు. ఇవి అద్భుత ములు కావు. కృషి ఫలములు. జన్మల తరబడి చేసిన నిష్ఠాయుత మైన యోగసాధన యోగసిద్ధినిచ్చును. ఈ విషయమున మహర్షులు పరిపూర్ణసిద్ధులు.

ఉదాహరణకు మరువు, దేవాపి మహర్షులు హిమాలయ ములలోని కలాప గుహల యందు నివసించుచు భౌగోళికముగ లోకహితులకు, సత్సాధకులకు ప్రేరణ కలిగించుచు జాతి పురోగ

మునకై అహర్నిశలు పనిచేయుచుందురు. వీరు శ్రీకృష్ణుని ద్వారకా జీవన సమయమున కృష్ణునికి తోడ్పాటు గావించుచు అనేకానేక కార్యములను ద్వారకలో చక్కపెట్టుచుండెడివారు. అచ్చట వారి పేర్లు శతానీకుడు (దేవాపి), మధువ్రతుడు (మరువు).

అధర్మ మెప్పుడును ధర్మముపై దురాక్రమణము చేయుచు నుండును. దీనికి అమాయక ప్రజలు బలియగుచుందురు. ఇట్టి ప్రజలను కాపాడుకొనుట, ధర్మమును నిలబెట్టుట, ప్రకృతి యొనర్చునొక కర్తవ్యము. యిట్టి పరమ ప్రయోజనమును సాధించు టకు ప్రకృతియే కొందరు జీవులను, సిద్ధులుగను, చిరంజీవులు గను తీర్చిదిద్దుకొనుచుండును. నిజమునకు యీ ఋషులు శ్రీకృష్ణుని అప్రాకృత శరీర నిర్మాణ మహాయజ్ఞమున కూడ పాల్గొని నారు. పరాశరులు, మైత్రేయులు, వేదవ్యాసులతో కలసి తమ వంతు కర్తవ్యములెన్నియో వినియోగించినారు. రహస్య జీవన మున కిచ్చగించుటచే పురాణ సంహితలలో తమను గూర్చిన ప్రస్తావన బీజప్రాయముగనుండునట్లు జాగ్రత్త పడినారు. మైత్రేయుడు, వేదవ్యాసులు ఎంతటి ప్రసిద్ధిగాంచిన యోగులో వీరుకూడ నట్టి వారే. ఆరాధ్యనీయులే. ప్రాతఃస్మరణీయులు, వాసుదేవ స్వరూపులు.

భాగవతమున వేదవ్యాస మహర్షి ద్వాదశ స్కంధమున వీరిని గూర్చి ఇట్లు పలికెను. "శంతనుని యనుజుండగు దేవాపియు, ఇక్ష్వాకు వంశజుండగు మరుత్తును, యోగయుక్తులై కలాప గ్రామ నిలయులై కలియుగాంతమువరకు వాసుదేవ ప్రేరితులై ప్రజలను

ఆశ్రమాచార ధర్మములు తప్పకుండ నడుపుచు నారాయణ స్మరణంబు నిత్యం బొనర్చి కైవల్యపద ప్రాప్తులగుదురు."

అట్లే నవమ స్కంధమున దేవాపి, మరువు మహర్షులీ విధముగ తెలుపబడిరి.

శ్రీఘ్రునకు మరువు అను రాజశ్రేష్టుండు పుట్టెను. ఆ రాజయోగి సిద్ధుడై కలాప గ్రామంబుననున్నవాడు. కలియుగాంతంబున నష్టంబయ్యెడు సూర్యవంశంబు గ్రమ్మర బుట్టింప గలవాడు. (12వ అధ్యాయము)

*దేవాపి కలాప పురం*
*బావాసము కాగ యోగియై యున్నాడు*
*ర్వీవర కలి నష్టంబగు*
*జైవాతృక కులము మీద సంస్థాపించున్*

విష్ణు పురాణమున వీరిని గూర్చి పరాశర మహర్షి యిట్లు పలికెను :

*దేవాపి : పౌరవో రాజా మరుశ్చిశ్వాకు వంశజ మహాయోగ బలొపేతౌ, కలాపగ్రామ సంశయో కృతేయుగ ఇహాగత్వ ఛత్ర ప్రవర్తకే హితౌ భవిష్యతో మనోర్వేశే బీజ భూతౌ వ్యవస్థితౌ యేతేన క్రమయోగేన మనుపుత్రే వసుంధర కృత త్రేతాది సంజ్ఞాని యుగాని త్రీర్యుగ భుజ్యతే కలౌతు బీజ భూతాస్తే కేచి త్తిష్టంతి భూతలే. యద్దైవ దేవాపి మరువు సంప్రాప్తం సమవిస్తతే.*

కురువంశపు రాజగు దేవాపి, ఇక్ష్వాకు వంశపు రాజగు మరువు సమస్త యోగ సిద్ధులు కలిగి కలాప గ్రామమున నివసించు

చున్నారు. కృతయుగము వచ్చు వరకు వారు జీవులచే హితము ననుసరింప చేయుచు మరల వర్ణాశ్రమ ధర్మములను భూమిపై స్థాపింపగలరు. వారు రాబోవు మన్వంతరమునకు బీజములై నిలచుటకు సంకల్పించినారు. భవిష్యత్ యుగములలో (కృత, త్రేత, ద్వాపరములలో వారు జీవులకు యోగము, ధర్మముల నందింపజేయుదురు.)

కల్కి పురాణమున కూడ నిదే విషయమును వేదవ్యాస మహర్షి పేర్కొనుట జరిగినది. అందిట్లున్నది : *మరుపు దేవాపి మహర్షులు యోగేశ్వరులై ఋషి నివాసమైన కలాప గ్రామమున వసించి యున్నారు. కలియుగాంతమున వీరు మరల వర్ణాశ్రమ ధర్మములను మానవుల కందించి నూతన శకము ఆరంభింతురు. (9వ స్కంధము, 22వ అధ్యాయము)*

కల్కిపురాణమున రెండవ అధ్యాయమున ప్రథమ అంశ మున శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవునితో పలికిన పలుకులుగ యిట్లు లిఖించబడినది : నీ ప్రార్థన ననుసరించి నేను భవిష్యత్తున శంబళ గ్రామమున విష్ణు యశస్సు, సుమతి దంపతికి జన్మించ గలను. నా నలుగురు సోదరులతో నేను మరల అజ్ఞానమును, అధర్మ మును ఛేదించి, ధర్మమును స్థాపించగలవాడను. నీవును దేవతలు మీ మీ అంశలలో జన్మించి నాకు తోడ్పాటు గావించగలరు. నా హృదయేశ్వరియగు శ్రీలక్ష్మి సింహళరాజగు 'బృహద్ధృతుడు, కౌముదులకు పద్మ అను నామమున జన్మించగలదు. అపుడు నేను భూవలయమునకు మరువును చక్రవర్తిగను, దేవాపిని జగద్గురువుగను స్థాపింతును. అప్పటినుండి భూమిపై సత్య యుగ

మారంభమగును. శాశ్వత ధర్మము నెలకొల్పబడును. కలి వధింప బడును.

కల్కి పురాణమున యింకను యిట్లున్నది : మునుల ప్రార్థనల నంగీకరించి కల్కి భగవానుడు గంగాతీరమున వారికి ప్రత్యక్షమై మునులనందరిని పలుకరించి ఆశీర్వదించి యిట్లనెను. "పుణ్య పురుషులారా! మీ యందు దేదీప్యమైన కాంతులతో వెలుగొందుచున్న ఆ యిరువురి మహాత్ములెవరు? వారిచ్చటి కెందులకేతెంచిరి? వారు గంగకు ఎందుకు ప్రార్థనలు సలుపు చున్నారు?" అనుచూ యింకను వారిరువురిని ఉద్దేశించి యిట్లనెను. "మీరు జాహ్నవి నెందుకు ఆరాధించుచున్నారు? మీరెవరు? మీ నామములేవి?

అపుడు మరువు మహర్షి ముందుకేతెంచి, కల్కి దేవునికి నమస్కరించి తన పుట్టు పూర్వోత్తరములను తెలుపుచు, తన నామమును తెలిపెను. చతుర్ముఖ బ్రహ్మ నుండి మరీచి పుట్టుట, మరీచి నుండి మరువు పుట్టుట, మరువు నుండి ఇక్ష్వాకు పుట్టుట అట్లు వరుసగ వంశపరంపరను విశదీకరించి తాను యిక్ష్వాకు వంశజుడనని, శీఘ్రుని కుమారుడనని వివరించెను. మరువు ఇంకను యిట్లనెను.

కృత యుగాంతమునుండి ఈ కలియుగాంతము వరకు కలాప గ్రామము నివాసిగ తాను ధ్యాన నిమగ్నుడై లోకహితమున నిలచి వాసుదేవ ప్రేరితముగ నిలచియున్నానని తెలిపెను. మరువు మహర్షి బ్రహ్మనుండి జనించిన వంశమునందు తాను యాభై

తొమ్మిదవ వానిగ తెలుపుకొనెను. అప్పుడు కల్కి దేవుడు కోరగ దేవాపి మహర్షి కూడ తన పుట్టు పూర్వోత్తరములను తెలుపుచు చంద్రవంశమును వర్ణించెను. అత్రి మొదల్కొని, ప్రతీకుని వరకు గల చంద్రవంశమును తెలిపి, తాను ఆ వంశమున నలుబది రెండవ తరమునకు చెందినవాడని, తన నామము దేవాపి యని తెలిపెను. తాను కూడ మరువు మహర్షివలె కలాప నివాసియై, ధ్యానయోగమున నిలచి వాసుదేవప్రేరితముగ లోకహితముగ కార్యముల నొనర్చితినని తెలిపి నమస్కరించెను.

అపుడు కల్కిదేవుడు సంతసించి వారిరువురి నాశీర్వదించి యిట్లు పలికెను :

''మీరిరువురు అసమాన ధర్మస్వరూపులు. వాసుదేవుని వ్యూహము ననుసరించి జగత్హితముగ యుగముల తరబడి మానవజాతి ఉద్ధరణకై కృషి సలిపినారు. నేను కలి ధర్మమును నశింపచేసి కృత ధనువును స్థాపించగలవాడను. అపుడు మరువు భూవలయమునకు చక్రవర్తియై అయోధ్య రాజధానిగ ధర్మ పరిపాలనమును ప్రారంభింప గలడు. దేవాపి జగద్గురువై హస్తిన కేంద్రముగ విశ్వ విజ్ఞాన విద్యను, వేద వేదాంగములను, యోగ మును జీవుల కందించుచు వారిని అమృతత్త్వదిశగ నడుపగలడు.

ఇట్లనేకానేక విషయములు కల్కిపురాణమున ఈ మహర్షుల గురించి వివరింపబడినవి.

ఇట్లు మరువు, దేవాపి మహర్షులు కలాపగుహల యందు

నివసించుచు మైత్రేయునితో సహకరించుచు విశ్వవిజ్ఞాన విద్యయు, యోగమును భూగోళ వ్యాప్తి గావించుచు తదను గుణ మైన శిష్యపరంపరను నేర్పరచుచు సాగుచున్నారు.

వీరి ప్రభావముననే గ్రీకు, ఇజ్రయిలు దేశములలో విశ్వ విజ్ఞానవిద్య ఆయా శతాబ్దములలో వెలుగొందినవి పైథాగరస్. సొక్రటీస్, ప్లాటో, అరిస్టాటిల్ మొదలగు జ్ఞానులు గ్రీకు దేశమున కెంతయో జ్ఞానము నందించిరి. గ్రీకు దేశపు జ్ఞానులలో పైథాగరస్ అత్యంత ప్రసిద్ధి గాంచినాడు. దేవాపి మహర్షియే పైథాగరస్‌గ జన్మించి గ్రీకు దేశీయులకు జ్ఞానభిక్ష పెట్టెనని యొక నానుడి కలదు.

అటులనే రోమనుల యందు పుట్టిన చక్రవర్తులందరికిని సూర్యవంశపు రాజైన మరువు ప్రచోదన కారకుడని కూడ యొక నానుడి కలదు. రోమను సామ్రాజ్యమున ఘనకీర్తి సంతరించు కొన్నవాడు జూలియస్‌సీజర్. అతడు మరువు మహర్షి యొక్క ప్రధాన శిష్యుడని యొక నానుడి కలదు. రోమను రాజ్యమే లేనిచో ఐరోపా ఖండమునకు నాగరికతయే యుండెడిది కాదు. సంఘ జీవనము, నగరవాసము, పౌర బాధ్యతలు, రాజ్యాంగము, చట్టము పరిరక్షణ, ఖగోళ భూగోళ శాస్త్రములు, జ్యోతిష్యము, ఇత్యాది మానవ వికాసపరమగు అంశములన్నియు రోమనులే ఐరోపా ఖండమున ప్రవేశపెట్టిరి. అంతకుముందు శతాబ్దముననే ఆర్యా వర్తపు ప్రజలు నాగరికులై యుండెడివారు. హస్తిన, ద్వారక, వారణాసి, మధుర, ఉజ్జయిని విశిష్ట నగరములుగ నుండెడివి.

యూదు ప్రజలను బానిసత్వము నుండి విడిపించిన మోజెస్, మరువు మహర్షి అవతారమని, అతి బలిష్టమైన ఈజిప్టు చక్రవర్తిని నిర్జించి, బానిసత్వపుచెర నుండి విడిపించి యూదు లకు స్వాతంత్ర్యము కల్పించుటయే కాక, వారికి జ్ఞానభిక్షను కూడ పెట్టినాడు. అటులనే యూదు ప్రవక్తలలో అత్యంత ప్రాధాన్యము వహించిన జ్ఞాని 'యలీజా' దేవాపి మహర్షి యొక్క అవతారమని కొందరు భావించుచుందురు.

ఏసుక్రీస్తు జన్మ సమయమున అతనిని సందర్శించి ఆశీర్వ దించిన ముగ్గురు జ్ఞానులును మైత్రేయుడు, మరువు, దేవాపి మహర్షులని హిమాలయములలోని ఆశ్రమవాసులు భావింతురు. చివరి మూడు సంవత్సరములు ఏసును నడిపించినది కూడ మైత్రేయుడే అని వారి భావన.

ఇటీవల శతాబ్దములలో నెపోలియన్ చక్రవర్తికి ప్రేరణ కలిగించి ఐరోపా ఖండమంతటికిని ఒకే రాజ్యాంగ విధానము నందింపజేసిన బృహత్తర ప్రయత్నము వెనుక మరువు మహర్షి హస్తమున్నదని ప్రతీతి.

పంతొమ్మిదవ శతాబ్దములో ఈ మహర్షులే హెలేనా పెట్రోవా బ్లావెట్స్కీకి దర్శన మిచ్చి జ్ఞానబోధను గావించి, పిండాండ బ్రహ్మాండ సృష్టి రహస్యములును, మన్వంతర రహస్యములను తెలియజెప్పి, విశ్వ విజ్ఞాన విద్యకు మరియొక ప్రయత్నము చేసినారు. ఆ ప్రయత్నమునకు కొనసాగింపుగ 20వ శతాబ్దమున 'ఏలిస్. ఏ. బైలీ' అను ఆంగ్లయువతిని, 'నికోలారోరిక్' అను రష్యా

దేశపు యువ రాజును, భారతీయులైన 'కులపతి ఎక్కిరాల కృష్ణమా చార్యుల' వారిని తమ స్పర్శచే ప్రభావితము గావించి భౌగోళిక జ్ఞానసంపదను సంతర్పణ గావించినారు.

భౌగోళికముగ ఐదువేల సంవత్సరములలో ఈ మహర్షులు గావించిన మహత్తర కార్యములన్నియు కూడ మానవ పురోభి వృద్ధికే నిర్దేశింపబడినవి. జీవ పరిణామమునకే తోడ్పడినవి. గత ఐదువేల సంవత్సరములుగ వీరు తీర్చిదిద్దిన శిష్యపరంపర భౌగోళిక వ్యాప్తి చెందినవి. అన్ని రంగములలోను నిష్ణాతులైన శిష్యులు కలరు. అమెరికన్ ప్రెసిడెంట్ 'రూజ్‌వెల్ట్', శాస్త్రవేత్త 'ఐన్‌స్టీన్' వంటి మహాపురుషులు కూడ వీరి శిష్యకోటిలోని వారే. మతముల కతీతమైన సత్యములను దర్శింపచేయుచు మత ఛాందసము నుండి జీవుల నుద్ధరించుట కూడ వీరు చేయు ప్రయత్నములోని భాగములు. అట్టివారిలో భరత దేశము నేలిన అక్బరు చక్రవర్తి యొకరు. ఆయన దేవాపిమహర్షి శిష్యుడని ప్రతీతి.

ఋషి కార్యముల నెరుగుట ఋషుల అనుగ్రహముననే తెలియగలదు. అంతయును తెలుపుట ఎటులను సాధ్యము కాదు. కాని వారి స్మరణ సకల శుభంకరము. అట్టి ప్రయత్నమే ఇది. మరువు, దేవాపి మహర్షుల గూర్చి పురాణ సంహితల యందు న్నను తెలిసిన వారు బహుకొద్ది. గుప్తముగ వేల సంవత్సరముల నుండి జగద్ధిత కార్యముల నొనర్చుచున్న ఈ మహర్షులను గూర్చిన విషయములు ఇప్పుడిప్పుడే జనసముదాయము పరిచయము లోనికి వచ్చుచున్నవి. వారిని గూర్చి పరిచయము చేయు ప్రయత్నమే ఇది.

# 1

## మహత్తు - శాస్త్రము

**మూ**లప్రజ్ఞ (భగవత్ తత్త్వము)ను దర్శించు సాధనలో వ్యక్తి పూర్ణముగా పరిణామము చెందవచ్చును. ప్రజ్ఞాదర్శనము జరిగినవారు అట్టి ప్రజ్ఞను వినియోగపరచి లోకకళ్యాణము నొనర్చగలరు. ప్రకృతి శక్తులను సమీకరణము చేసి నిర్దేశించుటయే ఈ ప్రక్రియ. మహత్తులను నిర్వహించుటకు యిదియే రహస్యము. వివిధములైన విద్యుత్ పరికరముల నుండి విద్యుత్తును ప్రవహింపజేయుటచే అవి పనిచేయు చున్నవి కదా! ఆకాశగమనము, వస్తువులను కదిలించుట, ప్రజ్ఞా ప్రసారమును అవరోధించకుండుట వలన జరుగుచున్నవి. ప్రజ్ఞను సమీకరించి విశ్వప్రజ్ఞతో సమన్వయ పరచుటవలన మహత్యములు జరుగును.

మహత్తు అనుటకన్న శాస్త్రమని తెలుపుట ఎక్కువ సత్యము. శాస్త్రమని తెలియక మహత్తని భ్రమ చెందుదురు. అయస్కాంతము మహత్యమా? శాస్త్రమా? శాస్త్రమే. సూక్ష్మలోకముల యందలి సత్యములు సశాస్త్రీయముగ తెలిసిన వానికి మహత్తు అను పదమునకు తావుండదు. మహత్తులు అనగా శాస్త్రమే అని తెలియవలెను. మనకు తెలియని శాస్త్రము మహత్తుగ భావించుచుందురు. మా బృందములోని వారందరూ అట్టి శాస్త్రపరిజ్ఞానము కలవారు.

## 2

## మా నివాసము

**మే**ము నివసించునది ఒక ఒంటి స్తంభము మేడవంటిది. అది బయటకు ఒక పర్వత శిఖరాగ్రమువలె మాత్రము గోచరించును. మా నివాసము చేరుకొనుట కష్టము కాదు. సులభమూ కాదు. అది కేవలము మా సమ్మతిపై ఆధారపడి యుండును. కొంతమందికి భౌతికముగా కూడా అది కన్పించదు. పట్టుదలతో చేరు ప్రయత్నము చేయువారు భ్రమపడి ప్రక్క దారులలో పోగలరు. సోదరబృందములో కుతూహలము కలవారి నుండి మా నివాసమును ఈ విధముగా రక్షించుకొందుము. చుట్టుప్రక్కల నివసించు సాధువులు కూడా మా కాపలాదారులుగా పనిచేయుచూ దారి మళ్ళించగలరు. వారు రహస్యములను కాపాడగలవారు. నియమము కలవారు.

మా సమ్మతిగల వారికి దారులు, మెట్లు సులభముగా గోచరము కాగలవు. మార్గపు చిహ్నములు వారిని నడిపించగలవు. వారికి, అతి ప్రాచీనమైన గ్రంథములు అత్యంత ఉపయోగకరమైన ఓషధులు. అత్యంత మహిమ కలిగిన ప్రతిమలు మా ఆశ్రమమున గోచరించి దిగ్భ్రాంతితో కూడిన నూతన వికాసము పొందగలరు.

## 3

## క్రతువు

కృత్రిమమైన పద్ధతులు పరిపూర్ణమైన ఫలితము నీయజాలవు. పవిత్ర కార్యములను నిర్వర్తించుటకు, తద్వారా పరిపూర్ణ ఫలితము లను పొందుటకు అపవిత్రమైన దేహపుంజము ఉపయోగపడదు. దేహపుంజ మనగా మనోమయ, ప్రాణమయ, అన్నమయ శరీరముల గుత్తి. అపవిత్ర శరీరముతో కూడిన సాధకుడు పవిత్ర కార్యములను ఎట్లాచరించగలడు? దేహమును, ప్రాణమును, మనస్సును, సతతము పవిత్రీకరించుకొనుచు లోకహిత కర్తవ్యమున సాగవలెను. ఇది యొక క్రతువు. ఇట్టి సంకల్పములేక చేయు వివిధములైన క్రతువులు సత్ఫలితములీయజాలవు. బాహ్యాడంబరముకన్న అంతరంగ సాధనము మిక్కిలి ఆవశ్యకము. సాధకుడు కేవలము బహిర్గత క్రతువులచే పవిత్రీకరింపబడడు. అంతరంగమున దివ్యత్వమును స్మరించుచు, బహిరంగమున లోకహిత కార్యములను నిర్వర్తించుచూ, సత్ గ్రంథము లను నిత్యమూ పఠించుచు, సత్పురుష దర్శనమును కర్తవ్యము మేరకు చేసికొనుచు ముందుకు సాగవలెను. మరియొక మార్గము లేదు. అత్యంత పవిత్రమైన క్రతువు కూడ అపవిత్ర భావములతో జీవించు వారికి నిరుపయోగము. మేడిపండు జీవనము విసర్జించవలెను.

## 4

## మా దర్శనము

**మా** దర్శనము సామాన్య సాధకునకు అందునది కాదు. అట్లందినచో దర్శించు సాధకుడు విద్యుత్ స్పర్శ కలిగిన వానివలె మూర్ఛిల్లును. లోకహితమైన కార్యములను సతతము నిర్వర్తించుచూ, వాఙ్నియమమును అవలంబించు వారికి క్రమశః గోచరించగలదు. సత్యాన్వేషికి ఏకోన్ముఖత అత్యవసరము. ఇతరములైన భావముల యందు జీవించుట మానవలెను. పరిసరములు, వ్యక్తులు, వస్తువులు వాని స్వభావము అతనిపై పనిచేయకుండుటకు వాని యందలి సత్యమును దర్శించు ప్రయత్నము కొనసాగవలెను. అట్లొనరించిన మనోమయ ప్రాణమయ కోశములు క్రమముగా పరిణామము చెంది దివ్య దర్శనమునకు అర్హత ఏర్పడును. అట్టి స్థితి యందు కూడా మా సంపూర్ణ దర్శనము సాధకునకొసగక జాగరూకత వహించెదము. మా కన్నులు అగుపించుట, మా ముఖము కని పించుట, మా హస్తములు కనిపించుటగా క్రమశః దర్శన మిత్తుము. అట్లు కాని యెడల సాధకుని శరీరము అపాయమునకు గాని, చికిత్సకు లొంగని వ్యాధికి గాని లోనగును. కుతూహలపడుట కన్న

భాగవత మార్గమున కర్తవ్యము నిర్వర్తించుచూ తన్ను తాను పవిత్రీ కరించుకొనుట మేలు. మా దర్శన తరంగముల ప్రభావము అవగాహన కాక కుతూహలమున మాకై వెదకుట వెఱ్ఱితనము. మా సహకారము, సహాయము, సాన్నిధ్యము, దర్శనము, సంభాషణము, లోకహిత కర్తవ్యమునందు సమర్పణ చెందినవారికే పరిమితము.

## 5

## మా నిర్దేశము

ఆకాశ తరంగములు విశ్వమంతయు వ్యాప్తిచెంది యున్నవి. తరంగముల యొక్క కదలికలోని వేగము, నిదానము వలన భౌతిక సృష్టి జరుగుచున్నది. ఆకాశము కన్న వాయువు నందు వేగము తక్కువ. వాయువు కన్న అగ్ని యందు, అగ్ని కన్న జలము నందు, జలము కన్న భౌతిక పదార్థము యందు వేగము వరుసగా తక్కువ. తరంగ జ్ఞానము తెలిసినవారికిది స్పష్టము. వేగము తక్కువ గల ప్రాథమిక సాధకుని శరీరము అత్యంత వేగము గల దివ్య శరీరపు తాకిడికి తట్టుకొనలేదు. వేగముగ నడచు వాహనము మానవుని ఢీ కొన్నచో ఎట్లుండును? అటులనే మా తరంగముల తాకిడి ఉన్నత సాధకుడు మాత్రమే భరింపగలడు. వారికి నిత్యానందము సహజ ముగా నుండును. వారి హృదయములు మా సాన్నిధ్య తరంగములను పదిల పరచుకొని ఉత్సాహముతో లోకహిత కార్యములను నిర్వర్తించు చుందురు. వారికి ఈ అనుభవము జన్మల వెంబడి నిలచిపోవును. జీవితము ఒక క్రతువుగను, ఒకే విధమైనటువంటి నిశ్చలత్వముతో కూడి పనిచేయుట అను విషయమునందు సాధకుడు శ్రద్ధ వహించ వలెను. తద్వారా తనలోని తమస్సును, రజస్సును సమన్వయపరచి సత్యమును నిలుపవలెను. ఇది మా నిర్దేశము.

## 6

## లోకహితము - హెచ్చరిక

**భూ**మి జీవుల సేవకై మరియు భూమి సేవకై మమ్ము మేము సమర్పణ చేసుకునియున్నాము. దీనినే లోకహిత మందురు. భాగవతమున దీనిని పరహితముగ బోధచేసిరి. ఈ మహత్తరసేవలో పాల్గొనుటకు సంసిద్ధత ఒక్కటియే అర్హత. తోటి జీవుల బాధా నివారణమే ఈ సేవ ధ్యేయము. మనకు తెలిసిన బాధ కన్న తెలియని బాధ ప్రపంచమున మిక్కిలిగ యున్నది. కోట్లాది జీవులను ఇట్టి దుస్థితినుండి తప్పించుటకు ఎంతమంది లోకహితులు తయారైనను, లోకహిత యజ్ఞమునకు ఇంకను ప్రస్తుత కాలమున ఆవశ్యకత కలదు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశములందలి రుగ్మత తొలగించుటకు మా ఆశ్రమము నిరంతర కృషి జరుపుచున్నది. ఇది అత్యంత బాధ్యతాయుతమైన కర్తవ్యము. ఈ కర్తవ్య నిర్వహణమున సమబుద్ధి, వికాసము లభ్యమగును. లోకహితునకు బాధా నివారణమే కర్తవ్యము. కాని ఇతరుల బాధకు తను కారణమగుట ఏహ్యమైన ప్రవర్తన. ఇది లోకహితునకు ఒక హెచ్చరిక.

**7**

## తాళం చెవి - తాళము - చెవి

**మ**నకు తెలియని దానిని తెలుసుకొనుటకు వలసిన తాళము చెవి మన వద్దనే ఉన్నది. పరిస్థితులు, తదనుగుణమైన భావములు, తెలియనితనమును తాత్కాలికముగ ఏర్పరచుచున్నవి. అది కారణముగ తెలియక పోవుట అను అసహజత్వము మానవుని చుట్టునూ అల్లుకొనుచున్నది. సన్నివేశములతో, పరిస్థితులతో సంబంధము లేక సత్సంకల్పములను నిరంతరము నిర్వర్తించు సాధకులు తప్పక పురోభివృద్ధి చెంది జ్ఞానమున నిలతురు. మంచితనము మానవ యంత్రాంగమును సత్కర్మవైపు నడుపగలదు. సత్కర్మను నిర్వర్తించు మానవ యంత్రాంగమునకు మహర్షుల బలము తోడగును. ఇది సత్యము. ఇది శాసనముగ మా బృందమున ఆచరింపబడుచున్నది.

# 8

## సుశిక్షితుడు

సాధకునకు సద్గురువు యిచ్చు మొదటి లక్ష్యము తనను తాను తెలుసుకొనుట. తన బలము, తన బలహీనతలను నిష్పాక్షిక ముగ గుర్తించుట, బలహీనతలను సరిదిద్దు కొనుటకు సంపూర్ణ అంగీకారము కలిగియుండుట. సాధన ఇతరుల గుర్తింపునకు అందక యుండునట్లు జాగ్రత్త పడుట. తాను చేయు మంచి పనులు ఇతరులకు తెలియకుండునట్లు జాగ్రత్త పడుట.

సత్సాధకునకు ఈ సూత్రములు పదుల సంవత్సరములు వర్తించును. కొందరకు కొన్ని జన్మలు కూడ పట్టవచ్చును. పై నియమములను శ్రద్ధగ నిర్వర్తించు సాధకుని ఒక ప్రత్యేక కార్యము నందు నియమించుట అపుడు కాని జరగదు. ప్రత్యేక కార్యమున నియమింపబడిన సాధకునకు అంతర్గతముగ ప్రత్యేక శిక్షణ యుండును. అతి ప్రాచీనము, సనాతనము అయిన విజ్ఞానము మరియు జన బాహుళ్యమునకు అందుబాటులో లేని విజ్ఞానము అపుడు వారికి అంతర్ముఖముగ అందింపబడును. అంతరంగమున శిష్యుడై సుశిక్షితుడగుచుండును. బహిరంగమున అతనిని అనుస

రించువారు ఏర్పడుట వలన సంఘము గురువుగ గుర్తించుచుండును (అతను మాత్రము తాను గురువనుకొనడు). ఇట్టి స్థితిలో సాధకుడు ఒక పరమ గురువు యొక్క దర్శకత్వమున నుండుట జరుగును.

సుశిక్షతుడగుచున్న శిష్యునకు కర్తవ్యమే ప్రధానము కాని భవిష్యత్తులోకి తొంగిచూచుట యుండదు. ఆధ్యాత్మికపరముగ తనకు గల ఆశలు, కలలు కనుచుండు దివ్యానుభూతులు ప్రక్కకు నెట్టి కర్తవ్యమును అహర్నిశలు నిర్వర్తించుచుండుట జరుగును. మానవ సేవను పరిపూర్ణముగ నంగీకరించి పరమ గురువు దర్శకత్వమున నడచుచుండుట వలన అభివృద్ధి కొనసాగును.

సుశిక్షితుడు తనకు తానుగ సమర్థవంతుడగుచుండవలెను. అది కారణముగ సేవ బాగుగా జరుగగలదు. సమర్థత పెరిగిననే తన వద్ద అట్టి సమర్థతను పొందువారు బృందముగ ఏర్పడుదురు. సమాజమున నలుగురకు ఉపయోగపడుట, అది కారణముగ పొందుటకన్న అందించుట మిన్నగా స్వభావమున ఏర్పడుట సాధన మార్గమున ముఖ్యము. "నేను పొందిన గదా! అందించగలను" అను భావము మెలిక పడిన భావము. అందించుచున్నవాడు మాత్రమే పొందగలడు అని గుర్తించవలెను.

ఇట్టి భావములు కార్యరూపము దాల్చినవాని ద్వారా పటిష్టమైన బృందమేర్పడి, అది సమాజమునకు బహుకాలము సేవ చేయునదిగ స్థిరపడును. సమాజమున కిట్టి కానుక నందించిన శిక్షితుడు పరమ గురువుల అనుగ్రహమును బడయుట తథ్యము.

## 9

## సహాయము

అసత్యవాదులు, సత్యవాదులను వెంటాడుట అనునది ఈ కాలములో ఎప్పుడూ జరుగుచునే యున్నది. హింసింపబడుట ధర్మమునకు తప్పదేమో అనిపించుచున్నది. అటువంటి ధర్మాత్ము లందరకు ప్రతినిత్యము మా ప్రార్థనల ద్వారా బలము అందించుచునే యున్నాము. మంచి ఆశయముల మేరకు, మంచిని పెంచటము కొరకు చేసే ప్రతి కార్యము, ప్రతి ఆలోచన, మా బృందముచే గుర్తింప బడును. వారందరకు వారి వారి ప్రార్థనల ద్వారా తగిన బలము అందింపబడును. సహనము కలిగి ఉండుట, సత్సంకల్పములను కొనసాగించుచుండుట, ప్రార్థనల ద్వారా దివ్యబలమును అందు కొనుట, లోకహితులకు అత్యవసరము.

## 10

## హెచ్చరిక

**సూ**టియైన జ్ఞానమును అందించుటకు మేము సంసిద్ధులమే కాని అందుకొనువారికి గ్రహింపుశక్తి పరిమితము. అందుచే అందించినను అందుకొనబడదు. అందుకొనబడినను అది అవగాహన యందు వక్రత చెందును. అది కారణముగ కష్ట నష్టములు కలుగును. అందుచే జ్ఞానము నందించుట ఒక మహత్తరమైన బాధ్యత. అందుచే వారి చైతన్య స్థితి గతులను బట్టి అందింపవలెనే గాని అంతకుమించి అందించుటకు అవకాశము లేదు. సహృదయముతో దీనిని మీరు అవగాహన చేసుకొనవలెను. అందుకొను విద్యార్థి మనస్సు, అందించు బోధకుని మనస్సు కన్న చంచలముగ నుండును. త్వరత్వరగా జ్ఞానమునందుకొనవలెను అను భావము ప్రాథమిక దశలో సహజమే అయినప్పటికి, సాధకుని ప్రవృత్తికి కొంత ప్రశాంతత చిక్కువరకు అందించుట సాధ్యపడదు. చెప్పబడిన వాటినన్నింటిని పాటింపక అందు కొన్నింటిని అంగీకరించుట, కొన్నిటిని నిరాకరించుట జరుగును. బోధనాంశము ఒకటియే. కావున కొంత నిరాకరింపబడి, కొంత అంగీకరింపబడినప్పుడు బోధకుడు అందివ్వ దలచుకొన్న జ్ఞానము అందుకొనబడదు.

## 11

## సూక్ష్మము

ఆకాశగమనము పురుషులకన్న స్త్రీలయందు సులభముగ సిద్ధించును. వారు పురుషునివలె ఇచ్చిన సాధనను విచికిత్స చేయరు గనుక అనుసరింతురు. గనుక పురుషులకు పరమగురువు అందించిన విషయమున విచికిత్స ఎక్కువ, విశ్వాసము తక్కువ. స్త్రీకి సహజముగ విశ్వసించుట, విశ్వసించక పోవుట అనునది అంతర్బోధనముగ జరుగుచున్నది. వారు పూర్తిగ నమ్ముటయో నమ్మకపోవుటయో ఉండునుగాని, కొంత నమ్ముట, కొంత నమ్మకపోవుట వుండదు. సూక్ష్మ లోకములయందు పయనించుటకు సూక్ష్మశరీరమవసరము. ఈ సూక్ష్మశరీరము జన్మాంతర కృషిగా నిరంతరము జరుగవలెను. కేవల మాశించినంత మాత్రమున జరుగదు. ప్రపంచము కేవలము భౌతికము కాదు అని స్పష్టముగ తెలియుటకు సూక్ష్మలోక దర్శనములు ఆవశ్యకములు. దీనికై ప్రత్యేక సాధన మాచే అందించబడి యున్నది. పదుల సంవత్సరములు సాధన చేయువారుకూడ ఈ అంశములందు శ్రద్ధ చూపుటలేదు. సూక్ష్మలోక ప్రవేశమునకు ప్రాథమిక దశలోని నిద్ర ఒక చక్కని అవకాశము. సాధనయందు పురోగమించిన వారికి ధ్యానము కూడ నవకాశముగ నేర్పడగలదు. భగవంతుని హిరణ్మయ రూపునిగ ధ్యానము చేయుట ఈ మార్గము మొదటి మెట్టు.

12

## త్రిపురము

మహాత్ముల శరీరము మూడు స్థితులలో మూడు ప్రత్యేకమైన లక్షణములు కలిగియుండును. ఇది సశాస్త్రీయమే. జన్మల తరబడి జరిగిన సత్సాధన ఫలితముగా ఈ మూడు దేహము లేర్పడుచుండును. భౌతికముగ అగుపించు రూపమే అత్యంత ఆకర్షణీయముగను, తేజోవంతముగను, రమణీయముగను ఉండి, పరిసరముల నున్న జీవులకు ప్రశాంతత కలిగించు చుండును. భూమిజీవుల శరీరముల కన్న కొంత విశిష్టముగ గోచరించుచుండును.

మహాత్ముల సూక్ష్మ శరీరము రెండు స్థితులలో నుండును. 1. బంగారు వర్ణము గలది (హిరణ్మయము), 2. వజ్రము వంటి తేజోవంతము, స్వచ్ఛమునైన కాంతి కలది. దీనినే వజ్ర శరీర మందురు. అవసరమును బట్టి ఈ మూడు శరీరములలో ఏదో ఒక దానితో కర్తవ్యములను నిర్వర్తించుచుందురు. ఇందు హిరణ్మయ శరీరముతో భూమి వాతావరణమున సంచరించుచు, కార్యములను నిర్వర్తించుచుందురు. ఈ శరీరమును భూమియందలి పదార్థము, జలము, అగ్ని, వాయువు, సంక్షోభ పెట్టలేవు. తీవ్రమైన వేడిమి,

చలి కూడ ప్రభావము చూపలేవు. భౌగోళికముగ భూమి కార్యములను చక్కపెట్టుటకు ఈ శరీరమును మహాత్ములు వినియోగించు చుందురు.

వజ్రశరీరము శాశ్వత శరీరమై అంతర్గ్రహ ప్రయాణములు సల్పుటకును, అంతర్గ్రహ కార్యములను నిర్వర్తించుటకును, వినియోగ పడుచుండును. ఇది తేజోమయము. సూర్యుని కాంతితో సమానము. దీనియందే మహాత్ములు శాశ్వతముగ స్థిరపడి దివ్యప్రణాళిక నొనర్చుచుందురు. ఈ దేహములను దీర్ఘకాలము సాధనచే క్రమముగ నిర్మించుకొనుటయే గాని, ఎవరును అప్పనముగ అందించునవి కావు. 'బజరంగబలి' యని పిలువబడు హనుమంతుడు ఇట్టి వజ్రశరీరము కలవాడని గుర్తించవలెను. వజ్రశరీరబలము అత్యంత పటిష్టమైనది. అందువలననే హనుమంతుని 'వజ్రాంగబలి' అందురు. కాలక్రమమున ఈ నామము వికృతి చెంది బజరంగబలి యైనది. మహాత్ములందరును వజ్రాంగబలులే ! చిరంజీవులే !


ఇట్టి శరీర నిర్మాణము చేసికొనిన వారిని నిర్మాణకాయులు అని బౌద్ధ సంప్రదాయమున పేర్కొనుచుందురు. ఇట్టి కాయములను నిర్మాణము చేసికొనుటకు అతి ప్రాముఖ్యమైన అంగములు (ఉపకరణ ములు) దేహమునందున్నవి. అవియే నాసాపుటముల నుండి ఉపిరితిత్తుల వరకు ఏర్పడి యున్న అవయవములు. వీనిని సాధన పరముగ సద్వినియోగము చేసికొనుట సాధకుని ప్రథమ కర్తవ్యమై యున్నది. ఈ మూడు శరీరములే త్రిపురములు.

13

## శాసనము

త్రిపురముల నిర్మాణమునకు, వాని స్వచ్ఛతకు స్పష్టతకు, ఆకర్షణీయతకు, తేజోవంతము అగుటకు అందలి అసురత్వమును సశాస్త్రీయముగ నిర్మూలించుటకే సత్సాధన. నిర్మలమైన గాలి, నీరు, ప్రశాంతమైన వాతావరణము, వెలుతురుతో కూడిన నివాసము, సాధనకు ప్రాతిపదికగ ఏర్పడవలెను. దినచర్య క్లుప్తముగాను, నిర్మలముగాను సాగవలెను. సంఘమున డాంబికమైన విషయముల యందు ఆసక్తిలేని జీవనమునలవరచుకొనవలెను. దినచర్యలో సాధనకు వలసిన సమయము ఏర్పరచుకొననివాడు సాధకుడు కానేరడు. అట్టి జీవితమును సమకూర్చుకొని పై చెప్పిన వాతావరణ మున పతంజలి చెప్పిన రీతిన ఆసనసిద్ధి పొంది, ప్రాణాయామము అను నాలుగవ యోగాంగమునకు ప్రాధాన్యము ఏర్పడవలెను. అట్టివాడే ముందు తెలుపబడిన మూడు శరీరములను నిర్మాణము చేసుకొను కార్యమున ప్రవేశించినవాడగును. ప్రాణము యమింప బడుటయే ఈ సాధనయందు మొదటి మెట్టు. మనస్సు యమింప బడిననే కదా ప్రాణము యమింపబడుట జరుగును? అందుచే నీవు

నిజముగ సాధనయందు ఆసక్తి గలవాడైనచో డాంబికము, అహంకారము, నిరుపయోగమగు మాట, చేత, తిరుగుడు, వదలి కర్తవ్యములను మాత్రము నిర్వర్తించుచు, మనోప్రాణములను యోజించుము. ఇది సాధకునకు శాసనము.



## 14

## పొట్టు - గింజ

గురు పరంపర యందుగల సభ్యులలో పది పన్నెండుమంది నామములే బాహ్యముగ తెలియబడినవి. తెలియబడని వారు వంద లుగ కలరు. వారు అందరును శతాబ్దముల తరబడి భూమి, భూమి జీవుల శ్రేయస్సుకొరకు దృశ్యాదృశ్యముగ కార్యములు నిర్వర్తించు చునే యున్నారు. మానవ జాతి వారి నుండి ఎన్నియో రకముల లబ్ధి పొందుచునే యున్నది. కాని ఎవరివలన ఈ లబ్ధి పొందుచున్నారో వారు తెరవెనుక నుండి కార్యములను నిర్వర్తించుటచే బహిర్గతముగ వారిని గూర్చిన వివరములు జాతికి తెలియవు. తెలుపవచ్చును కదా! అని మీ రడుగవచ్చును. తెలిపిన లాభమేమి? అని మే మడుగు చుందుము. ఇప్పటికి తెలిపిన నామముల నుండి మీకేమి తెలియ వచ్చినది? అనికూడ మా ప్రశ్న. చేతలు వలయును కాని నామముల గోలయేల? అందుకనే ప్రత్యేకముగ నా ఆశ్రమ వాసులు నామముల వ్యామోహమున పడక చేతలయందు నిమగ్నులై యుందురు. సత్కార్య ములకు సత్ఫలితమెప్పుడునూ కలదు. ప్రపంచపు గుర్తింపునుండి రక్షింపబడిన సత్కార్యములకు ఎక్కువ ఫలముండగలదు.

మరియు శ్రేయోదాయకమైన చేతలందరికిని సమ్మతమే. దాని కెవరి పేరుండవలెను? అన్న విషయమున సమ్మతి ఉండదు. ఒక మారు మా బృందము నందలి ఒక సభ్యునకు అమితమైన గుర్తింపు ప్రపంచమున కలిగినప్పుడు, అది కారణముగ మిక్కిలి జనాకర్షణ ఏర్పడినపుడు మేము ఒక విచిత్ర కార్య మొనర్చితిమి. జనాకర్షణ కారణముగ అతని స్వతంత్రత తగ్గుటచే, కార్యముల యొక్క జరుగు బాటు కుంటుపడుటచే అతనిని ప్రపంచము నుండి తప్పించి సత్కార్యములకు వీలు కలిపించితిమి. ప్రపంచమునకు అతడు మరణించినట్లుగ సమాచార మందించితిమి. ఆ మా సభ్యుడు మరియొక ముప్పది సంవత్సరములు నిరాటంకముగ ఆ శరీరముననే దివ్య ప్రణాళిక నిర్వర్తించి మమ్ము చేరెను. ఇది మా అవగాహన. గుర్తింపు మాకు పొట్టు వంటిది, సత్కర్మాచరణము గింజ వంటిది.


# 15

## నిరీక్షణ

**మా**పై ఆరోపణలు చేయు కుసంస్కారమునకు దిగజారకుడు. అవి కారణముగ మన మధ్యవున్న సూత్రము మీకై మీరుగ త్రుంపు కొనిన వారగుదురు. గురుదూషణము శిష్యులను అధోగతి పాలు చేయగలదు. అట్టి స్థితి మిమ్ము శపించుటవలన జరుగదు. ఏలయనగా శపించు స్థితి దాటి సర్వమును ప్రేమించు స్థితియందు మేముందుము. వెలుగును దూషించిన వానికి వెలుగు నిరాకరింపబడుట ప్రకృతి ధర్మము. వెలుగు నిరాకరింపబడిన సమయమున చీకటియే మిగులును. మీ అవగాహనమును బట్టి మా గురించి నిర్ణయములు చేయుచుందురు. సద్గురువులను గూర్చి చర్చింపకుడు. పవిత్రతకు రహస్యమను మిత్రుడు తోడుండవలెను. పవిత్రమైన విషయమును, అవసరమైనప్పుడు వివరించుటయేగాని చర్చించుట జరుగరాదు. చర్చలు విమర్శలకు దారి తీయగలవు. విమర్శలు మన సంబంధమును త్రుంచగలవు.

మేమేమి బోధించినను దానిని మీ అవగాహన మేరకు కుంచించెదరు. మేమేమి వ్రాసినను కూడ అట్లే జరుగుచుండును.

మీతో ఎట్లు మాట్లాడవలెనో, మీకెట్లు బోధించవలెనో అను విషయమునందు మేమిప్పటికీ కృషి సలుపుచునేయున్నాము. ఈ కృషికి కారణము మీరుకూడ మా అంతటివారు కావలెననే! మాపై మీకు విసుగు, నిరాశ, నిస్పృహ, కోపము, ద్వేషము కలుగుచుండును. అయినప్పటికి మీయందు మా అనురాగమున మార్పు వుండదు. మీనుండి మార్పుకై ఓర్పుగ నిరీక్షించుచుందుము.



16

## విషమ స్థితి

అమితమైన బాధ నొందుచున్నవారిని ఆదుకొనవలెనని మేముద్యుక్తులై యుందుము. కాని మాయావరణము కారణముగ మీరు బాధయందు నిమగ్నులై యుందురు గాని దైవమే ఉపాయమని తలపరు. స్వభావముచే చిక్కుపడి సమస్యలనే భావించుచుందురు. దైవమును కాని గురువునుకాని భావము నాధారముగ ఆశ్రయింపరు. తరచు, ఇట్టి సమయములందు సరియైన వారిని ఆశ్రయింపరు. సరియైన తలుపు తట్టక ఇతరములైన ద్వారములను తట్టుచుందురు. దైవమునందు నిజమైన భక్తి విశ్వాసములు గలవారు క్లిష్ట సమయమున దైవమే ఉపాయమని భావించి సర్వవిధముల దైవమునే ఆశ్రయింపవలెను. కర్తవ్యములను మాత్రము నిర్వర్తింపవలెను. ఓర్పు వహింపవలెను. నిందారోపణము చేయక ప్రార్థన కొనసాగుచుండవలెను. మీ ఉన్ముఖత్వమును బట్టి మాత్రమే దైవమునుండి సహాయము ప్రసరింపగలదు. స్వభావమున అహంకారముండుటచే సరియైన ఉన్ముఖత్వము కలుగుట కవరోధములేర్పడుచున్నవి. మీతో సహక

రించుటకు మా యందున్న ఉత్సుకత, ఉన్ముఖత్వము మీరెరుగలేరు. అసహనము కారణముగ దానిని పొందలేకున్నారు. మీ కవసర మగునపుడు మేము సహాయము చేయుటకు కూడ వీలుపడని స్థితి మీరే కల్పించుకొనుచున్నారు. ఇది నిజమైన విషమ స్థితి.



17

## ఏనుగు తొండము

ఎల్లప్పుడు చలించుచుండు ఏనుగు తొండమును చూడుము. ముందుకో, వెనుకకో, ప్రక్కలకో అది నిరంతరము చలించుచునే యుండును. అదే తొండమునకు ఒక గొలుసు తగిలించి ముందుకు సాగినచో కోరిన దిశగా ఏనుగు కదులును. తొండమునకు మునుపటి కదలికలుండవు. నీ మనస్సు ఏనుగు తొండమువంటిది, అటు నిటు తిరుగుచుండును. వ్యర్థప్రలాపములు చేయుచుండును. చేయవలసిన పనికి మనస్సును వినియోగించుము. ఇతర సమయములలో గొలుసుకు కట్టబడిన తొండమువలె మనస్సును శ్వాసతో ముడి వేయుము. ఇది కారణముగ మనస్సుకు ప్రశాంతత చిక్కుటయే గాక అంతర్ముఖము కూడ నగును. క్రియ మనస్సుయొక్క ముఖ్య లక్షణము. బహిర్ముఖముగ క్రియకు ఆవశ్యకత లేనప్పుడు అంతర్ముఖ క్రియయందుంచుము. అదియే శ్వాసను గమనించుట. ఇది మనస్సునకు నిలకడ నిచ్చును.

## 18

## మార్గానుసరణము

దైవము, గురువు యథార్థముగ వేరుగాదు. దైవదర్శనమునకు కారణమైన క్రమమంతయు దైవమే. దారిచూపు మహనీయుడు అంతర్యామియొక్క సగుణమూర్తియని తెలియును. అతడు చూపిన దారిని సందేహింపక నడచుచుండటయే నీ కర్తవ్యము. గురువాజ్ఞ తక్షణ కర్తవ్యమని భావింపుము. అనగా వెంటనే నిర్వర్తింపవలసినది కాని ఆలస్యము చేయదగినది కాదు. ఆలస్యము చేసినచో ఇతర భావములు పుట్టుటకు చోటిచ్చినట్లగును. గురువు నీ కొసంగిన బాధ్యత మౌనముగ నిర్వర్తించుటయే నీ వంతు. చర్చనీయాంశము కాదు. ప్రక్క చూపులు లేక ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించుట అనుగ్రహమునకు దారితీయును. తెలివితేటలు, సమయస్ఫూర్తి ఆ కార్యమునకే సదా సమర్పణ చేయవలెను. గురువాక్యము ననుసరించుట అనగా రైలుబండి ఎక్కుటవంటిది. రైలుబండి ఎక్కిన వానికి గమ్యము యొక్క చింత లేదు కదా! బండియే గమ్యమును చేర్చును. సందేహపడినచో బండి దిగినట్లు అని తెలియుము. మరల గురువాజ్ఞను పాటించినచో బండి ఎక్కినట్లు తెలియును.

## 19

## గురు వాక్యము

గురువాక్యము చెట్టు నీడ వంటిది. చెట్టు నీడ ఆహ్లాదమును కలిగించును. చల్లదనముననుభవింపచేయును. గొప్పకొఱకు, నలుగురి ప్రశంసల కొఱకు, గుర్తింపు కొఱకు నీడను వదిలి పోకుము. నీడ వదిలివచ్చిన వానిని ఉష్ణముయొక్క వేడిమి ఏ విధముగ బాధించునో అట్లే గురువాజ్ఞను వీడిన వానికి జీవితమున బాధలు, సమస్యలు చుట్టుముట్టును. అవివేకి అయినచో నీడను వదలి ఎండలో తిరిగి బాధపడును. చపలుడైనచో నీడలో నుండి ఎండలోనికి పోవుటయు, ఎండలో నుండి నీడలోనికి వచ్చుటయు చేయుచు గజస్నానము వంటి స్థితిని అనుభవించును. వివేకి అయినచో నీడన వుండి స్వకార్యము, స్వామికార్యము చక్క పెట్టును. పులి నోటబడినది ఎట్లు తిరిగిరాదో, గురువాక్యము నందు శ్రద్ధ కలిగినచో తిరిగిరాని పురోగతి తథ్యమని తెలియుము.

## 20

# ఆలోచనము


ఈ 20వ శతాబ్దము మానవుని గొప్ప ఆలోచనాపరునిగా చేసినది. ఆలోచనలో గల శక్తి కూడా మానవుడు ఈ శతాబ్దముననే ఎక్కువగా అవగాహన చేసుకున్నాడు. ఆవేశముకన్నా ఆలోచన మనిషిని ఉన్నత స్థితియందు వుంచగలదని తెలుసుకునియున్నాడు. మానవజాతిని నడుపుచున్నది మనిషి ఆలోచనే! మానవుని ఆలోచన గురించి కూడా ఈ శతాబ్దమున మిక్కుటముగా శాస్త్రములేర్పడు చున్నవి. మానవ తత్త్వశాస్త్రము, మేధస్సును గూర్చి రకరకములైన గ్రంథములేర్పడుచున్నవి.

ప్రాచీన భారతీయులు, గ్రీకులు, ఆలోచనయొక్క శక్తిని పరిపూర్ణముగా తెలిసినటువంటి వారు. మానవుని వివేచనాశక్తి ఎంత నిర్మాణాత్మకమో, అంత అపాయకరమని కూడా తెలిసి, పామరులకు అట్టి అపారశక్తిని అందించుటకు నిరాకరించినారు. అది పిల్లవానికి కత్తినందించు నట్లేనని భావించినారు. ఈ కాలమున విచక్షణా రహితముగ సమస్త విషయములూ, అందరికీ అందుబాటులోకి

కొనితెచ్చుట వలన మానవుడు తనకు తానే సమస్యలు సృష్టించుకొనుచున్నాడు.

పరిణతి చెందినకొలదీ జ్ఞానమునందించుట పూర్వీకుల సంప్రదాయము. పరిణతి లేనివారి చేతిలో అట్టి జ్ఞానము వినాశ హేతువగును. 'మొరటువానికి మొగలిపువ్వు – పందికి ముత్యాల హారము' విలువ తెలియదను సామెత అందుకే పుట్టినది.

పవిత్ర విషయము లందుకొనుటకు ఉపాధికూడా పవిత్రముగ నుండవలెను. చక్కని, చిక్కని పాలు మురికిపాత్రలో నుంచినచో అవి ఎట్లు ఉపయోగపడవో, అట్లే మనస్సు, ఇంద్రియములు, శరీరము– అను మూడు పొరలు గల దేహములో మలినము గలవారికి సద్విషయములుపయోగపడవు. మంచి ఆశయములు మంచి ప్రవర్తన గలవారి నుండియే సిద్ధింపగలవు. చెడు ప్రవర్తనగలవారి యందు అవి వికటించును. శ్రేష్ఠమగు ముడిపదార్థములున్నప్పటికీ వంట వానిని బట్టిగదా అవి రుచి యిచ్చును. గనుక, అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశములను పరిశుద్ధముగనుంచుకొన్న వారికి ఆలోచనము, వివేచనము, ఆశయసిద్ధి కలుగును. ఇతరులకు కలుగవు.



## 21

## వజ్ర చైతన్యము

నిద్రనుండి మేల్కొంచు క్షణము అత్యద్భుతమైనది. సూక్ష్మ లోకముల నుండి స్థూల లోకములకు దిగివచ్చు అద్భుతమైన సమయ మిది. ఆ క్షణమున జీవులు సూక్ష్మలోకముల ద్వారములను మూసు కొనుచు స్థూలలోకముల ద్వారము తెరచుకొనుచు అంతర్ బహిర్ ప్రపంచముల మధ్య నుండును. ఆ క్షణమున జీవుని చైతన్యస్థితిని వజ్రచైతన్య మందురు. ఈ చైతన్యమున నిలబడ గలుగు సాధకునకు సూక్ష్మ స్థూల లోకముల విషయములకు తెర తొలగింపు జరిగి అద్భుత ప్రజ్ఞావంతుడు కాగలడు. ఈ క్షణములు అత్యంత విలువైన క్షణము లుగ సాధకుడు గుర్తించి ప్రతిదినము ఆ క్షణములయందు ప్రశాంత ముగ వుండుటకు ప్రయత్నింపవలెను. అట్లుండిన సాధకునకు నిద్రలో తనయందు కలిగిన వివిధములైన వికాసములు, దివ్య బోధనలు, దివ్య ప్రణాళిక, తన వంతు కర్తవ్యము చక్కని జ్ఞపికి రాగలవు. కల నుండి మెలకువ వచ్చిన వానికి కలలోని విషయములు ఎట్లు స్పష్టములో అట్లే వజ్ర చైతన్యమును నున్నవానికి దివ్యలోకములు స్పష్టములగును. బ్లావెట్స్కీ యను ఉపాసిక ఈ చైతన్యమున వున్నప్పుడు భూగోళ, ఖగోళ రహస్యములను దర్శించెను.

# 22

## స్త్రీ

పరిణితి చెందుటకు జీవునియందు ప్రజ్ఞ–ప్రకృతుల సమతూక మావశ్యకము. ఒకదానినొకటి దమించుటకాక, అవగాహన చేసుకొని సామ్యమును పొందుట జరుగవలెను. ప్రకృతి ధర్మములను నిర్లక్ష్యము చేయువారు ప్రజ్ఞామార్గమున దీర్ఘ ప్రయాణము గావింపలేరు. శరీర ధర్మములను మన్నించుచు వానికి లోబడక ప్రజ్ఞను పెంపొందించు కొనవలెనేగాని, వాటిని నిరాకరించి కాదు. సృష్టియందు సమస్త విషయములు సమతూకముననే రాణించును.

గత కొన్ని శతాబ్దములుగ కొన్ని ధర్మములు జాతిచే నిరాద రింపబడినవి. నిరాదరణపొందిన వర్గములను ప్రోత్సహించి, బల పరచుట కూడ మేము చేయు కార్యములలో నొకటి. గత కొన్ని శతాబ్దములుగ స్త్రీలు నిరాదరింపబడిరి. పురుషులు తమ ఆధిక్యముతో స్త్రీలను పరిపూర్ణముగ వంటింటి కుందేళ్ళుగ చేసినారు. స్త్రీకి సంఘమున సమాన గౌరవము దక్కునట్లు మేము సమాజములో ఉద్యమములను ప్రోత్సహించుచుందుము. ఈ ప్రోత్సాహము వారికి న్యాయముగ దక్కవలసిన స్థానము హక్కుల పోరాటముగ మారినది. సమాజమున స్త్రీకి గౌరవనీయమైన స్థానము దక్కనంత వరకు, జాతికి సమగ్రమగు పురోగతి ఉండదు. ఇది గమనించవలెను.

# 23

## మా అస్తిత్వము

**మా** గురుపరంపర అస్తిత్వమును నిరాకరించకుము. ఈ భూమి జీవులకు మా పరంపర పట్టుకొమ్మవంటిది. నీ హృదయమున మా అస్తిత్వమును అంగీకరించినచో నీవు బలవంతుడవై ప్రాణికోటిని రక్షించు ఒక మహాయజ్ఞమున ఒక భటునివలె పాల్గొనగలవు. మమ్ము ఊహించినంత మాత్రముననే మా నుండి నీకు తగు మోతాదులో శక్తి లభించగలదు. క్రమశః మా అస్తిత్వముపై నీకు పరోక్షముగ విశ్వాసమేర్పడగలదు. మేమున్నామనుట సత్యము. ఈ సత్యమును నిరాకరించకుము. ఆపై నీకు గల దృఢ విశ్వాసము నీ ఉజ్జ్వల భవిష్యత్తునకు వంతెన వంటిది. మమ్ము గౌరవించు భావముగాని, హేళన చేయు భావముగాని, మమ్ము చేరగలవు. మమ్ము హేళన చేయువారు ఆపదలను కొనితెచ్చుకొందురు. అది ప్రకృతి ధర్మమేగాని, మా ఆగ్రహము కాదు. తాము చూడలేదు కనుక కొందరు మేము లేమను కొందురు. ప్రపంచమున ఎవరును అన్నియును చూడలేరు. మనము చూడనివి లేవనవచ్చునా? 'మేము లేము' అనువారి తెలివికూడ యిట్టిదే!

## 24

## ధీరత

దుష్టచర్యలను, భాషణములను మృదువుగ ఖండింపకున్నచో అట్టి చర్యలను చూచువారిని, భాషణములు విన్నవారిని అధర్మము స్పృశించును. అట్లే అవసర సమయములందు మంచి మాట, మంచి చేత చూపనివారిని కూడ అధర్మము స్పృశించును. తగినంత మాట, చేత, సహాయము చేయకుండుట అధర్మమని తెలియవలెను. మంచిని నిరాదరణ చేయుట, మౌనముతో నిరాశ పరచుట ధర్మమునకు చేటు. ఇతరుల మంచిచేతలను మంచిమాటలతో ప్రోత్సహించవలెను. రంధ్రాన్వేషణము చేయరాదు. మంచి విషయములయందు ఉదాసీన తను మేమంగీకరింపము. అటులనే చెడు విషయముల యందు ఉదాసీనతను కూడ అంగీకరింపము. చెడును ఖండించుచు, మంచిని ప్రోత్సహించుచు, ముందుకు సాగువాడు ధీరుడు. అట్టివాడు మాకు ప్రేమ పాత్రుడు. ఇట్టి ధీరత్వమునకు పిరికితనము మొదటి శత్రువు. పిరికివానికి ఈ ప్రపంచమేమియు ఆనందమునీయజాలదు. మీ యందు ధీరతను పెంపొందించుటయే మా కర్తవ్యము.

# 25

## మానవత

**జ**న్మ లెత్తుటకును, శరీరములు ధరించుటకును మేము వెనుకాడము. మేము శరీరములు ధరించినపుడు విశిష్టముగ గోచరింపము. మీవలెనే మీలో ఒకరుగ ఉందుము. ప్రవర్తనమున మేము చూపు మానవతా విలువలను బట్టియే నిశితబుద్ధితో మమ్ము గుర్తింపవచ్చును గాని, మరియొక మార్గము లేదు. మా చేతలు చాల నిరాడంబరముగను, శ్రేయోదాయకముగను ఉండును. జీవితమున ఆడంబరమును విసర్జించినవారే మమ్ము గుర్తింపగలరు. దివ్య ప్రక్రియలు ఏమియు చూపక, పరిపూర్ణమైన మానవతా విలువలను మాత్రమే ప్రవర్తనమున చూపుదుము. ఈ విషయమున మాకు శ్రీరాముడే ఆదర్శము. మీరును మానవతా విలువలను పెంచుకొనుచు హృదయ కేంద్రమును చేరుడు. దివ్య శక్తులకై ప్రాకులాడవలదు. భ్రమ పడవలదు. అవి మీయందు భాసించినను మీవిగ తలచవలదు. శ్రీరాముని నుండి జగత్కళ్యాణముగా ధర్మము స్థాపింపబడినను ఆతడు మానవుడుగనేయుండెను గాని, తాను విశిష్టుడనని భావింపలేదు.

మన మార్గమున శ్రీరాముడు ఆదర్శనీయుడు. శ్రీకృష్ణుడు పూజనీయుడు.

26

## కర్తవ్యము

**గా**డిద బరువులు మోయుట చూచుటలేదా? బరువులు మోయుచు అది కొండలు కూడా నెక్కగలదు. నీవు మానవుడవు. గాడిద, ఎద్దు, దున్నల కన్నా పరిణితి చెందినవాడవు. నీవు మానసిక బరువులకు క్రుంగనేల? అత్యంత భయంకరము, ప్రతికూలమునగు పరిస్థితుల యందు కూడ గాడిద శ్రమపడి నీ కార్యము నెరవేర్చు చున్నదిగదా! నీ వేల జంకెదవు? కర్మానుసారము వచ్చుచుండు సంఘటనలను అప్రమత్తతతో ఎదుర్కొని నిర్వర్తింపుము. కర్తవ్యమున నీవుండుము. నీ యందు మేముందుము. సమయమును ఏ మాత్రమూ వృథా చేయకుము. మామకులతోను, కాముకులతోనూ కాలము వెచ్చింపకుము. ఈ సూత్రములను పాటించినచో, మా సంకల్ప బలమును కూడా నీకు దన్నుగనందించి కార్యమును సుగమము చేయుదుము. నీ కందించిన కర్తవ్యమును వీడక, ముందుకు సాగుము. మర్యాదలకు, మన్ననలకు సమయమును బలిచేయకుము.

# 27

## నా యనుసంధానము

**నా** ధైర్య స్థైర్యములను నీ కందించెదను. నా యధీనమున నున్న అవకాశము లన్నింటినీ నీకు అందించెదను. "నా" యను సంధానమున చెదరక మార్గమున పురోగమింపుము. "నా" "నీ" యను బంధము అతి పవిత్రము. దానిని గూర్చి చర్చింపకుము. జీవితమందలి సన్నివేశములకు వెఱవకుము. వెఱపు కలిగినచో నా బోధనలను పఠింపుము. నీకు వెఱపను తెర పొగమంచువలె కఱగి కర్తవ్యము స్పష్టముగ గోచరించును. నా బోధనలను మరల మరల పఠింపుము. అవి నీకు పరిపరివిధముల నుపయోగపడగలవు. సత్య ప్రమాణముగల పనులయందే నిమగ్నమగుము. ప్రపంచ సంబరముల యందు కాలము వృథా చేయకుము. నీవు అనంత దర్శనముకొరకై అనంతప్రయాణము చేయుచున్న బాటసారివి. మార్గమున విశ్రాంతి తగుమాత్రమే గొనవలెను. చతికిలబడినచో యానము సాగదు.

## 28

## మా బోధనలు

**మా** బోధనలు మార్గమున నడచువారికే. వారిని ప్రోత్సహించుటకు, మరింత మేలుకొలుపుటకు, త్వరితగతిని సాగుటకు యివి ఉపయోగపడగలవు. నడచువాని పాదములకు రెక్కలు వంటివి నా బోధనలు. తేలికగ, హాయిగ, నిర్భీతిగ, ధీరతతో ముందుకు సాగుటకివి ఎంతయూ నుపయోగకరములు. గతమున ఎన్ని సమయములందు, సన్నివేశములయందునివి ఉపయోగపడినవో, భవిష్యత్తునందు కూడా అట్లే నుపయోగపడగలవు. మా పరిచయ మేర్పడిన వారికి తీరుబాటు వుండదు. పనులయందే విశ్రాంతి. ప్రత్యేకముగ విశ్రాంతిగొనుట, విహార యాత్రలు చేయుట, వేసవి శలవులు, యిత్యాది విషయములకు తావుండదు. అనంతమను జీవిత గ్రంథము చదువగోరువారు పేజీలను త్వరత్వరగ పఠింపవలెను కదా! అట్టి యజ్ఞమయ జీవిత ప్రవేశమునకు సంకేతమే మా పరిచయము. మా పరిచయమున మీ పసితనము మాయమై కార్యదీక్షాపరులు కాగలరు.

## 29

# మేలుకొలుపు

**ఆ**త్మబలమున ముందుకు సాగుటయే గాని, మీనమేషముల లెక్కించుచూ చతికిలబడరాదు. ఆత్మబలమే బలము, ఆలంబన. మరియొక తావున బలముకై వెదుకకుము. కార్య నిర్వహణము, కార్యసిద్ధికి తోడ్పడుచుండగ, కార్యసిద్ధి ప్రార్థనలకు ఊపిరి నిచ్చుచుండ, బలమును వృద్ధి పొందించుకొనుచూ, పరహిత యజ్ఞమున ముందుకు సాగుము. ఈ మార్గమున నీ చుట్టునూ దివ్యకవచ మేర్పడి రక్షింప బడుచుందువు. కవచమునకై ప్రత్యేక స్తోత్రములవసరము లేదు.

ప్రపంచ సంఘటనల యందలి సందేశములను శ్రద్ధతో గమ నించుము. నీ జీవితమందలి మలుపులను కూడా గమనించు చుండుము. వీనినుండి, నీ శ్రద్ధను బట్టి భవిష్యద్వాణి తెలియగలవు.

మా బోధనలను కేవలము చదువుటయేగాక, శ్రద్ధతో పఠింపుము. అవి నిన్ను అనునిత్యమూ మేల్కొల్పగలవు.

30

## పరహితము

పరహితము! పరహితము!! పరహితము!!! పరహిత జీవనమే జీవనము. పరహితము పరమ ధర్మము. పరహితమే ఊపిరి. పరహితమే ప్రాణము. పరహితులు మాకు ప్రాణము. వారి ప్రాణములు మాకు అత్యంత విలువగలవి. వారిని మేము సదా కాపాడు కొనుచుందుము.

పరహిత మహాయజ్ఞము ఆత్మ సామ్రాజ్యమునకు ముఖ ద్వారము. పరహితుడు ఆ ద్వారమునుండి మరియొక ప్రపంచమున అడుగిడును. అతని ప్రపంచము కూడా ఈ ప్రపంచమునందే యున్నది. కాని, దాని స్వరూప స్వభావములు వేరు. అందు సహజ మగు ప్రేమ, నిర్మలత్వము, ఆనందము, శాంతి లభించును. ఆత్మ సేదదీరును. ఆత్మకు బలమేర్పడి, కాల వశమున నేర్పడుచున్న కారుమేఘములు చెదరును. కాంతి పెరుగును. పెరిగిన కాంతి క్రొత్త అవకాశముల నేర్పరచుచుండును. పరహిత కార్యము మరింత చురుకుగా సాగును. దివ్యధనమట్లు పెరుగును.

## 31

# అస్వస్థత

**అ**స్వస్థత తరచుగ కార్యసాధనమును తీవ్రతరము చేయ గలదు. లోకహితులు అస్వస్థులైయుండుట కద్దు. పైథాగరస్ మహాశయునకు కూడా గుండెజబ్బు యుండెడిది. మహత్కార్య సాధనకు ముందు శరీర మస్వస్థతకు గురి యగుట సర్వసామాన్యముగ లోకహితులందు కనపడుచుండును. దీనికై ప్రత్యేకశ్రద్ధ వహించ నవసరము లేదు. శ్రద్ధ మాత్రము అవసరము. లోకహితుని మనసు, శరీరకోశముల యందవసరపడు మార్పులను మేము నేర్పుతో నిర్వహించెదము. లోకహితుని శరీరము, మనస్సు మా యధీనమున నుండును. లోకసహజమగు తగు మాత్రపు శ్రద్ధ వారు పాటింప వలెనేగాని ప్రత్యేకముగ విశ్రాంతి గొనుట, విరామమునకాశించుట తగవు. కార్యమునందే విశ్రాంతి. అనారోగ్యము కూడా పనికివచ్చు విషయమే! సృష్టియందు పనికిరానిది లేదని వేదము తెలుపుచున్నది. సృష్టియందలిదే అనారోగ్యము కూడా!

## 32

### సూచనలు-1

గర్భిణులు మహాత్ముల నేత్రములను దర్శించుట, ధ్యానించుట మరియు ప్రకృతి రమణీయతను ఆస్వాదించుట, గర్భస్తులగు జీవులకు అత్యంత ప్రయోజనకరములు.

* * *

తనకు ఉన్నది పంచువానికి, మరిన్ని దివ్యవిషయములు అందించబడును. వస్తుసంపద కోరనివానికి ఆకాశశరీరము త్వరిత గతిని ఏర్పడగలదు.

* * *

తనయందలి సరుకును బట్టి మనసు, ఇంద్రియములు, శరీరము బాహ్యమున ప్రతిస్పందించును. తిండిపోతుకు తిండి యందు, వదరుపోతుకు నాలుకయందు, తిరుగుబోతుకు తిరుగుడు యందు, సోమరిపోతుకు నిద్రయందు, కాముకునకు స్త్రీలయందు యిట్టి ప్రకంపనములు కలుగుచుండును. లో సరుకు చచ్చుగనున్నచో చచ్చు విషయములందాసక్తి కలుగును. సరుకు నాణ్యమైనది అయినచో సృష్టి యందలి నాణ్యమైన విషయములు గోచరించును.

33

## సూచనలు - 2

**బ**యటి బంగారముపై మోజు గలవారికి లోపలి బంగారము దొరకదు. నా బోధనలు బొత్తిగ వారికి రుచింపవు. శ్రీ ధ్యానమున లో బంగారమును గ్రహించి, పై బంగారమును నిరసించుము. ఇది నీకు బంగారు కవచమార్గము!

బంగారముపై మోజు అని తెలుపగనే స్త్రీలను చూచి వెక్కిరించ కుము. ధనాసక్తి దాని మారుపేరు. పురుషునకు ధనాసక్తి, స్త్రీకి నగలయం దాసక్తి అంతములేని విషయములు. అవి విషవలయ మునందిద్దరినీ బంధించగలవు. ఇది నా హెచ్చరిక!

* * *

కర్మ ముంచుకు వచ్చినపుడు చేయగలిగిన దేమియూ లేదు. దాని స్వరూప, స్వభావముల తీవ్రత తగ్గించుకొనుటకు నిర్మలముగ, నిశ్శబ్దముగ, నిరాడంబరముగ, తెలియని జనులకు సహాయ సహకారములందించుము. అదియే నారాయణ సేవ!

34

## స్వచ్ఛంద బోధ

సాధన, సేవ, మా బోధన స్వచ్ఛందమే కాని, బలవంతము కాదుసుమా! మనసుకు నచ్చని మార్గము దుర్భరము. నచ్చజెప్పి కార్యమార్గమున దిగుము. పై మూడు విషయములూ నీ కొరకే, మా కొరకు కాదు. నీ మనసుతో నీవే మాటాడుకొనుము, మేము మాటాడము. మేము నీతో మాటాడుటకు సంసిద్ధులము కాని, నీ మనసుతో కాదు. నీ మనసు కళాకళలను ప్రదర్శించుచుండును. దానితో నీవు పడు తిప్పలు నీయందు మాకు జాలి కలిగించు చుండును. నిన్ను మేము బలపరుతుము. నీవు మనసును స్థిరపరు చుము. స్థిరపడిన మనస్సు బుద్ధిని ప్రతిబింబింపచేయగలదు. మేము నీకు, నీ మనసుకూ జ్ఞానప్రసారము చేసుకొనుచూ సాగుదము గాక! బోధ వినని మనసు, మాట వినని భార్య వంటిది. నీ భార్యతో మాటాడుటకు నీవే భయపడినచో, మేమేమి చేయగలము? వేచి వుందుము.

## 35

## నా దర్శనము

నిన్ను నీవు దాచుకొనకుండ, దివ్య కారణమునకు సమర్పణ చేసుకొనినచో మా సాన్నిధ్యమును చేరగలవు. దివ్య కార్యమున మమ్ము దర్శింపగోరినచో ఈ క్రింది సంకేతముల యెడల అప్రమత్తుడవై యుండుము.

*వానచినుకు నీ కిటికీపై పడిన క్షణమున – నా సాన్నిధ్యము దొరుకును.*

*నేలరాలు పండుటాకును గాలి పైకెగుర వేసుకొని పోవు క్షణమున – నా సాన్నిధ్యము దొరుకును.*

*తొలి సూర్యకిరణము మంచును వెచ్చగా తాకిన క్షణమున – నా సాన్నిధ్యము దొరుకును.*

*మనసున అప్రయత్నముగ ఆనందము కలిగిన క్షణమున – నా సాన్నిధ్యము దొరుకును.*

*ఆలయపు మెట్లలో ప్రతి ఏడవ మెట్టునందు – నా సాన్నిధ్యము దొరుకును.*

పై మార్గములలో సాన్నిధ్యమునకు రుచి దొరికినచో, నా దర్శనమునకు వలసిన ద్వారము తెరువబడినట్లే! నీ అప్రమత్తత, దివ్యకార్య నిర్వహణము నా దర్శన ద్వారమును తెరుచు తాళపు చెవులు.

**36**

## ఆశంసనము

నా కిరణము నీ ప్రాణ స్పందనము
నా కేతనము నీ చేయి
నా కవచము నీ గర్వకారణము
నా ఆశ్రమము నీ స్వస్థానము
నా శిఖరము నీ ఆనంద స్థానము
నా ఆజ్ఞ నీ కర్తవ్యము
నా దర్శనము నీ సకలము
మా సోదరబృందము స్ఫూర్తి
నిన్ననుశ్యూతమూ నడిపించుగాక!

* * *

పగలంతయూ శ్రమించుము
రాత్రంతయూ విశ్రమింపుము
మా సాన్నిధ్యమున రమించుము.

* * *

మన విధిని మన ప్రార్థనల ద్వారా గ్రహింతము!

## 37

## విలువైన సలహా

**సిం**హమువలె ముందుకు సాగుము. నీ సత్ప్రవర్తనమే నీకు కవచము.

* * *

కలతచెందక, చిరాకుపడక ముందుకు సాగుము. చిరాకుపడు మనసు గాజుపాత్ర వంటిది. అది ఎప్పుడైననూ బ్రద్దలు కాగలదు.

వెండిపాత్ర (!) రాతిపాత్రకన్ననూ యీ విషయమున భద్రమైనది. నీ మనసును వెండిపాత్ర చేసికొనుము.

* * *

పవిత్ర జీవనమునకు సంఘ సత్కారములు, గుర్తింపు అంతరాయమును కల్గించును. పొగడ్తల ఉక్కిరిబిక్కిరిలో అంతరాత్మ ప్రబోధము అరణ్యరోదనమగును. సంఘమున నింద ఎంత అంతరాయమో, పొగడ్త కూడా అంతియే. నిందాస్తుతులను తలకెక్కించుకొనక, నీ సమస్త కార్యములందునూ ధర్మపరిపాలనము కావించుము.

* * *

సంఘమునకు మేలు చేయుము. జనసమూహమునకు దూరముగ నుండి చేయుట శ్రేయస్కరము.

38

## నిద్ర - స్మృతి - 1

నిద్రా సమయమున దేహమునకు భూమినుండి కొన్ని భౌగోళిక తరంగములు అందింపబడును. అది కారణముగ దేహము ఉపశమనము పొందును. కాని ఈ తరంగములయందు తమస్సు ప్రధానముగ నుండుటకు మానవ చైతన్యస్ఫూర్తి స్మృతికి అంతరాయ ములు కలిగించును. ఇది కారణముగ నిద్రయందు సమస్తమును మరచు స్థితి ఏర్పడును. గాఢనిద్ర సర్వమును మరిపింప చేయును. మొద్దునిద్ర పోవువారు నిదుర లేచిన తరువాత కూడ ఎక్కువగ మరపు గలవారుగ నుందురు.

మరపు గలవారు నిద్రపోవు విధానమునందు మార్పులు చేసుకొనవలెను. మొదటగ పగటి నిద్రను కోరరాదు. రాత్రి నిద్రపోవు సమయమున నిదురలోకి ఎట్లు పోవుచుంటివో గమనించుచు నిద్రలోకి పోవలయును. మెలకువ నుండి నిదురలోనికి పోవు విధానమును వీలున్నంత వరకు గమనించుచుండవలెను. ఈ గమనిక వలన స్మృతి చెడదు. క్రమశః ఈ అభ్యాసము స్మృతి చెడక దేహమునకు విశ్రాంతి నిచ్చు పరిస్థితి వరకు పరిమితి చెందును. అట్టి పరిస్థితి పొందినవారు మరణించినను వారి స్మృతి చెడదు. కావున స్మృతికి, తనకు మరణ ముండదు.

39

## నిద్ర - స్మృతి - 2

నిద్రను గమనించుచు స్మృతియందున్న వానికి మెలకువ నుండి నిద్రలోనికి పోవు సమయమున సూక్ష్మలోక దర్శన స్పర్శనములకు అవకాశముండును. ఈ లోకమున స్మృతి, నిద్ర మెలకువకాక యుండును. ప్రారంభమున స్వప్నముగ గోచరించినను స్వప్నము కన్న ప్రస్ఫుటముగ నుండును. అట్టివాడు ఒక నూతన మెలకువ కలిగిన వాడగును. ఇది అభ్యాసము వలన ఏర్పడగలదు. అందుచే నిదురలోకి పోవుటకు సంబంధించిన క్రమశిక్షణమును చక్కగ పాటింపవలెను. తాను పడుకొను ప్రదేశము పరిశుభ్రముగ నుండవలెను. ఎక్కువ వస్తువులతో నిండి యుండరాదు. గాలి పారుటకు వీలుగ కవాటములుండవలెను. కిటికీలు, తలుపులు మూసుకొని పడుకొనరాదు. వట్టి నేలపై పడుకొనరాదు. శుభ్రమైన వస్త్రమును చాపపైగాని, మంచముపైగాని వేసుకొనవలెను. ఉత్తర ముఖముగ తల పెట్టుకొనకుండ ఇతర దిక్కులయందు శిరము నుంచుకొనవలయును. అవకాశము మేరకు పడక గదియందు దీపము, అగరవత్తులు వెలిగించుకొనవలెను. కాళ్ళు కడుగుకొని మనసును ప్రశాంతము చేసుకొని నిదురలోనికి ప్రవేశించవలెను. పడక ప్రదేశమున సద్గురు బోధనా గ్రంథములను గాని, ఇతర సద్గ్రంథములను కాని ఉంచుకొనవలెను.

## 40

## నిద్ర - స్మృతి - 3

సద్గ్రంథములను ఒకించుక పఠనము చేసి నిద్ర కుపక్ర మించవలెను. తనయందు జరుగు స్పందనములను గమనించుచు వేచి యుండవలెను. నిద్ర కలుగుచున్నను స్మృతి యందుండుటకు ప్రయత్నింపవలెను. నిద్ర తేలిపోవునేమో అను భయము అవసరము లేదు. వచ్చు నిద్ర నెవ్వరును ఆపలేరు. రాని నిద్రను గొనితేలేరు. ఇట్లు స్మృతియందు పట్టు కలిగియుండగ ముందు తెలిపినట్లుగ సూక్ష్మలోక దర్శనమున కవకాశము కలదు. ఈ లోకమున సాధకు లెందరో బృందములు బృందములుగ సుశిక్షితు లగుచుందురు. వారియందు వివిధ ప్రాంతములవారు, దేశముల వారు కూడ నుందురు. అందరికిని సత్సంగము జరుగుచుండును. తెలిసినవారు ఒకరిద్దరు కూడ అగుపడవచ్చును. అక్కడ జరుగు బోధలు మానసిక బోధలే కావున భాష యుండదు. అటుపైన ప్రతి ఒక్కరును మానసిక బోధ తమ భాషలోనికి భావము చేయుదురు. బోధనము మానసికము గాన సుదీర్ఘమైన బోధన బహుకొద్ది క్షణములలో అగును. స్మృతి యందు బోధన ముద్రింపబడును. అటుపై నిద్రలో మరచినను మరొకప్పుడు మెలకువలో ఆ బోధనలు వినినప్పుడు ఇంతకు ముందు ఎప్పుడో విన్నట్లు భాసించును.

41

## నిద్ర - స్మృతి - 4

**జీ**వితమున చాలా మందికి చాలాసార్లు సంఘటనలు జరుగుచున్నప్పుడు, ఇదివరకే వాటిని చూచినట్లు అనిపించుట యుండును. ఇదివరకు యిదే సన్నివేశమును చూచితినే అను భావన గలుగును. అట్లే కొన్ని బోధనలు విన్నప్పుడు ఈ బోధనలను యిదివరకే వినియుంటిని అనిపించును. కాని ఎప్పుడు కనెనో, ఎప్పుడు వినెనో మాత్రము గుర్తుకు రాదు. నిద్రయందు స్మృతిని వీడని అభ్యాసము పెరిగినకొలది జీవునియందు రెండు పేటల జీవితము మొదలగును. బహిరంగమున ప్రస్తుత జన్మకు సంబంధించిన కార్యకలాపములు నడుచుచుండగ నిద్రా సమయమున సూక్ష్మలోకములలో సనాతనమైన జీవునకు సంబంధించిన కార్యకలాపములు జరుగుచుండను. అప్పు డప్పుడు జీవుడు సూక్ష్మలోకములలో పొందిన అనుభవములు మెలకువలో కూడ పొందుట జరుగక రెండు పేటల జీవనమునకు ఒక అనుసంధానము ఏర్పడుట మొదలగును. ఈ రెండు జీవనముల మధ్యగల ఉలిపిరి తెర ప్రాథమిక దశలో గోడవలె నుండి పూర్వ స్మృతిని తెలియనీయక అడ్డగించును.

**42**

## నిద్ర - స్మృతి - 5

నిద్రలో స్మృతి ననుసరించు సాధన ముందుకు సాగగ, ఒక క్రొత్త ప్రజ్ఞ ఉపదేశ మార్గమున మేల్కొలుపుట జరుగును. ఇది సామాన్యముగ గురువునుగ్రహముగ జరుగును. సంచితకర్మ ననుభవించుచు, ధర్మమార్గము వదలక దీక్షా నియమములతో జీవించువారి కిది సాధ్యపడ గలదు. ఈ క్రొత్త ప్రజ్ఞ ఏర్పడు వరకు యేజన్మకాజన్మ మృత్యువుతో అంతమగుచుండును. సంస్కారములు మాత్రము ధర్మానుష్ఠాన బుద్ధి కారణముగ సంస్కరణము చెంది నూతన ప్రజ్ఞ మేల్కొనుటకు వలయు సన్నివేశమునకు దారితీయును. ఈ లోపల సూక్ష్మలోకములందు పొందిన విద్య, ఉపదేశములు మాత్రము సూత్రమువలె జన్మల పూసలలో దారమై యుండును.

ఒక్కొక్క జన్మకు ఒక్కొక్క పేరుండును. అది కాక యిన్ని జన్మలలోను వ్యవహరించుటకొక సంకేతనామ ముండును. అజ్ఞాత ముగ ఆత్మకు యిన్ని జన్మలయందు సాధన జరుగు చుండును. జ్ఞాతముగ ఒక్కొక్క జన్మలోని కర్మ కార్యక్రమమును చక్కబెట్టుకొనుచు

జీవుడు ముందుకు సాగును. ఇందు మొదటి దానికి గురువు బాధ్యత వహించును. రెండవదానికి సాధకుడు తనకు తానే పూర్తిగా బాధ్యుడు. ఈ రెండు పేటల జీవితము తెలియజేయుటయే లేక అనుసంధాన మగుటయే నిద్రయందు స్మృతి సాధన సాఫల్యము. దీనివలన మృత్యువును దాటవచ్చును.

## 43

## నిద్ర - స్మృతి - 6

నిద్ర – స్మృతి అభ్యాసము ముందు తెలిపిన రీతులలో దీర్ఘకాలము అభ్యాసము చేసినవానికి సూక్ష్మలోక పరిచయము పెరుగును. భౌతిక దేహముండగనే ఈ సాధనను పరిపూర్తి గావించు కొనవలెను. తరచు సూక్ష్మలోకానుభవము పెరుగగ నిద్రయందు, మరణమందు జరుగు స్థితి మార్పునకు జీవుడు సులభముగ అను సంధానము చెందును. పై కారణముగ నిద్రాసమయము ఒక ఏకాంత ధ్యాన మందిరముగ సాధకునకు సువర్ణ అవకాశ మగును. నిద్రను సద్వినియోగము చేసుకొనుట నిజమైన తెలివి. పై విధముగ సాధన జరిగినవారికి జన్మలు మారినను స్మృతి చెడదు. ఈ విషయమున గురుపరంపర ఎంతయు సహకరించును. దీనినే భారతీయులు పరిపూర్ణ స్ఫూర్తితో మరణ సమయమున దైవస్మరణ చేయుచు దేహమును వదలుటగ కోరుచుందురు. ఇది సగటు భారతీయుని ఆకాంక్ష. ప్రతి దినము నిద్రలోకి పోవుట ఒక విధమైన మరణమే గనుక పై సాధనను దైనందినముగ నిర్వర్తించుకొను వారికి అభ్యాసము కారణముగ మరణము విశేష ఘట్టము కాక సామాన్య సన్నివేశముగ నుండును. పై విధముగ స్మృతిని జన్మజన్మలకు కలిగి యుండుటయే అమూల్యమైన ధనము.

44

## నిద్ర - స్మృతి - 7

నిద్రయందు స్మృతి కోల్పోవువారిని మేము స్పృశింపలేము. అందుచే వారికి నిద్రా సమయమున శిక్షణ నిచ్చుటకు వీలుపడదు. సూక్ష్మలోక శిక్షణ మనస్సు లోతులలో జరుగునుగాన, జీవునకు విద్య వంటబట్టును. ఇది ఒక సువర్ణావకాశము. నిద్ర మెలకువ వచ్చు సమయమున ఈ స్మృతి యుండును. కావున ఎక్కువగ నిద్ర లేచుటకు ముందు మీకు చక్కని సూక్ష్మలోక దివ్య అనుభవములు కలుగు చుండును. ఈ అనుభవములు పెరుగవలెనన్నచో మత్తునిద్రకై ఆకాంక్షింపకుడు. నిర్ణీత నియమములను పాటించుచు నిద్రలోనికి జనుడు. మేము నిరంతరము మీ నిద్రా సమయమున బోధనలను అందించుచునే యున్నాము. అందు పాల్గొనుటకు త్రికరణశుద్ధిగ మీరు ప్రయత్నము చేయుటయే ఆలస్యము. భూమిపై నుండి మా గురు పరంపర ఇతర గ్రహములలోని వారికి కూడ పైరీతిన శిక్షణ ఇచ్చుచున్నది. ఏసుక్రీస్తు సైతము శిలువపై నున్నప్పుడు తన స్మృతి కోల్పోకుండుటకై పరిపూర్ణ ప్రయత్నము చేసినాడు. స్మృతిని కోల్పోవుట కన్న దుఃఖపూరితమగు సన్నివేశము లేదు. స్మృతి కలవానికే దివ్యలోకానుభవము.

## 45

## జీవనము - సేవనము - 1

సాధారణముగ అందరును జీవ పరిణామమును గూర్చి తెలుపుదురు. సత్యమే మన జీవ పరిణామము. మానవులయందు ప్రకృతి ప్రయత్నముగ జరుగదు. ఖనిజములు, వృక్షములు, జంతువులు ఇత్యాది వానికి ప్రకృతి జరిపించును. మానవుని విషయమున పరిణామము ప్రకృతి మానవునికే వదిలిపెట్టినది. అతనిని సర్వ స్వతంత్రుని చేసి, బుద్ధి నొసగి, నీకు నీవుగ స్వతంత్రముగ వృద్ధి చెందుమనినది. పెరిగిన పిల్లలకు తల్లిదండ్రులట్లే చెప్పుదురు కదా! మానవుని పరిస్థితియు అదే.

కావున జీవ పరిణామ కథలో మానవ పరిణామ కథ అత్యంత ఉత్కంఠ భరితము. మానవుడు తనను తానే వృద్ధి చేసుకొనవలెను. తనకు తానే పతనము కూడ చేసుకొనగలడు. మానవ పరిణామము నకు సేవ పట్టుకొమ్మ. జీవుల సేవను అను నిత్యము ఒనర్చువాడు పరిణామముచెందుట సులభము. జీవులను వాడుకొని వారి కుపకరించనివాడు పతనము చెందగలడు. పై కారణముగనే సద్గురువు

లందరును మానవ సేవ, జీవకోటి సేవ గూర్చి మిక్కుటముగ బోధింతురు. సేవనమే మానవ జీవనముగ పరిణామము చెందుట మానవ కర్తవ్యము. మరియొక మార్గము లేదు.



## 46

## జీవనము - సేవనము - 2

సేవ ఎంతకాలము చేయవలెనన్న ప్రశ్న పుట్టవచ్చును. ఈ ప్రశ్న నశించునంతవరకును సేవ చేయవలెను. నశించిన వెనుక సేవయే మిగులును. మీరందరు ఒక సత్యమును గ్రహింపవలెను. అది ఏమన సేవ అనంతము. సేవకు మరియొక పేరు యజ్ఞము. యజ్ఞార్థ జీవనమే సృష్టి కాధారము. కావున సృష్టియందు ప్రశాంతముగ జీవించుటకు, ఆనందము ననుభవించుటకు సేవ లేక యజ్ఞార్థ జీవనము తప్పనిసరి. సేవ చేయనివారిని ప్రకృతి ప్రలోభపెట్టి తన కార్యములను చేయించుకొనుచుండును. ప్రకృతి జీవులను మాయా మోహముల బంధించి బలవంతముగనైనను సేవను చేయించును. బంధు మిత్రాదుల రూపమున, సంతాన రూపమున మోహము కలిగించి సేవ చేయించును. ఇతరుల విషయమున ఆశను కల్పించి సేవను చేయించును. అట్లు కూలిపనిగా కాక స్వచ్ఛందముగ సేవ చేయుట తెలివి. ఇది ఎరిగి చేసినవాడు వ్యథ చెందడు. ఇతరులకు సేవ, చాకిరి రూపమున తప్పనిసరియై దుఃఖము కలిగించును. తప్పనిసరియైన బాధ్యతను ఏడ్చుచూ నిర్వర్తించుట కన్న స్వచ్ఛందముగ నిర్వర్తించుట తెలివి. ఇట్టి తెలివి సేవ విషయము నందుండుట పరిణామములో మొదటి మెట్టు.

47

## జీవనము - సేవనము - 3

**మా** బృందమునందు తీరిక సమయములలో బృందగానము చేయుచుందుము. క్రొత్తగా బృందమున చేరిన సభ్యులకు ఇది ఆశ్చర్యము కలిగించును. వారిట్లు భావింతురు. “ఇది యేమి ఆశ్చర్యము, పరమగురువుల ఆశ్రమము ఆసాంతము సేవకే సమర్పణము చేయబడినది కదా! ఇచట మనకన్న ముందునుండి వున్నవారు, తీరికగ బృందముగ నేర్పడి గానము చేయుచు ఆనందించు చున్నారేమి? పరమగురువు అనుయాయులందరు నిరంతర సేవా తత్పరులని వినియుంటిమి కదా!”

పై తెలిపిన నూతన సభ్యులుగాని, జన బాహుళ్యముగాని సంగీతమును గూర్చి పూర్తిగ తెలిసినవారు కారు. సంగీతము కేవలము కాలహరణమునకు, స్వాత్మానందమునకే కాదు. సత్సంగీతము పాడువారిని, వినువారిని, పరిసరములను పరిశుద్ధి చేయగలదు. ప్రశాంతతనిచ్చి స్వస్థత చేకూర్చగలదు. ఇట్టి ఉత్తమ సంగీత విలువలను తెలిసి గానము చేయువారు సంగీతము ద్వారా ప్రపంచ మున కత్యుత్తమ సేవ లందించగలరు.

శ్రీ కృష్ణుని వేణునాద మిట్టిదే! అది సమస్త జీవులకు ఆత్మానుభూతి నందించిన గానము. నారదుని వీణాగాన మిట్టిదే! సేవాతత్పరత యుండవలెను గాని ఎట్టి కార్యము ద్వారా నైనను సేవను ప్రకటింప చేయవచ్చును. మన మనుకుని నిర్వచించుకొన్నది మాత్రమే సేవకాదు. మనముచేయు ఏ కార్యమైనను సేవగ మారవలెను. కార్యమునందు సేవాతత్పరత పెరిగిన కొలది, ఆ కార్యమునకు రాణింపు మెండుగనుండును. కారణమేమన అట్టి కార్యమునుండి సత్యము, చైతన్యము, ఆనందము ప్రకటింపబడును.

# 48

## జీవనము - సేవనము - 4

**మా** బృందమునందు వివిధములగు కార్యములు చేయుచుందురు. అన్ని కార్యములకు 'సేవయే' మూలసూత్రము. నీవు చేయు సేవకు పరిమితులు లేవు. పరిధులును లేవు. ప్రకృతి కార్య మేది సేవకాదు? అవధులు లేక సమస్తమును సేవాతత్పరతతో నిర్వర్తించుటచే మా బృందము వారు కాలమును మరతురు. ఆనందమయ స్థితిలో సేవను క్రీడాప్రాయముగ నిర్వర్తింతురు. ఈ దృక్పథము మీకందరికిని అవసరము. పరిస్థితులతో సంబంధము లేకయే ఇట్టి దృక్పథము నేర్పరచుకొనవచ్చును. కేవలము మహనీయులే అట్లు చేయగలరని భావింపబడును. మీరును చేయగలరు. పొలమును పండించు సామాన్యరైతు దగ్గరనుండి ఎవ్వరైనను సేవకు సమర్పణము చెందవచ్చును. నిజమునకు యజ్ఞార్థజీవనమును అవగాహన చేసుకొనలేకపోవుట వలన మానవులు జీవితమును దుర్భరము చేసుకొనుచున్నారు. తమ తమ భావములకు బానిసలై జీవించుచున్నారు. త్వరలోనే శాస్త్రీయముగ జీవిత ఆశయము యజ్ఞార్థమని తెలియగలదు. అప్పుడు మానవులు సరియైన అవగాహనతో సేవకు సంసిద్ధులగుదురు. శ్రీ కృష్ణుడందించిన కర్మయోగమిదియే. పరహితమే పరమధర్మము. అది పరిణామ కారకము కూడ.

## 49

## జీవనము - సేవనము - 5

సేవ, జీవితమున పరిపాటిగ మలచుకొన్న సజ్జనునకు జీవిత సమస్యలన్నియు క్రమముగా పరిష్కారములు కాగలవు. చిక్కుపడిన విషయములు కాలక్రమమున సరిపడగలవు. ఇది మే మెరిగిన సత్యము. సేవ స్వచ్ఛము, నిర్మలము కాగ తన తత్త్వమునందలి మలినము, మోసము నిర్మూలింపబడగ పరిష్కారములకు అవకాశము ఏర్పడును. తెలివితో ఇతరులను మోసగించుట, మాటల నేర్పరి తనముతో ఇతరులను స్వార్థమునకు వినియోగించుకొనుట యిత్యాది లక్షణములు లోనదాగియున్నంత కాలము పరిష్కారములు రావు. సర్వ పరిష్కారములకును మార్గ మొక్కటియే- అఱమఱికలు లేక జీవులకు సేవచేయుట.

పైకి ఆడంబరముగ సంఘము గుర్తింపుకై సేవలు చేయుట వలన వ్యక్తిగత జీవనమున పరిష్కారములు రావు. అంతఃకరణ శుద్ధి లేక బహిఃకరణములతో సేవను నిర్వర్తించువారికి అంతర్ మథనము, మానసిక ఘర్షణము తప్పదు. అంతఃకరణ శుద్ధితో సేవను నిర్వర్తించు

వానికి కూడ సంఘమున కీర్తి కలుగవచ్చును. కీర్తి కలుగుటయు, కలుగకపోవటయుతో సంబంధములేక అతడు అంతఃకరణ శుద్ధితో సేవలు నిర్వర్తించుట వలన అతనికి ప్రకృతి తోడ్పడి సమస్యలను కడతేర్చును. కావున మా మార్గమున సర్వ ప్రయోజనములకు నిర్మల మైన స్వచ్ఛంద సేవ పరిష్కారమని తెలియవలెను.

# 50

## గురు-శిష్య కర్తవ్యములు

**బో**ధన తెలిపినదే తెలుపుచున్నట్లుగ శ్రోతకు అనిపించును. శ్రోతకు దానివలన విసుగు కలుగవచ్చును. "ఎప్పుడూ అదే సొద" అను భావము గూడ ఏర్పడుచుండును. నిజమునకు తెలిసిన దెంత వరకు ఆకళింపు అయినది? ఆకళింపు అయినది ఎంతవరకు ఆచరణకు వచ్చినది ? ఆకళింపు అగువరకు, ఆచరణకు వచ్చువరకు తెలిపినదే తెలుపుట బోధకుని ధర్మము. బోధన క్రొత్తదనము కొరకు కాదు, ఆచరణ కొరకు. స్ఫూర్తి కల్గించి ఆచరణకు ఉద్యమింపజేయుటే బోధన ముఖ్యోద్దేశము. ఆచరించు వరకు వానినే మరల మరల చెప్పుటకు బోధకునకు ఓర్పు కావలెను. వినుటకు, ఆకళింపు చేసు కొనుటకు, ఆచరించుటకు శ్రోతకు కూడ ఓర్పు కావలెను. బోధకునకు ఓర్పు సహజము. శ్రోతకు ఓర్పు సాధనాంశము. ఓర్పుతో ఆచరించుట వలన జీవితము నిర్మాణాత్మకము కాగలదు. కేవలము వినుటవలన, తెలియుటవలన సాధకుని జీవితము నిర్మాణము కాజాలదు.

ఓర్పు, ఆచరణ శ్రోత కర్తవ్యము. ఓర్పు, ఆచరణ, బోధన, బోధకుని కర్తవ్యము.

51

## హెచ్చరిక

**బో**ధన రెండు రకములు. ఒకటి– తెలియని విషయములు తెలిపి స్ఫూర్తి కలిగించుట. రెండు– తెలిసిన విషయములనే తెలిపి ఆచరణకు స్ఫూర్తి కలిగించుట. మానవజాతి సనాతనమైనది. లక్షల సంవత్సరముల నుండి బోధనలు జరిగినవి. లక్షలాదిమంది స్ఫూర్తిని చెంది ముందుకు నడచినారు. బోధనకూడ ఊహకందనంత వైవిధ్యము చెందినది. సమస్త బోధనను అవగాహన చేసుకొను ప్రయత్నము వృథా ప్రయాస. ప్రస్తుతమున నీవాచరింపదగు బోధనయే నీకు తరణోపాయము.

రజోగుణ ప్రవృత్తిచే తెలిసినదాని నాచరించుటకన్న క్రొత్త విషయములందు మోజు హెచ్చుగ నుండును. అది కారణముగ గాలి ప్రోగుచేసినట్లు జ్ఞానమును ప్రోగుచేసుకొని ఆచరించకపోవుట వలన సుఖము, శాంతి, తృప్తి లేక అలజడిన పడియుండుట జరుగును. సత్వము నాశ్రయించి తెలిసినది కొంచమైనను మౌనముగ శ్రద్ధాభక్తులతో ఆచరించుటవలన మరికొంచెము తెలియుట ప్రకృతి

సహకారమున జరుగగలదు. ఆచరింపక, జ్ఞాన విషయములను ప్రోగుచేసుకొనువారికి పరిష్కారమెన్నటికిని రాదు.

ప్రస్తుతమున జిజ్ఞాసువులు రజోగుణ ప్రేరితులై జ్ఞాన విషయైక భ్రాంతిలో జీవించుచున్నారు.



52

## అగ్ని ఆరాధనము

అగ్ని ఆరాధనము అతి ప్రాచీనమైనది. మరల హోమము, హవనము అనుచు పెక్కు బృందములు అగ్ని నారాధనము చేయు చున్నారు. వేదమందు అగ్నియే ప్రధాన దైవముగ బోధింపబడినది. నిజమునకు అగ్ని ఆరాధన చేయుటయందుగల ప్రాముఖ్యమును మరచి డాంబికముగ, ప్రదర్శనాత్మకముగ హోమములను నిర్వర్తించుట వృథా ప్రయాస.

అగ్ని ఆరాధనము చేయువారు తమ పూర్వకర్మల దగ్ధము నకు సంసిద్ధత కలిగి యుండవలెను. తమ స్వభావమును ఉత్తమమైన పద్ధతిలో తీర్చిదిద్దుకొనుటకు దీక్షను పూనవలెను. అసత్యభాషణము, బాధ్యతారహిత జీవనము, అగ్ని ఆరాధకుని నశింప చేయగలదు. దీక్షాయుత జీవనము సాగించుటకు దృఢనిశ్చయము కావించు కొన్నవారు అగ్ని ఆరాధనము కావించుకొనవచ్చును.

అనేక జన్మల సంస్కారములను దగ్ధము చేయమని ఆవాహనము చేయబడిన అగ్నిని వేడుకొనవలెను. ఇంద్రియ వ్యాపారముల వైపరీత్య

ముల నరికట్టి, మనసును బుద్ధియందు ప్రవేశింపజేయమని అగ్నిని ప్రార్థింపవలెను. బుద్ధి లోకములలో కూడ బంధింపబడక తాను కరగి నిరహంకారుడై అగ్నివలె ప్రకాశింపవలెనని యాచింపవలెను. అగ్ని ఆరాధన తపస్సు వంటిది. అది సమస్తమును దగ్ధముచేసి ఆరాధకుని అగ్నిగా నిలుపును.


## 53

# స్వరాజ్

క్రమశిక్షణమునకే క్రతువిద్య. క్రతువిద్య నేర్చువారు క్రమ శిక్షణను పాటింపనపుడు విద్య నపహసించిన వారగుదురు. సాధకుడు "క్రమశిక్షణకు సమర్పణము చెందుదును" అను భావమును ప్రకటించినపుడెల్ల శరీరమందలి దివ్యశక్తు లన్నియు ఉత్సాహపడును. క్రమశిక్షణము నాచరించినపుడు ఉత్సహించిన దివ్యశక్తులు సహక రించి తోడ్పడును. ఇట్లు దేవత లుత్సహించి తోడ్పడుటకు పూనుకొనగ సాధకునిలోని స్వభావము (అసురశక్తి, అజ్ఞానము) అంతరాయము కలిగించుచుండును. అట్టి అంతరాయములకు లొంగక క్రమబద్ధమైన జీవనమును సాగించుటకు ప్రయత్నించవలెను. వలసిన బల మేర్పడుటకు "నే నగ్ని స్వరూపుడను, నేను సమస్త అజ్ఞానమును భస్మము గావించుచు ముందుకు సాగెదను. నా ఈ సంకల్పమునకు అగ్ని, గురువు తోడుగ నిలచెదరుగాక!" అని భావన చేసుకొనవలెను.

దివ్యత్వమునకు నచ్చు ఏకైక గుణము క్రమము. క్రమము చేతనే దైవము సృష్టి నల్లిక చేసినది. క్రమమును పాటించువాడు

పరతంత్రుడు కాక స్వతంత్రుడై నిలువగలడు. నిజమునకు క్రమము సూర్యుని సప్తకిరణములలో ఏడవ కిరణము. ఈ కిరణమునకు పెద్దలు "స్వరాజ్" అని పేరిడిరి. క్రమమును పాటించువారు తమను తామే పరిపాలించుకొనుచు "స్వ" రాజ్యమున సుఖ–శాంతులతో జీవించ గలరు.



## 54

## రుద్ర తరంగము

రుద్ర తరంగములు (Vibrations) విద్యుత్తు కన్న గొప్పవి, విద్యుత్తును మించినవి. రుద్రాధ్యాయము దేహమును ఈ తరంగముల ద్వారా శుద్ధి చేయును. రుద్రాధ్యాయమును శ్రద్ధా భక్తులతో సుస్వరముగ చదువువారికి పంచేంద్రియములు శుద్ధి చెంది, మనస్సు నిర్మలమై బుద్ధిలోకముల నుండి సంకల్పములు వ్యక్తమై దివ్య జీవనమునకు వలసిన భూమిక ఏర్పడగలదు. ప్రస్తుత కాలమున ఈ తరంగముల ప్రభావము వైజ్ఞానికముగ ఇంకనూ తెలియబడలేదు. ఈ తరంగములు అనుభూతి చెందినవారికి సంకల్పబలమననేమో తెలియును. ఇది తెలియనివారి సంకల్పము సామాన్య బలము కలిగియుండును.

పరమగురువుల అనుగ్రహము పొందినవారియందు పరమగురువు ఈ తరంగములను ప్రవేశపెట్టును. తత్కారణముగ ప్రారంభమున సాధకుని యందు ఒక అలజడి ఏర్పడును. ఈ అలజడికి కారణము పరమగురువు ప్రవేశింపజేసిన తరంగమునకు,

సాధకుని యందుగల మలినములకు జరుగు అంతర్యుద్ధమే. సాధకుని యందుగల మలినముల కన్న సద్గురు తరంగముల బల మెక్కు వగుటచే క్రమముగ మలినము లంతరించగలవు. ఇందు సాధకునకు వలసిన దీక్ష సద్గురువందించిన మహామంత్రమును చెప్పిన విధముగ నిర్వర్తించుకొనుట ఒకటియే.

"మాస్టర్ *C.V.V.* నమస్కారమ్."

# 55

## అగ్ని

**అ**గ్ని సమస్తమును శుద్ధిచేసి తానుగ నిలచును. అగ్నిని సమీపించిన సమస్తము అగ్నిలోకి అంతర్హితమగును. అగ్నియే మిగులును. అగ్నిలోకమున నీడలు లేవు. దీపమునకు నీడగలదు. వెలుగుకు నీడగలదు. అగ్నికి నీడ లేదు. వెలుగు, చీకట్లు సృష్టి లోకములకు సహజము. అగ్ని సృష్టి నధిష్ఠించిన తత్త్వము. అచ్చట ద్వంద్వములకు తావులేదు. అచ్చటి చైతన్యము శుద్ధ చైతన్యము, నిత్యచైతన్యము. అచ్చట నిదురకు తావులేదు. నిదురకు అవసరము కూడ లేదు.

అట్టి నిత్య శుద్ధ చైతన్య అగ్నితత్త్వము తన నుండి ఏర్పరచు తరంగములు గంధర్వగానము వినబడును. అనగా అగ్నియే గంధర్వ గానమునకు పుట్టుక స్థానము. అట్టి అగ్ని నీయందు కూడ ప్రవేశించి యున్నది. కావున నీవు మొదలుగ అగ్ని స్వరూపుడవు. ఈ భావము నీవు నిత్యమును స్మరణ చేసినచో నీయందు నిబిడీకృతమై ఉన్న అగ్ని ద్వారములు తెరుచుకొని బహిర్గతము కాగలదు. నీ యందలి సమస్త

ఆవరణములను పవిత్రీకరించి మనసును, ఇంద్రియములను, శరీరమును శుద్ధిచేసి నిన్ను తరింపచేయగలదు. ముఖ మగ్ని స్థానము. అది హోమగుండము వంటిది. కంఠ మగ్ని స్థానము. ఇచ్చట అగ్ని నాదస్వరూపముగ నున్నది. హృదయ మగ్ని స్థానము. ఇచ్చట అగ్ని స్పందనాత్మకుడైన తన తరంగములను శరీరమును వ్యాపనము చేయును.

56

## పర్వత శిఖరములు

**భూ**మి నిర్మాణము చేయుచున్న సమయమున నిర్మాతలు జీవుల కొరకు పల్లములు, పంట భూములు, నీరు, ఖనిజములు ముమ్మరముగ నిర్మించుచుండిరి. అపుడు భూదేవి ఈ విధముగ పలికినది.

"భూమిపై తిండి, బట్ట, సంపద మాత్రమేర్పరచినచో భూమి జీవులు వానికి బానిస లగుదురు. అంతకుమించిన విషయముల యందు ఆసక్తి చూపరు. ప్రత్యేకించి మానవులు శక్తివంతులు గనుక వారికి ఊర్ధ్వగతులను ఏర్పరచు అవకాశములను గూడ భూమిపై నేర్పరచవలెను. అట్లు కానిచో జీవపరిణామ మెట్లు జరుగగలదు?"

భూమి నిర్మాతలిట్లు పలికిరి : "భూమి జీవులు భూమి జీవులుగనే ఉండి, భూ సంపదను అనుభవించుచు ఆనందింప వలెను. ఇతర విషయముల యందు ఉన్నత విషయముల యందు ఆసక్తి ఇప్పటినుండియే కలిగించుట సబబు కాదు."

భూమి ఈ విధముగ అర్థించినది : "భూమి జీవులకు నేను తల్లిని. వారి పెరుగుదల కూడ నేను చూచి ఆనందించవలెను.

కేవలము భోగమయమైన జీవులే అయినచో నా కానందము కలుగదు. ఈ విషయమున మీరు నా మనోవేదనను గుర్తింపవలెను."

నిర్మాతలిట్లు పలికిరి : "నీ అభీష్టమును నెరవేర్చెదము. ఏమి కావలయునో తెలుపుము."

భూమి ఇట్లనెను : "మానవులు ప్రజ్ఞావంతు లగుటకు అవకాశ మేర్పరచవలెను. అందుకొఱకై వారికి ఆకాశగమన శక్తిని అందించుడు. ఎత్తులలో విహరించునపుడు చిల్లర విషయములయందు ఆసక్తి కలుగదు. అది వీలుకానిచో ఎత్తైన పర్వతముల నేర్పరచుడు. పర్వత శిఖరములు చేరి దివ్యత్వము యొక్క అపరిమితత్త్వమును గమనించి ఆసక్తి చెందగలరు."

నిర్మాతలిట్లనిరి : "మానవులు ఎగురుటకు రెక్కల నేర్పరచుట వలన ఉపయోగము లేదు. పరిణామమున పెరగనివారు శక్తివంతులైనచో వారి వినాశనము వారే కొనితెచ్చుకొందురు. పరిణామ క్రమమున మానవులకీ శక్తి అబ్బగలదు. ప్రస్తుతము నీ కోరిక మేరకు ఎత్తైన శిఖరముల నేర్పరచెదము" అని తెలిపిరి. తత్కారణముగ పర్వతములు, శిఖరములు ఏర్పడినవని నానుడి.

భోగజీవితమున రోత చెందిన మానవులు క్రమశః పర్వత శ్రేణులలోనికి జనిరి. ఉత్తమ అనుభూతుల కొరకు తపస్సులు గావించిరి. ఇది కారణముగ అనేక వేల సంవత్సరముల నుండి పర్వతశ్రేణులయందు, నిర్జన అరణ్యము లందు పుణ్యాశ్రమము లేర్పడినవి. పుణ్యక్షేత్రము లేర్పడినవి. ఈ ఆశ్రమములు, క్షేత్రములు క్రమముగా స్థూలమునకు, సూక్ష్మమునకు వంతెనలుగ నిలిచినవి. ఇందలి జీవులు దైవము యొక్క విభూతులు ననుభవించుచు, భూమి జీవులకు జ్ఞానసంతర్పణము చేసినారు. చేయుచునే యున్నారు.

57

## దివ్య వృక్షములు

**భూ**మి నిర్మాణము జరుగు సమయమున నిర్మాతలతో భూమి ఇట్లు పలికినది. "సూర్యమండలములో భూగ్రహము అన్నిటికన్న తక్కువ వెలుగును, ఎక్కువ పదార్థమును కలిగియున్నది. ప్రజ్ఞ దాదాపు అదృశ్యమగుటచే జీవులకు దాహ మెట్లు తీరగలదు? దైవప్రజ్ఞ భూమికి అందుటకు కొన్ని ప్రత్యేక సదుపాయముల నేర్పరచుడు."

నిర్మాతలిట్లనిరి : "నీ కోరిక సమంజసమే. అది నిర్వర్తింప బడును. సంవత్సర చక్రమున ఋతువు లేర్పడగలవు. గ్రీష్మఋతువు నుండి వర్ష ఋతువులోనికి కాలపురుషుడు ప్రవేశించునపుడు ఉరుములు, మెఱపుల రూపమున భూమికి దివ్యప్రజ్ఞ అందగలదు. వీని ప్రభావము భూమిజీవులందుకొనలేరు. అందుకొరకై ఎత్తుగ, ఏపుగ పెరుగు దివ్యవృక్షముల నేర్పరచెదము. కొన్ని ఓషధులను కూడ ఏర్పరచెదము. వృక్షములీ తత్త్వము నందుకొని దివ్యములై జీవకోటికి స్ఫూర్తినందించగలవు. ఓషధులు శక్తినందుకొని జీవులకు స్వస్థత చేకూర్చగలవు. వృక్షములందు దేవదారు వృక్షము శ్రేష్ఠమై నిలచును."

పై కారణముగ దేవదారు, రావి, మఱ్ఱి యిత్యాది వృక్షములు దివ్యములైనవి. కొన్నివేల ఓషధులు శక్తివంతములైనవి. వీటన్నిటి యందును అగ్ని మిక్కుటముగ నిక్షిప్తము చేయబడియున్నది.

58

## సమతుల్యము

**భూ**మిపై అజ్ఞానము పరిపూర్ణముగ నిర్మూలింపబడదు. అగ్నికార్యము పరిపూర్ణముగా నిర్వర్తింపబడదు. అట్లు నిర్వర్తింప బడినచో భూమి యుండదు. భూమి జీవులు ప్రజ్ఞ పదార్థము యొక్క సమతుల్యమును పొందుటయే పరమావధి. పదార్థమును నిరాక రించుట మార్గము కాదు. యోగవిద్య సమత్వము కొరకే. ప్రజ్ఞ పదార్థము, సమతుల్యముగ నుండుటకే మా ప్రయత్నము సాగు చున్నది. భూమిపై పదార్థము బలము సహజముగ మెండు. ప్రజ్ఞను పెంపొందించుకొనుట వలన సమతుల్య మేర్పడగలదు. కావున ప్రజ్ఞా వికాసము కొరకు పాటుపడుచున్నాము.

ప్రజ్ఞావికాసమందాసక్తి కలవారు పదార్థమును, అజ్ఞానమును దూషించుట తరచుగ చేయుచుందురు. దూషణము అజ్ఞానము కారణము. అవగాహనతో అజ్ఞానమును కూడ యిముడ్చుకొనుట నిజమైన జ్ఞానము అజ్ఞానమును, చెడును, పాపమును చూచువారికి, చూచి దూషించుకొను వారికి, అసహ్యించుకొను వారికి సమతుల్య మేర్పడదు. వాని అస్థిత్వము యొక్క ప్రయోజనము గుర్తించి, మన్నించి, ఉదాసీనత వహించి వానిచే బంధింపబడిన జీవులను ప్రేమించుట మేము నేర్చిన సమతుల్యము. మీరును అట్లే ముందుకు సాగుడు.

**59**

## మార్పులు

ప్రపంచమున పెనుమార్పులన్నియు అగ్నికార్యమే. మార్పుల యందు, యుద్ధముల యందు అగ్ని అస్థిత్వమును చూచుట అగ్ని ఆరాధకులు చేయవలెను. మార్పులకు భయము చెందువారు అగ్ని ఆరాధకులు కాలేరు. వ్యక్తిగత జీవితమున గాని, సమాజమున గాని, ప్రకృతియందు గాని జరుగు అకస్మాత్ మార్పులు, విపరీత మార్పులు అగ్ని అవతరణమే. సృష్టిలో మార్పులన్నియు పరిణామము కొరకే. అగ్నికార్యమంతయు పరిణామమునే కలిగించును. మార్పులు నచ్చకపోవుట అవగాహన లేమి వలన కలుగుచుండును. మార్పులలో అగ్ని నిర్వర్తించుచున్న ప్రయోజనము గుర్తించుట అగ్ని ఆరాధనములో భాగము.

60

## దివ్యశక్తులు

ఉన్న శక్తులనే వినియోగము చేయని వారికి దివ్యశక్తుల వలన ప్రయోజనము లేదు. నిజమునకు శరీరము, ఇంద్రియములు, మనస్సు శక్తిమంతములే. వీనిని వినియోగించుట తెలియవలెను. సద్వినియోగము జరుగవలెను. సద్వినియోగమే గాక పరిపూర్తిగ వినియోగము జరుగవలెను. ఉన్న సంపదనే అనుభవించలేని వానికి, యింతకు మించిన సంపదలు వ్యర్థము. చేతకానివానికి సంపద లిచ్చినను, శక్తి నిచ్చినను అది పతనహేతువే కాని వృద్ధికి ఉపయోగపడదు.

నూటికి నూరుశాతము జిజ్ఞాసువులకు దివ్యశక్తుల యందు ఆసక్తి యుండును. దీని వలన ప్రయోజనము లేదు. ప్రతి జిజ్ఞాసువు ఈ క్రింది ప్రశ్నలను వేసుకొని త్రికరణశుద్ధిగ పరిశీలించుకొనవలెను.

1. నీ దేహమును పూర్తిగ వినియోగించుచున్నావా? వినియోగము సద్వినియోగమేనా? శరీరము పనికై ఉత్సహించు చున్నదా?

లేక విశ్రాంతికై ఆరాటపడుచున్నదా? శరీరము పదనుగా ఆరోగ్యముగ నున్నదా?

2. ఇంద్రియములు వేటికొఱకై ఉత్సహించుచున్నవి? వాని సద్వినియోగము పూర్ణ వినియోగము జరుగుచున్నదా? విశేషించి నాలుక, చెవి, కన్ను ఎట్లు వినియోగించు చున్నావు? స్పర్శాశక్తి ఎట్లున్నది?

3. నీ మనోభావముల యొక్క పరిస్థితి ఏమిటి? సతతము సద్భావములు కలుగుచున్నవా? వికారములగు భావము లెన్ని ఏర్పడు చున్నవి? వీనికి కారణమేమి?

పై ప్రశ్నలకు ఆత్మవంచన లేకుండ సమాధానమును నీవే ఆత్మ ప్రబోధముగ గమనించుము. ఆత్మ పరిశీలనము, ఆత్మ విమర్శ ప్రతి నిత్యము చేసుకొనవలెను. అపుడు నీవు నిర్వర్తించవలసిన విధమున మనసు, ఇంద్రియములను నిర్వర్తించుట నేర్చెదవు. ఈ నిర్వహణము పరిపూర్ణమైన వెనుక అంతకన్న మిన్నయైన శక్తులను పొందుట ఉచితము. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎగప్రాకగలదా? ఊహాలోక జీవనమునకు స్వస్తి చెప్పి ప్రస్తుతము ప్రకృతి నీకందించిన శక్తులను సద్వినియోగము చేయుము. ఇదియే తెలివైన పని.

## 61

## శబ్దము - అగ్ని

గ్రుడ్డివారు అగ్నిజ్వాలలను శబ్దమార్గమున గ్రహింతురు. శబ్దము ద్వారా అగ్నిని సమీపించుచుంటిమని లేక అగ్ని తమను సమీపించుచున్నదని తెలుసుకొనుచుందురు. కన్నులు గలవారికి ఈ సౌకర్యము లేదు. కన్ను కన్న చెవికి గ్రహణశక్తి ఎక్కువ. చూచుట కన్న వినుటకు ప్రాముఖ్యత నీయవలెను. ఇదియొక సాధనా మార్గము. చూచుటకన్న వినుటకు ప్రాధాన్యమిచ్చినచో విను శక్తి నిశితము కాగలదు. చాలామంది సాధకులు వినుచున్నామనుకొందురు గాని వినరు. వినినను పూర్తిగా వినరు. ఒకటి చెప్పినచో మరియొకటి వినుదురు. కారణము సగము వినుటయే. వెలుగుకన్న శబ్దము ప్రధానమైనది. శబ్దము నుండి వెలుగు పుట్టును గదా! కావున సాధనయందు కనులు మూసుకొని అంతర్ముఖముగ శబ్దమును వినుటకు ప్రాధాన్యత నీయవలెను. మంత్రోపాసనము, నాదోపాసనము ఇందులకే.

అంతర్ముఖ శబ్దము చేరువగుచున్నకొలది అంతర్ముఖమైన వెలుగునకు కూడ చేరువగుట జరుగును.

భారతీయ సాంప్రదాయ సంగీతమున మరియు చీనీ సాంప్రదాయ సంగీతమున రాగాలాపనము ద్వారా దీపములను వెలిగించు ప్రావీణ్యమున్నది. ఇది శబ్దమార్గముననే జరుగును. మంత్రములుచ్చరించుచు అగ్ని పుట్టించుట సిద్ధులు చేయగలరు. దీనికిని శబ్దమే ప్రధానము. కావున శబ్దము నాశ్రయింపుము. ఆరాధనము చేయుము.



## 62

# ధర్మము - దర్శనము

**మీ** స్నేహితులను సున్నితముగ ధర్మము వైపుకు మళ్ళించుట మీ కర్తవ్యము. మేము చేయు బోధనలు మీరు హృదయముతో అవగాహన చేసుకొని అందు మీరాచరించునవి మాత్రమే యితరులకు తెలుపవలెను. మీరు బుద్ధి ప్రచోదనమునకు నిరంతరము కృషి జరుప వలెను. ఈ మూడు సూత్రములను పాటించువారికి మా అండ దండలు తోడగును.

సత్యము ప్రతి జీవియందును ఉన్నది. జీవి యున్నది అనగా, సత్యముండుటయే. సత్యము జీవి రూపముగ నుండగ జీవి స్వభావ పరముగ నుండును. సత్యమునకు తొడుగు జీవి, జీవికి తొడుగు స్వభావము. స్వభావమునకు తొడుగు రూపము. మీరు సత్సాధకులుగ సత్యరూపమగు జీవితోనే సంబంధము కలిగియుండి, స్వభావ రూపములతో ముడిపెట్టు కొనకుండ జీవించినచో సులభముగ మీ యందలి సత్యము మీకు గోచరించును. ఒక జీవిగ మిమ్ములను మీరు దర్శింప గలుగుదురు.

## 63

## సౌందర్య సోపానములు

1. సృష్టియందు సౌందర్యము కేవలము రూప సౌందర్యము కాదు. 2. రూప సౌందర్యము వెనుక రంగుల సౌందర్యమున్నది. 3. రంగుల సౌందర్యము వెనుక వెలుగుల సౌందర్యమున్నది. 4. వెలుగుల సౌందర్యము వెనుక శబ్దతరంగముల సౌందర్యమున్నది. 5. శబ్దతరంగముల సౌందర్యము వెనుక అప్సరసల సౌందర్యమున్నది. 6. అప్సరసల సౌందర్యము అపురూపము, అపూర్వము. 7. వారి సౌందర్యము వెనుక గంధర్వగాన సౌందర్యమున్నది. 8. దాని వెనుక గంధర్వగానము చేయు గంధర్వుల సౌందర్యమున్నది. వారు సృష్టికతీతులు. సౌందర్యోపాసన యందు ఈ ఆరోహణ క్రమమును తెలియుము. కేవలము రూపసౌందర్యమునకే కట్టుబడకుము.

సౌందర్యోపాసనము అగ్నియోగమున సులభము. క్రింది తరగతి సౌందర్యమును పై తరగతి సౌందర్యములో ఆహుతి చేయుచు ముందుకుసాగుట దీని విధానము. ఇట్లారోహణము చేయుట

మనస్సుతో జరుగవలెను. దానికి ఉచ్ఛ్వాస నిశ్వాసల వేడిమిని తోడు చేయవలెను. శ్వాసవేడి పెరిగిన కొలది మనసు చేయు హోమము నందు ఒక్కొక్క సూక్ష్మసౌందర్యము గోచరమగును. విశ్వామిత్ర మహర్షి ఇట్టి యోగమునే గావించి అప్సరస సౌందర్యముచే మోహితుడైనాడు. వశిష్ఠ మహర్షి అదియును దాటి గంధర్వ సౌందర్యమును చవి చూచినాడు.



**64**

## మౌన మార్గము

**కే**వలము మౌనముగ నుండుట ఒక మార్గమని భ్రమ పడకుము. వెలుగు, శబ్దముల పుట్టుక స్థానము, మౌనము చెందిన మనస్సుచే వెతుకవలెను. మీ లోపల, బయట వెలుగులను, శబ్దము లను పుట్టించు తత్త్వము వ్యాపించియున్నది. దానిని మౌనముగ వెతుకుట నీ లక్ష్యమై యుండవలెను. ఇది ఒక విధమైన అన్వేషణ. ఈ అన్వేషణలో మనసు వెలుగుతోను, నాదముతోను నిరంతర సంబంధ మేర్పరచుకొనును. అది కారణముగ నాదము వినిపించుట, వెలుగురూపములు కనుపించుట జరుగగలదు. పై మార్గమున నీ మనసు బుద్ధిలోకములను చేరగలదు. బుద్ధిలోకమున చేరినను, అన్వేషణము ఆపకుము. శ్వాసమార్గమున ఇంకను లోతులలో అన్వేషణము గావించుము. సమస్తము అవగతమవగలదు. మౌనము ముఖద్వారముగ సూక్ష్మలోకముల ప్రవేశించి సత్యదర్శనమును చేయవలెను. మౌనము కేవలము మౌనము కొరకు కాదు.

65

## గుర్తు - గుర్తింపు

సంఘమున గుర్తింపు కొరకు జీవించుట అవిద్యా మార్గము. గుర్తెరిగి జీవించుట విద్య. తా నెవరో తెలియుటయే గుర్తెరుగుట. ఆ యెరుకతో జీవించువారు సహజముగను, సామాన్యముగను ఉందురు. వారు స్వస్థానమున ఉందురు. కేవలము స్వభావమున జీవించువారు గుర్తింపుకోరుచు, సంఘమను సముద్రమున మునిగి తేలుచుందురు. గుర్తెరిగి జీవించువారికి, గుర్తింపుకొరకు జీవించువారికి గల వ్యత్యాసము నక్కకు, నాగ లోకమునకు గల వ్యత్యాసము వంటిది. పౌండ్రక వాసుదేవుడు ఎన్ని వేషములు వేసినను, ఎన్ని ప్రదర్శన లిచ్చినను, ఎన్ని విన్యాసములు చేసినను వాసుదేవుడు కాలేడు గదా! గుర్తెరిగి జీవించు వారు గురువులు. వారి పనిగూడ ఇతరులకు మృదువుగ గుర్తు చేయుటయే. గుర్తింపుకొరకు జీవించువారికి మృదువైన బోధనలు చెవికెక్కినను, హృదయమును చేరవు. చెవికెక్కిన బోధలు హృదయమును చేరక ముఖము నుండి బయల్వెడలు చుండును. గుర్తెరుగుటకు సతతము అన్వేషించువారిని మేమను గ్రహించుచుందుము.

## 66

## తొలగియుండుట

సమస్తము నందు కొంత తొలగి నిలుచుండుట ఒక నైపుణ్యము. అట్లు తొలగి నిలవనిచో విషయములందు మునుగుట యుండును. మునిగిన వానికి ఏమియును కనపడదు, వినపడదు. ఉక్కిరిబిక్కిరి అగుటయే ఉండును. జీవితమున ఉక్కిరిబిక్కిరి అగుటయే ఎక్కువగ కనిపించుచుండును. తొలగియుండుట కనిపించదు. సజ్జనులకు మాత్రమే దీని రుచి తెలియును.

తొలగియుండుట నేర్చినవాడు ప్రేక్షకునివలె తన జీవితమున జరుగు సన్నివేశములను ఒక నాటకముగ గుర్తించగలడు. బంధు మిత్రులను, దారా పుత్రులను ఆ నాటకమందలి పాత్రధారులుగ గుర్తించగలడు. నాటకమున ఏర్పడు సుఖదుఃఖముల సన్నివేశములను ప్రేక్షకుడుగ చూచునేగాని ఉబ్బి గంతులు వేయుట, క్రుంగి ఏడ్చుట చేయడు. జీవితమంతయు ఒక నాటకము, క్రీడ, సినిమా అని తెలియును. అందు తానొక పాత్రధారి మాత్రమే అని కూడ తెలియును. పాత్రధారి అయి యుండియు ప్రేక్షకత్వమును కోల్పోవకుండుట తొలగి నిలచుట. ఇది ఒక సాధన.

67

## ఆనందము - ప్రయాస

ఆనందము కోరువారు తోటిజీవుల సమస్యలకు పరిష్కార మందించుట ఒక్కటియే మార్గము. జీవులయందు వ్యక్తిగత అభిప్రాయ మేర్పరచుకొనక, సంబంధముల పేరున బంధములేర్పరచుకొనక, తగిన సహాయము చేయుటయే తనపని యని, అదియే ఫలమని భావించుచు, జీవించినచో ఆనందము చేరువగును. చేయు సహాయము శక్తివంచనలేక చేయవలెను.

ఆకురాలు కాలమున వృక్షము ఆకులను సంతోషముగ విడచును. వృక్షమందలి సంతోషము, సంసిద్ధతయే వృక్షమునకు మరల క్రొత్త ఆకును చిగురింపజేయును. వృక్షమునకున్న ధైర్యము, సంసిద్ధత మనిషికున్నచో ఆనందము కొరకు ఆయాసపడనవసరము లేదు.



## 68

## నకిలీ - వెకిలి - కలి

దైవమొక్కడే. దేవాలయ మొక్కటే. సృష్టియే దేవాలయము. అందలి చైతన్యమే సృష్టిశక్తి. అందలి సత్యము, ధర్మమే దైవము. దైవము, శక్తి, దేవాలయము సృష్టియందు సహజముగ నున్నవి. ఈ మూడును జీవునిగ గూడ నున్నవి. సహజముగనున్న దైవమును మానవుడు పూజించుటకు నామరూపాత్మకునిగ మలచుకొనెను. సహజమగు దేవాలయమునకు ప్రతీకగ దేవాలయములను కట్టెను. సహజమగు శక్తికి ప్రతీకగ గర్భాలయమున యంత్రములను పెట్టెను. పూజించుటకు మంత్రములను కనిపెట్టెను. పూజించు విధానముగ తంత్రమును కనిపెట్టెను. ప్రతీకలు క్రమముగ ప్రతిమలైనవి. ప్రతిమలే దైవములై సహజముగ సమస్తమును వ్యాపించియున్న దైవము మరుగైనాడు. సహజమగు దేవాలయము కూడ మరుగై దాని ప్రతీకలు ప్రాముఖ్యమును పొందినవి.

అసలుకు నకలు తీయుట జరిగినది. నకలు నకిలీయైనది. నకిలీయే అసలను భ్రమ స్థిరపడినది. నకిలీ ఆరాధనలు, నకిలీ మతములు, నకిలీ మతాధికారులు ఏర్పడిరి. అంతయు వెకిలియైనది. ఇదియే కలి.

69

## అంతః పరిశీలనము

నిష్పాక్షికముగ నిన్ను నీవు పరిశీలించుకొనుట ముఖ్యము. నీ యందలి కలిమి, లేమి, మలినములు నీకు గాక మరెవరికి తెలియగలవు? నీవే నీ గురించి పరిశీలించినచో నీ మంచిచెడ్డలు నీకే తెలియగలవు. నీ యందలి మలినములను కప్పిపుచ్చుకొనక నీవే ధైర్యముగ నిర్మూలించుకొనుము. ఇతరుల తప్పులు తెలియుట సులభము. నీ తప్పులు నీకు తెలియుట సంస్కారమున్ననే జరుగును. ఇతరుల తప్పులతో నీకేమి పని? నీ తప్పులను దిద్దుకొనుటయే నీ పని. మొగమాటముపడక నీ పనిని నిర్వర్తించుచుండుము. నీవు నిర్వర్తింపనిచో కాలము రూపమున దైవమే నిర్వర్తించగలడు. నీ యందలి మలినములను నీవు నిర్మూలించుకొనుటకు చేయు ప్రయత్నమున నీకు తప్పక నేను తోడు ఉండెదను. నీ త్రికరణశుద్ధిని బట్టి తోడ్పాటు కూడ చేయుదును. నీకు త్రికరణశుద్ధి లేనిచో నిన్ను నీవే మోసము చేసుకొందువు. నీ మోసమే నీ దుఃఖమునకు కారణమగును. అట్టి స్థితిలో మేము నిస్సహాయులుగ చూచుటయే గాని ఏ తోడ్పాటును గావించలేము. కేవలము బోధనలే చేయగలము. అది కూడ నీవడిగిననే. ఇది నిన్ను నీవు ఉద్ధరించుకొను మార్గము.

## 70

## పొడుపు కథ

"**శూ**లమును చేతబట్టి, శ్వాసను స్ఫూర్తితో నిలబెట్టి నీ యందలి చేతనమును ఉదయము నుండి మధ్యాహ్నము వరకు ఉద్ధారణము గావించి దినములు పండించుము."

"ఇట్లుండినచో రాతి నుండి మల్లెలు వికసించును. దేవాలయపు బంగారు తలుపులు తమంతట తామే తెరుచుకొనును. హంసలు సంతోషముతో గీతములు పాడును."

పై వాక్యములు బ్రహ్మ పలికిన పొడుపు కథ. దివ్య సంకేతముల నాధారముగ గొని, గ్రహించి జీవితమున నిర్వర్తించుకొనుము.

## 71

## పనిముట్లు

ఆశయములను అవతరింపచేయుట అందరికిని వీలుపడదు. అట్టి పనికి సంసిద్ధత ఉండవలెను. సంకల్పబలము స్థిరమై యుండ వలెను. పవిత్రత మిత్రునివలె నిరంతరము అంటిపెట్టుకొని యుండ వలెను. అప్రమత్తత, శ్రద్ధ, వినయము విడువరాదు. నిర్లక్ష్యమునకు చోటీయరాదు. ఆశయ సిద్ధికి వలసిన జ్ఞానము పరిపూర్ణముగ ఏర్పరచుకొనుచుండవలెను. వ్యక్తిగతము, సంఘపరము అగు అవరోధములను లక్ష్యపెట్టక అధిగమించి దీక్షతో కార్యములు నిర్వర్తించవలెను. ఆశయమును గూర్చిన ప్రకటనలు, ప్రచారము జరుగరాదు. వాగ్దానములు చేయుట విసర్జించవలెను. చేతలే పలుక వలెను కాని మాటలు కాదు. మౌనము సహజమైన స్థితియై యుండ వలెను.

పై విషయములు ఆశయ సిద్ధికి వలసిన పనిముట్లు. పనిముట్లు లేక పనికి పూనుకొనువాడు మిథ్యాచారుడు.

72

## నిర్మల హృదయము

మంచిపని ఎవరు చేసినను మనస్ఫూర్తిగ మెచ్చుకొనగలవా? ఈషణ్మాత్రముగూడ నీకు ఈర్ష్య కలుగదా? అట్లైనచో నీకు గుప్తనాణె మొకటి లభించగలదు. అది కరిగిన రాగివలె నీ హృదయమున మెరయును. అది మెరసినపుడెల్ల నా వాక్యము నీకు వినిపించును. అది వినిపించినపుడెల్ల నీవప్రమత్తతతో వినుము. వినినది ఆచరింపుము. ఆచరించినది బోధింపుము.

హృదయముపై ఈర్ష్యపొర పడినచో అది అసూయ అను మరియొక పొరను పరచును. అసూయ ద్వేషమును పిలుచును. ద్వేషము క్రోధమును పిలుచును. క్రోధము కామమును పిలుచును. ఇన్ని పొరలు పైబడిన హృదయము నశించును. ఈ పొరలన్నియు నిర్మూలించుటకు మంచికి మనస్ఫూర్తిగ స్పందించుటే ఉపాయము. అప్పుడే అగ్నియోగ ప్రారంభము జరుగును.

73

## అగ్ని మహర్షి

నీ దేహమందలి వేడిమిని నేను. నీ హృదయమందలి జ్యోతిని నేను. నీ స్పందనమందలి వెలుగు నేను. నిస్వార్థ్యముగ గొనిపోవు అగ్నిశిఖను నేను. మట్టిని బంగారము చేయు తత్త్వము నేను. మలినములను దహించు జ్వాలామాలను నేను. నన్ను ఆరాధించుట యోగమార్గమునందు లెస్స. ఇది దగ్గరదారి కాని అగ్నిదారి. అగ్నిపరీక్షకు సంసిద్ధు లగువారు ఈ మార్గమున త్వరితముగ సిద్ధు లగుదురు. వీరే అగ్నియోగులు. వీరికి పరమగురువును నేను. నా పేరు అగ్నిమహర్షి.

74

## అగ్ని యోగము

అగ్ని యోగము నీలోని అగ్ని తత్త్వమును ప్రచోదనము గావించును. అగ్ని నీ శిరస్సున విద్యుత్ ప్రకాశముగ నుండును. హృదయమున శక్తిగ నుండును. ఉదర భాగమున వేడిమిగ నుండును. అగ్ని యోగ మనగా ఈ త్రేతాగ్నులను సమన్వయ పరచుకొని తానగ్ని స్వరూపుడనని తెలియుట. సమస్త సృష్టియు అగ్ని నుండే పుట్టినది. పుట్టిన ప్రతి దాని యందు అగ్ని వ్యాపించి యున్నది. సృష్టి అంతయు మరల అగ్ని లోనికే ప్రవేశించును. సృష్టికి అగ్ని ప్రథమము, ఆది, అంతము కూడ. అందరికన్న ముందు వ్యక్తమైన వాడగుటచే అగ్ని అనిరి.

అగ్నిని గూర్చిన భావన జీవుని పవిత్రీకరింపచేయగలదు. సమస్తమును అగ్ని పవిత్రము చేయును. అగ్నిని గూర్చిన భావన మనలోని అశుచిని తొలగింపచేయును. అశుభ భావనలను తొలగింపచేయును. మీ యందలి అగ్నియే మిమ్ముల నుద్ధరించి పరిపూర్ణము గావింపగలదు. అగ్ని అత్యంత సుందరాకారుడు. అమిత ప్రకాశ వంతుడు. శుచిమంతులకే ఇది తెలియును.

75

## నిదానము

ఎవరెవరున్న స్థితిలో వారి వారి ప్రపంచములుండును. అందులకే సమష్టిగ జీవరాసులున్నను, ఎవరి లోకము వారిది. ఉన్న స్థితి నుండి ఒక మెట్టు ఎక్కినచో ఈ ప్రపంచము కొంత అందముగ కనపడగలదు. కొంత ఆనందము నీయగలదు. అట్టి అందమును, ఆనందమును రుచి చూచినవారు మరియొక మెట్టు ఎక్కుటకు ప్రయత్నించుట సహజము. ఇట్లు పుష్కరమునకు ఒక మెట్టు ఎక్కిన ఒక జన్మలో ఐదు మెట్లు ఎక్కదగును. ఏడు మెట్లు కూడ ఎక్కవచ్చును. ఇట్లు ఆరోహణము చేయుట తాబేలు నడకవలె కనిపించును. అది కుందేటి నడక కన్న మేలు కదా! కుందేలుకు వేగమున్నను చంచలబుద్ధి ఎక్కువ. అటు ఇటు గంతులు వేయుట ఎక్కువ. స్థిరముగ నొక మార్గమున నడువలేదు. అందులకే నాకు కుందేలు కన్న తాబేలు యిష్టము. కప్పలకన్న చీమలు యిష్టము. ఇట్లు నిదానముగను, నిరంతరాయముగను మార్గమున ముందుకు సాగినవారికి ఒక స్థితిలో రెక్క లేర్పడును. వారు ఆకాశ మార్గమున అందరికన్న వేగముగ పయనించగలరు. నిదానమే నిజమగు వేగము.

## 76

## మనోవికారము

**అ**తి పవిత్రము, దివ్యము, మహత్తరము అగు విషయములు బాహ్యమున అట్లు కనుపింపవు. వానిని గుర్తించుటకు కొంత లోతు కావలెను. నీ అవగాహనలో లోతులు పెరిగినకొలది దైవ విలాస మెక్కువ గోచరింపగలదు. నిజమునకు దేవదూత యొకడు నీ దగ్గరకు వచ్చిన నీవు గుర్తింపలేవు. ఎందుకన అతడు సామాన్యముగ గోచ రించును. ఒకప్పుడు బికారిగ కూడ కనిపించును. నీకు దేవదూతను గూర్చి, పరమ గురువుల గూర్చి కొంత వినికిడి యున్నది కనుక, వారిని గూర్చి నీ మనస్సున ఒక రూపమును చిత్రించుకొందువు. అది నీ మనోరూపమేకాని ఉన్నది కాదు కదా! మీమీ సంప్రదాయ ముల ననుసరించుచు మీదగు పద్ధతులలో దైవమును, దేవతలను, మహాత్ములను చిత్రించుకొని, అందు పట్టుపడియుందురు. అందుచే వారు భిన్నమగు రూపమున గోచరించిన గుర్తింపలేరు. దైవము దిగివచ్చునని, కాపాడునని అన్ని జాతులు శతాబ్దముల తరబడి నమ్ముచు, ఎదురుచూచుచున్నారు. దైవ మెన్నిమార్లో దిగివచ్చి రక్షణ కార్యములను నిర్వర్తించి తిరిగి వెళ్ళినాడు. ఉన్నప్పుడు గుర్తింపరు. లేనప్పుడారాధింతురు. ఇది ఒక మనోవికారము.

77

## మా సిద్ధాంతము

దుడుకుతనము గలవారు వారి శక్తి సామర్థ్యములను నిష్ప్రయోజనము గావించుచుందురు. వారి చైతన్యము వరద నీటివలె పరిసరములను ధ్వంసము చేయుచు సాగును. వారి అవగాహన కూడ వక్రత గలిగి యుండును. అద్దము సరిగా లేనప్పుడు ప్రతిబింబము వంకరటింకరగ కనిపించును. వారి మనస్సులోని వంకర అన్ని విషయములను వంకరటింకరగ ప్రతిబింబింప చేయును. అందుచే వారు కొందరిని దుష్టులుగ నిర్ణయించి హింసింతురు. వారితో యుద్ధములు చేయుదురు. ఈనాడు అగ్రరాజ్యములు చేయుచున్న పని అదియే. ప్రతి మానవునికి తనదైన అవగాహన సిద్ధాంతము యున్నది. ఎవరి సిద్ధాంతము వారిది. ధనికుల సిద్ధాంతము ధనికులదికాగ దరిద్రుల సిద్ధాంతము దరిద్రులకుండును. ఇట్లే సిద్ధాంతముల పేరున, మతముల పేరున, సంప్రదాయముల పేరున, వేషభాషల పేరున మానవులు ఎవరికి వారుగ కంచుకోటల నేర్పరచుకొన్నారు. ఒకరినొకరు దూషించుకొనుచున్నారు. ఇట్టి

స్థితిలోని మానవులను వారి మనోవక్రతల నుండి ఉద్ధరించుటయే గురుపరంపర కర్తవ్యము కాని, ఏ ఒక్క సిద్ధాంతమో గొప్పదని చాటుట కాదు. సిద్ధాంతముల కన్న తోటి మనిషి ప్రధానమని మా సిద్ధాంతము.

78

## సూటి మార్గము

**మా** వద్ద విద్యాభ్యాసము గరపి సంఘమునకు తిరిగివెళ్లు విద్యార్థులకు, వీడ్కోలు సభలో మేమీ ప్రార్థనలను నిర్దేశింతుము. అది ఏమన "ఓ ప్రభూ! నిన్ను నేను అన్నిటి యందు, అన్ని ప్రదేశముల యందు, అన్నివిధముల సేవింతును. నీ సేవలో నా జీవితము నిస్వార్థము, నిష్కామమునై నడచుగాక!"

పై ప్రార్థనను ఉదయమునందు ప్రతి నిత్యము గావించుచు జీవించువారికి అంతర్గత ఆనందమేమో తెలియును. అట్టివానికి జీవనమున ఘర్షణమే యుండదు. సేవా సౌఖ్యమే యుండును. అట్లు హృదయమున సేవాసౌఖ్యము నిండినచో అతనికి హృదయ ద్వారములు తెరుచుకొనబడి దివ్యరుచులను పొందును. అందులోనికి ప్రవేశము తానొకనికే యుండును. అట్టివానికి బాధ్యతలు కూడ మిక్కుటమగును. జీవితమున ఆటంకములు, అంతరాయములు పెరుగును. ఆకర్షణ ప్రక్కదారి పట్టించును. అహంకారము జీవుని మార్గమున కడ్డుపడును.

ఇది సర్వసామాన్యము. అట్టి స్థితిలో కూడ నిలకడను పొందుటకు మరియొక ప్రార్థననందింతును. అది ఏమన –

"ప్రభూ! నే నెంతటివాడిని. నీ మార్గమున నడచుటకు సాహసించితిని. నీవే నా కల్లోలిత జీవనమును, నా అహంకారమును పరిష్కరించి, పరిహరించి నీ వద్దకు చేర్చు కొమ్ము. అహంకారమును దాటుటకు నా బలము చాలదు. నీవే నా బలము. నా సర్వమునూ నీవే!"

ఇట్లు రెండు ప్రార్థనలతో సాధకుడు గట్టెక్కి మరల మా తేజోమయ రూపములను దర్శింపగలడు. ఇది మమ్ము చేరుటకు సూటి మార్గము.



## 79

## అరకొర దీక్ష (Half-wayness)

అరకొర నమ్మిక, విశ్వాసము అపాయకరము. సగము ఉడికిన అన్నము తినుటకు పనికిరాదు. సగము ప్రయాణము అడవిలో చిక్కి నట్లుండును. సముద్రయానమున సగము మార్గమున నౌక మునిగినచో ఎట్లుండును? జీవితమున ఏ నిర్ణయము తీసుకొనినను దానికి కట్టుపడియుండవలెను. సంకల్పము, మాట, చేతలయందు కట్టుబాటు లేనివారికి జీవితము నరకమై నిలచును. సద్గురువును నమ్మి కొంతదూర మా మార్గమున నడచి, సగములో వదలువాడు తనకు, తన గురువుకు కూడ అపాయమే. విశ్వాసము కలిగించి అటుపైన మోసము చేయుట కలియుగ లక్షణము. చేబట్టిన దానిని ప్రాణసంకటమైనను వదలకుండుటయే మేము కోరు నీతి. నీతి లేనివారికి ఏ విద్యలు అబ్బవు. సమయమునకున్న తెలివి కూడ పనిచేయదు. జీవితమున అరకొర బుద్ధికన్న అపాయకారి మరియొకటి లేదు. వీరు తమను తామే నశింప చేసుకొనుచున్నారు. మానవజాతి యందిట్టివారిపుడు మిక్కుటముగ నున్నారు. తాను నమ్మిన దానిని వదలక త్రికరణశుద్ధితో ఆసాంతమాచరించుటే నిజమగు దీక్ష. అట్టి దీక్షయే జీవులనుద్ధరించును. అజామీళాదులట్టివారు.

# 80

## సదవగాహనము

వినయము, విధేయత, అహింస అను పదములకు లోకమున సరియగు నిర్వచనము లేదు. హింసను నిరోధించక భరించుట, అహింసయని భావించుట మూర్ఖత్వము. నిస్వార్థ జీవనులకు మాత్రమే అహింస అనగానేమో తెలియును. శ్రీకృష్ణుని అహింసా తత్త్వమును త్యాగధనులు మాత్రమే అర్థము చేసుకొందురు. స్వార్థపరులకది అర్థము కాదు. తాత్కాలిక వాదన కలిగించినను దీర్ఘకాలిక ఆనందము నందించుట హ్రస్వదృష్టులకెట్లు తెలియును ?

ప్రేమతో శిక్షించుట హింస కాదు. ప్రేమమూర్తులు హింసింప లేరు. జీవులయందు గల ప్రేమ కారణముగ వారి నుద్ధరించుటకై చేయు కార్యమును తెలియనివారికి హింసగ కన్పట్టవచ్చును. అట్టి కార్యములు చేయు ప్రేమమూర్తులు ధర్మమునకు విధేయులై చేయుదురు కాని హింసించు బుద్ధి వారియందుండదు. ఉద్దేశ్యము ప్రేమమయ మైనప్పుడు, కార్యమేది అయినను పర్యవసానము ఉద్ధారణమే. విషమిచ్చి చంపుట హింస, విషమిచ్చి బ్రతికించుట

ప్రేమ. చికిత్సా విధానమున వైద్యుడు నాగుపాము విషము రోగి కిచ్చి బ్రతికించిన సందర్భములు కలవు. అట్లే జీవులనుద్ధరించుటకు వారిని దేహమునుండి తప్పించుట కూడ అహింసయే. ఇది ఒక మహా ధర్మము. వినయము, విధేయత, ప్రేమ, అహింస పరిపూర్ణముగ కలిగినవారే యిట్లు నిర్వర్తింపగలుగుదురు. దేహమే తమ సర్వస్వమనుకొను అల్పబుద్ధులకిది అవగాహన కాదు.



## 81

## దేహ బాధలు

మహాత్ములు దేహ స్వీకారము గావించినప్పుడు వారికంతయు అనుకూల వాతావరణమేయుండుననియు, వారెట్టి బాధలను చెందరనియు సామాన్యముగ ప్రజలనుకొందురు. వారు కూడ కష్టనష్టములకు లోనగుట, బాధల నొందుట, దేహ పరిమితులకు లోనగుట జరుగును. అప్పుడప్పుడు దేహసంబంధమైన ఆవేశములకు లోనగుట కూడ జరుగును. భౌతిక లోకమున గల పరిమితులు దేహమొందినపుడు ఏర్పడుట సహజము.

తూర్పు దేశములలోగాని, పశ్చిమ దేశములలోగాని ఈ ధర్మము ఒకే రీతిగ నడచును. నిజమునకు పైథాగరస్, ప్లాటో, రామానుజాచార్యులు, రమణమహర్షి, సాయిబాబా, రామకృష్ణ పరమహంస, అరవింద మహర్షి వంటివారు కూడ దేహబాధలను అనుభవింపక తప్పలేదు. శ్రీకృష్ణునియంత పరిపూర్ణ పురుషునకు కూడ అపాయ మెప్పుడూ వెన్నంటియే యున్నది. శ్రీరాముని జీవితము నింక చెప్పనక్కరలేదు. దేహము ధరించి నపుడు కొన్ని బంధములు,

బాధలు తప్పవు. మహాత్ములందరు దేహబాధలు కించిత్తు కూడా అనుభవించరని భావించుట అజ్ఞానము. నిజమునకు వారికి తమ దేహబాధలేగాక ఇతరుల బాధల బరువుకూడ యుండును. ఇది తెలియవలెను.

## 82

## మూలవ్యాధి


మానవులకు తమ శక్తి తమకు తెలియదు. మానవుని నుండి ఉద్భవించు భావతరంగములు స్వస్థత నెంత చేకూర్చగలవో విషమును కూడ అంత వ్యాప్తి చేయగలవు. చిరాకు, కోపము, అసూయ తీవ్రతరమైనచో శరీరముననే హాలాహలము పుట్టును. మితి మీరిన అసూయాది గుణముల కారణముగ మానవుడు తనకు తానుగ కాన్సరు వ్యాధిని సృష్టించుకొనుచున్నాడు. సామూహికముగ మానవ జాతి నుండి ఉద్భవించుచున్న విషపూరిత భావములే కాన్సరును ఒక అంటువ్యాధిగ మార్చుచున్నది.

ఆధునిక యుగమున సగటు మానవుని, అసూయ భూతము వలె ఆవరించి యున్నది. అసూయకు లోబడనివాడు అరుదు. పోటీ పడుట పెరుగుచున్నకొలది అసూయ కూడ పెరుగును. పోల్చుకొనుట, పోటీపడుట, పులిని చూచి నక్క వాత పెట్టుకొనునట్లుండును. ఇది కారణముగనే ఈ వ్యాధికి పరిష్కారము దొరకుట లేదు. “నీకు అసూయ వున్నది.” అని ఎవరైనను తెలిపినచో ఆత్మపరిశీలనము

చేసుకొను సద్బుద్ధి కూడ లేనివారున్నారు. అసూయను గెలిచినచో కాన్సరు వ్యాధి రాదు.

వాతావరణము అసూయతో కలుషితమైయుండుట చేత బలహీనులను కూడ ప్రస్తుత మీ వ్యాధి సోకుచున్నది. ఇది దురదృష్ట కరము. ఈ కలుషిత వాతావరణమును పరిశుద్ధము చేయుటకూడ మానవుని బాధ్యతే. సాధకబృందములిందుకొరకు వారమున కొక్కమారైనను భౌగోళిక పరిశుద్ధత నుద్దేశించి ప్రార్థన చేసి, ప్రేమమయ తరంగములను వాతావరణమున ప్రవేశింపజేయవలెను. ఇదియొక బాధ్యత.

మీకొక హెచ్చరిక : **అసూయను మీలోని కనుమతింపకుడు. అన్ని వ్యాధుల కదియే మూలము.**



## 83

## ఉభయభ్రష్టులు

సద్గురువులకు కూడ ఒక సంకటస్థితి యున్నది. అతడు బోధనలు చేసినపుడు, శ్రోతలు చాల బాగున్నదందురు. మెచ్చుకొందురు. అతనిని గూర్చి ప్రచారము చేయుదురు. బోధనలను కూడ ప్రచారము చేయుదురు. అతని చిత్రపటములను పూజింతురు. అతనికి పాద నమస్కారములు చేయుదురు. గుడులు, గోపురములు కట్టుదురు.

కాని అతని బోధనలను పాటింపరు. బోధనలు పాటింపమని నిర్బంధించినచో అనుయాయులు పారిపోవుదురు. అనాదిగ సద్గురు బోధనల కిదియే గతి. విధిగా బోధించుటయే గాని, ఆచరించువారి కొరకు ఆశించ కూడదని సద్గురువు నేర్చుకొనునుగాని, ఆచరించుటకే బోధన యని శ్రోత నేర్చుకొనడు. సద్గురువులు బోధించుచునే యుందురు. శ్రోతలు వినుచునేయుందురు. ఆచరణ మాత్రము శూన్యము. దీనికి కారణము స్వార్థమే.

ఆచరింపక పోయినను ప్రమాదము లేదు కాని, ఆచరించుచున్నట్లు నటించుట అత్యంత అపాయకరము. ఇతరులను మభ్య

పెట్టుటకు ఆచరించుచున్నట్లు నటించుచుండగ తమ నటన తమనే మోసము చేయగలదు. పులితోలు కప్పుకున్న నక్క, పులి సంఘములో చేరలేదు. నక్కలు చేరనీయవు. ఇట్టివారు ఉభయభ్రష్టులు.

84

## అక్కరకు రాని విద్య

**జీ**వులెప్పుడును మంచి ఉద్దేశ్యముతోనే జన్మింతురు. జన్మించుటకు ముందుక్షణమున వారు గర్భమున చేసిన ప్రార్థనలు కారణముగ వారినొక దివ్య చైతన్య కిరణము స్పృశించును. మంచి చేయవలెను. మంచిగ నుండవలెననే ప్రతి జీవియు భావించుచు జన్మించును. కాని ఆ భావము పరిసర భావములకన్న బలహీనము లగుట వలన కాలక్రమమున అది నశించును. అగరువత్తి వెలుగుచున్న కొద్ది సమయమే సుగంధ వ్యాప్తి యుండును. దాని వలన శాశ్వతమగు సుగంధము వాతావరణమున ఏర్పడదు కదా!

శిశువెప్పుడును పవిత్రుడే. అతడు వికసించుకొలది తన యందలి వికారములు, వాతావరణమందలి వికారములు విజృంభించి సదుద్దేశ్యమును కోల్పోవును. మరల మరణించు సమయముననే తనకు తన ప్రథమకర్తవ్యము గుర్తుకు వచ్చును. మరల జన్మించు వరకు గుర్తుండును. జన్మించిన వెనుక మరచును. ఇది జీవుని సమస్య. అతనిది అక్కరకురాని గుర్తు. గురువు వచ్చి గుర్తు తెలిపిననూ మరల మరచుచుండును. ఆచరణ యందు గుర్తులేని విద్య అక్కరకు రాని చుట్టమే.

85

## రక్త దానము

ప్రస్తుత కాలమున వైద్య విధానమున అవసరమును బట్టి రక్తమెక్కించుట జరుగుచున్నది. ప్రాణములను నిలబెట్టుటకిది ఒక మార్గము. రక్తమున గల భౌతిక లక్షణములనే గమనించుచు ఒకరి రక్తమొకరికి అందించుచున్నారు. ఒక శరీరమందలి రక్తము ఆ జీవుని స్వభావమును కూడ కలిగియున్నది. ఆ రక్తమందు అంతర్గతముగ ఆ జీవుని కర్మ కూడ యుండును. రక్తమునందుకొన్న వానికి అందించిన వాని కర్మము కూడ అందివచ్చును. ఇది తెలియక రక్తము నందుకొనుట అపాయకరము. రక్తము ఏ తరగతిదో చూచుచున్నారు తప్ప, ఎట్టి కర్మ వాసనలతో యున్నదో గమనించుట లేదు. దీని వలన కూడ జీవుల కర్మలయందు కొంత గజిబిజి ఏర్పడుచున్నది.


పై గజిబిజిని పరిష్కరించవలెనన్నచో రక్తపరీక్షయే గాక, దాతయొక్క కర్మపరీక్ష కూడ జరుగవలెను. దాత, గ్రహీతల మధ్య స్వభావ సారూప్యముండవలెను. ఇది తెలియవలెనన్నచో జ్యోతిష శాస్త్రమే శరణ్యము.

86

## స్ఫూర్తి

**ఆ**చరణకు చురుకైన ఒక ఆలోచన చాలును. బండెడు ఆలోచనలు కలిగినవాడు ఏమి చేయవలెనో తెలియక సతమత మగుచు ఆచరణమును వదలును. ఆచరింపని వారికే ఆలోచన లెక్కువ. విచికిత్సలు చేయువారు, విశిష్టమగు కార్యముల నాచరించ లేరు. ఆలోచనలోని చురుకు ఆచరణలో ప్రవేశించిన కార్యములు కూడ చురుకుగ సాగును. స్ఫురించిన భావమును పదిమందితో విశ్లేషించిన దాని చురుకుదనము కోల్పోవును. స్ఫూర్తి గలవారికే సరియగు ఆలోచనలు స్ఫురించగలవు. స్ఫూర్తి ప్రాపంచక విషయముల నుండి పుట్టదు. మనస్సు పాంచభౌతిక సృష్టికన్న పైన యున్నది. స్ఫూర్తి గలవాని మనసు బుద్ధి నాశ్రయించి యుండును. బుద్ధి నుండి మనస్సుకందు ఆలోచన మెరుపువలె చురుకుగ అందును. అట్టి మనస్సు లేనివారితో దానిని గూర్చి విశ్లేషించిన అది చర్చకు దిగజారును. అందువలన స్ఫూర్తిదాయకమగు ఆలోచనలు తనకు తానుగనే మౌనముగ నిర్వర్తించుట ఆరంభించవలెను.

స్ఫూర్తియందు కూడ జీవులకు భ్రమలు కలవు. స్ఫూర్తి అందరికినందుబాటులో నుండు విషయము కాదు. ప్రపంచ జీవన ముకు అతీతమగు చైతన్యము నాశ్రయించిన వారికే స్ఫూర్తి అందు బాటులో నుండును. స్ఫూర్తిమంతుడే, సృజనాత్మకుడు. స్ఫూర్తి లేని వాని కార్యములు అల్పాయుష్క కలిగియుండును.



**87**

## ఏకైక ఉపాయము

**ప**రమగురువుల పరంపర నుండి దివ్య ప్రణాళికకు సంబంధించిన సద్భావములెన్నియో ప్రపంచములోనికి తరచు ప్రసరింపజేయపడుచున్నవి. అవి అన్నియును స్ఫూర్తిదాయకములే! శ్రేయోదాయకములే ! సూర్యుని కిరణములవలె ప్రతినిత్యము దివ్య ప్రణాళికకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన భావములు మానవ మేధస్సులలోకి ప్రసరింపబడుచుండును. వీనిని మేధా సంపత్తి గల మానవులు అందుకొనుట జరుగును. అవి బీజప్రాయములై వారి మేధస్సునయొక మెరుపువలె మెరయును. ఆ భావమునవతరింపచేయుట గ్రహీతయొక్క సమర్థత, సంసిద్ధత, పవిత్రతలపై ఆధారపడియుండును.

గ్రహీతలలో సంసిద్ధులు చాలమందియున్నను, సమర్థత లేనివారు మెండు. సమర్థత కలిగినను సంసిద్ధత లేనివారు, సంసిద్ధత, సమర్థత యున్నను పవిత్రత లేనివారు, పవిత్రత యున్ననూ సమర్థత, సంసిద్ధత లేనివారు, ఎక్కువుగనుండుటచే దివ్య ప్రణాళిక భూమిపై

అవతరించుటకు అంతరాయము లేర్పడుచుండును. పై కారణముగనే అప్పుడప్పుడు మహాత్ములు అవతారమూర్తులు, దేహము దాల్చి ప్రణాళిక నిర్వర్తించుట జరుగుచుండును. అది కేవలము రుచి చూపించుటకే. ఉదాహరణకే అవతారమూర్తులు దిగివచ్చిన కూడ తాత్కాలికమగు ధర్మ సంస్థాపనమే జరిగినది. అటుపైన మరల ఏర్పడుచున్నది ధర్మగ్లానియే! శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, గౌతమ బుద్ధుడు, ఏసుక్రీస్తు వంటి అవతారమూర్తులు దిగివచ్చినను మానవజాతి యందు ధర్మగ్లాని తొలగకుండుటకు కారణము వారియందలి అలసత్వమే.

మమ్మనుసరించువారు మహత్తర విషయములకై ఆశపడక పవిత్రతను, సమర్థతను, సంసిద్ధతను పెంచుకొనుడు. ఇది యొక్కటియే మార్గము. ఏకైక ఉపాయము.


**88**

## భావ భ్రమణము

**ఆ**లోచనాశక్తి మానవుల కీయబడినది. అది రెండు విధములు. అందు ప్రాథమిక తరగతికి చెందిన ఆలోచనలు ప్రాపంచికమైనవి. ఇవియే ఎక్కువగ మానవుని మనస్సున మెదులుచుండును. మీరు ఉదయము నుండి సాయంత్రము వరకు చేయు ఆలోచనలు స్థూలమగు ప్రాపంచిక విషయములందే తిరుగుచు నుండును. మీ చుట్టును గల ప్రపంచమునందలి విషయములే మీ మనస్సు గ్రహించు చుండును. గ్రహించిన విషయములకు, మాటచేత రూపములు ప్రతిస్పందించుచుండును. ఇంతకు మించి మనస్సు నందేమియు నుండవు. మనో పరిభ్రమణము అంతయును ప్రాపంచికమై జీవమును నిస్సారము చేయుచుండును.

పంచభూతాత్మకమైన సృష్టికి ఆధారమగు సూక్ష్మ లోకములను గూర్చి మీరాలోచింపుడు. అవి దివ్యములు, కాంతివంతములు. స్ఫూర్తి దాయకములు. ఈ భావములు జీవచైతన్యమునకు ప్రాణము పోయ గలవు. నూతన శక్తిని ప్రసాదింపగలవు. దైనందిన సంసార భావముల

నుండి ఊర్ధ్వముగ కొనిపోగలవు. ఈ భావముల యందు రుచి కలుగుట సంసారము నుండి తరించుటకు చక్కని ఉపాయము. మానవులయందు జ్యేష్టులుగను, శ్రేష్టులుగను, స్ఫూర్తిదాతలుగను, నిలచిన వారందరును ప్రాపంచిక భావములు కతీతమగు సూక్ష్మము, దివ్యము అగు భావములను పొంది నిర్వర్తించిన వారే. అట్టివారు సంసారమను సాగరము నుండి బయల్పడి యున్నారు. వారికి సంసారము సాగరము కాక చిన్న తటాకమై గోచరించును. అందు వారి ప్రవర్తనము ఉల్లాసమగు ఈదులాటగ నుండును. కావున భావ పరంపరలను మీ పరసరముల నుండి ఊర్ధ్వమునకు గొనిపొందు.




## 89

## శాంతి, ప్రశాంతి

ప్రశాంతత రెండు రకములు. అది లోపల, బయట యున్నది. బయటయున్న ప్రశాంతతను శాంతి యందురు. లోనగల శాంతిని ప్రశాంతి యందురు. బహిర్గతమగు శాంతి, అంతర్గతమగు శాంతి రెండింటికిని సంబంధము లేదు. ప్రశాంతి, పరసరములతో సంబంధము లేనిది. జీవన సన్నివేశముల వలన అది చెదరదు. అది దివ్య శాంతి. వెలుగుచున్న దీపమునకైనను, ఆటుపోటులున్నవిగాని, ఆకాశమునకు లేవు కదా! ఆకాశము నిశ్చలమైన వెలుగు, నిరంతరమగు వెలుగు. సృష్టియందేశక్తియును ఆకాశమును చెదరగొట్టలేదు. హృదయమందలి ప్రశాంతత అట్టిది– అది ప్రశస్తమైన శాంతి. దీనిని పొందుటకే సమస్త కృషి, ఋషులు గావించినారు. ఇది హృదయాంతరాళమున స్థిరముగ నున్నది.

మనస్సు ప్రశాంతిని పొందవలెనన్నచో అది అంతర్ముఖమై, హృదయమును చేరవలెను. అట్లు కానిచో జీవితమంతయు శాంతి కొరకై వెదకులాటగ సాగుచుండును. జీవిత మెప్పుడును కప్పలతక్కెడ

వంటిదే. ఏదియో ఒక తరుగు కనిపించుచునేయుండును. అది మనస్సును బాధించుచునేయుండును. సంసారమున శాంతి లేదని పెద్దలందురు. వేల సంవత్సరములు తపస్సు చేసి ఋషీలీ విషయమును నిర్ధారించిరి. అంతఃశ్శాంతి పొందినవారే సంసారమున గూడ స్థిరముగ జీవించగలరు. ఇతరులకు స్థిరము సాధ్యము కాదు. ఆటుపోటులలో స్థిరత్వమేమి యుండును? సంసారమున చిక్కుబడిన మనస్సు, ప్రతినిత్యము ఆటుపోటులకు గురియగుచునే యున్నది. సముద్రముపైననే ఆటుపోటులు, లోతులలో అవి లేవు. అట్లే జీవులు లోతులలో జీవించుట నేర్చినచో ఆటుపోటులుండవు. బాహ్య జీవనులకే అన్ని బాధలును.



# 90

## పరమశాంతి

**శాం**తి బహిరంగమునకు, ప్రశాంతి అంతరంగమునకు సంబంధించినవని తెలిపియుంటిని. శాంతికి అటుపైన ప్రశాంతికి వలసిన సద్గుణములు వినయము, పరహితము, శరీరశ్రమ, తమను గూర్చి భావించకుండుట. ఇతరులను గూర్చి విమర్శించకుండుట, యిత్యాదులు. సోమరులుగాని, స్వార్థపరులుగాని, సంఘశ్రేయస్సునకై కృషి చేయనివారుగాని శాంతిని పొందలేరు.

నిర్వాణము పరమ ప్రశాంతిని కూర్చగలదని పెద్దలు తెలుపుచున్నారు. తమనుతాము మరచిన వారే నిర్వాణము చెందిన వారు. ఇట్టివారికి దైవము తప్ప మరియొకటి యుండదు. సర్వమును దైవమే. తమకు సంబంధించిన అస్థిత్వభావము కూడ మిగలక దైవమే యుండును. ఇది శాంతి, ప్రశాంతిల కన్న మిన్నయై యున్నది. ఇట్టి వారు మహాసంగ్రామముననున్నను చెదరరు. ఇక జీవిత సంగ్రామము వారినేమిచేయగలదు? మహాభారత సంగ్రామ ప్రారంభమున పరమ ప్రశాంతితో సమస్త తత్త్వ జ్ఞానమును బోధించిన శ్రీకృష్ణుని పరమ

ప్రశాంతతను ప్రశంసించుటకు వాఙ్మయము చాలదు. అట్టి బోధనను వినిన అర్జునునికి హృదయమున ప్రశాంతి నొసంగిన వాడుకూడ శ్రీకృష్ణుడే. మొదట ప్రశాంతి కలిగించి అటుపైన పరమ ప్రశాంతిని అందించుటకై తత్త్వబోధన మహాసంగ్రామ సమయమున చేయుట సామాన్యుల ఊహకందని విషయము.

# 91

## మనోకళ

**ఆ**లోచన ఒక కళ. ఆలోచన మనసు నుండి ఉద్భవించును. మనసు సహజముగ పంచభూతములనధిష్టించి యుండవలెను. సృష్టియందలి అమరిక అట్లుండదు. భూమి నధిష్టించి నీరు, నీటి నధిష్టించి అగ్ని, అగ్నినధిష్టించి వాయువు, వాయువు నధిష్టించి ఆకాశము యున్నవి. ఈ పంచభూతములను నిర్వర్తించుటకై దీని నధిష్టించి ఆరవదిగ మనస్సుయున్నది. పై వరుస క్రమములో మనసు పంచభూతములకన్న ఉత్తమమైనది. అందుండి కలుగు ఆలోచనలు బుద్ధినుండి ప్రసరించినచో అంతయును సవ్యమే. కాని మనస్సు పంచభూతాత్మకమగు సృష్టితో తగులుకొనుట కారణముగ ఆలోచనలు బుద్ధినుండి కాక ప్రపంచమునుండి కలుగుచున్నవి.

కావుననే బుద్ధితో మనసు సహవాసము చేయుటకై బుద్ధిమంతులతో సహవాసము చేయవలసిన ఆవశ్యకత ఏర్పడుచున్నది. బుద్ధిమంతులనగ బుద్ధియందు జీవించువారు. వారియందు దివ్యగుణములు భాసించుచుండును. అట్టివారి సంగమున మనస్సు ఆలోచనయను కళను పొందగలదు. లేనిచో చిల్లర మనుష్యులతో చిల్లర విషయముల యందు బిగింపబడి వారి వాసనలతో చిక్కు పడును. చిన్నతనముననే చక్కని సంగమముల నేర్పరచుకొనుట తెలివి.

## 92

## గతము

మనస్సును మించిన నేర్పరిలేదు. ఊర్ధ్వలోకములకును, అధోలోకములకును వంతెనవంటిది మనస్సు. మనస్సు తన సహజ స్థితిని కోల్పోయినచో ఊర్ధ్వ, అధోలోకముల వంతెన విరిగినట్లే. మనస్సు మానవులకందించబడిన ఒక ప్రత్యేక పని ముట్టు. దానిని సద్వినియోగముచేయుట వలన సమస్తసృష్టి వైభవమును పొంద వచ్చును. దుర్వినియోగముచేయుట వలన సమస్త దుఃఖములకు కారణమగును. మానవుడు మనస్సును గూర్చి పరిశోధనలు జరుపవలసియున్నది.

మనస్సు తీరుతెన్నులు విచిత్రముగ నుండును. మనస్సును దేవాలయముగ మలచుకొనవచ్చును. అందు దేవుని ప్రతిష్ఠించుకొన వచ్చును. అదే మనస్సున అరిషడ్వర్గములను చేర్చుకొనవచ్చును. మనసునకు సరియగు శిక్షణనిచ్చి మానవుడు మహాత్ముడగుచున్నాడు. అపుడతడు దేవతలకన్న మిన్నయై భాసించును. ఋషులందరును అట్టివారే! వారు దైవ సమానులు.

మానవులందరు, తమ తమ మనస్సును గతముతో బంధించి యున్నారు. గతించిన విషయములు సన్నివేశములు, సంప్రదాయ ములు, విధానములు, అలవాట్లు మానవుని మనస్సును గతముతో బంధించినవి. చాలా మందికి జరిగిపోయిన కాలమే బాగున్నది అనిపించును. మానవుని మనస్సు జన్మ జన్మల నుండి గతించిన విషయములను తన యందు బీజప్రాయముగ దాచుకొనుచు కొని తెచ్చుకొనుచు జీవించుచున్నాడు. ఇది వాసనా రూపమున మానవుని గతముతో పూర్ణముగ బంధించినది. పై కారణముగ పాత ఆలోచనలె ప్రస్తుతమున కలుగుచున్నవి. గతమెంత ఘనమైనదైనను అది తిరిగి రాదు. గతమును గూర్చి ఆలోచించుటచే ప్రస్తుతము చేయిజారి పోవుచున్నది.

జరిగిపోయిన దానిని మరచి జరుగుచున్న దానియందు మనసు నిలపనిచో మానవుడు వెనుకబడియే యుండును. "తెలిసిన వారు గతమును గూర్చి దుఃఖింపరు." అనునది భగవద్గీత యందు భగవంతుడు పలికిన మొదటి పలుకు. అది ఉపదేశము.

*"గతాసూన గతాసూంశ్చ నానుశోచంతి పండితాః"*



93

## వాసనా బలము-1

ప్రతి జీవుడును మరణించిన వెనుక పుట్టుటకు ముందు, గతించిన జన్మయందు జరిగిన విషయముల నుండి పొందిన అనుభవము ఆధారముగ గొని, కొన్ని ధృడమైన నిర్ణయములను తీసుకొనును. రాబోవు జన్మలో తానెట్లు ప్రవర్తింపవలెనో, ఎట్టి పనులు చేయవలెనో, ఎట్టి పనులు చేయరాదో గట్టిగ నిర్ణయించుకొనును. ఈ నిర్ణయములే పునర్జన్మ ప్రయోజనముగ నుండును. దీనినే జన్మ ప్రయోజన మందురు. (Purpose of Life). కాని జన్మించిన తరువాత వానిని మరచుట జరుగును. దానికి కారణము పూర్వవాసనా బలమే. ఇట్లు జన్మ ప్రయోజనము మరచి వాసనములకు బందియై మానవులు తీరికలేక జన్మలెత్తుచున్నారు. ఇదియొక ఇంద్రజాలము. వీటిని గమనించుచున్న మేము ముక్కున వేలిడుకొని "ఔరా! ఏమి ఈ మాయ? మరపు ఎంతటి మాయను కలిగించుచున్నది!" అని విస్తుపోవుచున్నాము. బుద్ధిమంతులు కూడ వాసనాబలముననే బంధింపబడి యున్నారు. ఇక పరిణామము కథ ఎట్లు జరుగగలదు? ఈ విషయమున నేనుచూచిన వేలాది ఉదాహరణలలో మీకు ఒక ఉదాహరణము వివరింతును.

## 94

## వాసనా బలము-2

**పూ**ర్వమున ఒక బుద్ధిమంతుడు జీవిత ఉత్తరార్ధమున ఉపదేశమునంది తపస్సు గావించినాడు. అతడు క్రమశః అంతర్ముఖుడయ్యెను. బుద్ధికోశమున ప్రవేశించెను. అంతరంగమున ఎన్నియో జ్ఞానబోధనములను పొందెను. అతనికి మరణమాసన్న మైనది. మరణ సమయమున అంతర్వాణి అతనికి రాబోవు జన్మ కారణము తెలిపెను. అది ఏమన, తపస్సు జ్ఞానము ఆధారముగ లోక శ్రేయస్సుకై పరహిత కార్యముల నొనర్చుమని.

అతడు మరల ఒక పుణ్యస్త్రీకి జన్మించెను. ఆమె పరహిత పరాయణురాలు. జన్మించిన బుద్ధిమంతుడు ఏడవ సంవత్సరమున ఉపదేశ దీక్షను పొంది గాయత్రి మహామంత్రమును స్వీకరించి జపమాచరించుట మొదలిడెను. పూర్వ వాసనాబలమున జపము కుదిరినది. ధ్యానము నిలచినది. యుక్త వయస్సు వచ్చినప్పటికిని ధ్యానము, స్వాధ్యాయమే చేయుచుండెడివాడు. జన్మ ప్రయోజనము గుర్తునకు రాలేదు.

కాలగతిని తల్లి మరణించుట సంభవించినది. ఆమె తుది మాటగ తనయునకు లోకహితకార్యము నొనర్చుమని హెచ్చరించి చనిపోయినది. అయినను అతడు తల్లి మాటను పట్టించు కొనలేదు. తాను జ్ఞాని. పండితుడు. తనకు లోకహిత కార్యములు చేయ అవసర మేమి? అది కర్మిష్ఠులు చేయుపని కదా! అని భావించుచు జన్మ మంతయు పాండిత్యము పెంచుకొనుచు మరణించెను. మరణ సమయమున అంతర్వాణి జన్మ ప్రయోజనము మరల తెలిపెను. పండితుడు ఉలిక్కిపడెను. అదే సమయమున తల్లికూడ దివ్య శరీరముతో గోచరించి చిరునవ్వు నవ్వెను. ఆమె కూడ జన్మ ప్రయో జనము హెచ్చరించినది. అయినను తాను లెక్కచేయలేదు. అతడు మరుజన్మమున లోకహితమునే ప్రయోజనముగ నిశ్చయించుకొని మరణించెను.

ఇట్లు ప్రతిజీవునకును లోనుండి బైట నుండి అప్పుడప్పుడు సున్నితముగ జన్మ ప్రయోజనము తెలుపబడుచున్నది– కాని వాసనా బలమధికమగుటచే ప్రయోజనము నిర్వర్తింపబడక మిగిలి పోవు చుండును. ఇది యొక వైచిత్రి. జీవుల మరుపు ఇంతింతని తెలుప లేము.

**95**

## సంకల్పబలము

సంకల్పబలము కర్మముకన్న బలమైనదా? అనుప్రశ్న తరచూ ఉద్భవించుచున్నది. సామాన్యులకు కర్మమే బలమై, సంకల్పమును చెదరకొట్టుచుండును. కాని సంకల్పబలమును కర్మ బలముకన్న బలముగ వృద్ధి గావించినచో, సంకల్ప బలముచేత కర్మమును రహితము చేసుకొనుట, మార్చుకొనుట చేయవచ్చును. మానవులకు సంకల్పబలమే నిజమైన బలము. భారతీయులు ఈ యంశమును ముందుగ గమనించిరి. కాలమును దేశమును బట్టి కలుగు ఎన్నో అపాయములను వారు సంకల్ప బలముతోనే దాటిరి. హరిశ్చంద్రుడు నలుడు, శ్రీరాముడు, ధర్మరాజు, అర్జునుడు యిత్యాది పురుషుల జీవితముల యందు సంకల్పబలమెంతటిదో తెలియనగును. అట్టి వారు నేటికిని గలరు. తపస్సునకు కూడ కావలసినది సంకల్పబలమే. తపస్సుతో పొందలేనిది కూడ ఏమియు ఈ సృష్టిలో లేదు. ఏ కార్యమునైనను తపస్సువలె నిర్వర్తించుట ముఖ్యము. ఆటంకము లెన్ని గలిగినను మరల తపస్సునే చేసి విశ్వామిత్రుడు బ్రహ్మర్షి

అయినాడు. అందు వలన కర్మమును సంకల్పబలముచే గెలువదగును.

పంచాక్షరి, అష్టాక్షరి, గాయత్రి, ఇత్యాది మంత్రములను ఆధారముగ గొని సామాన్యులు సైతము సంకల్పబలమును పెంచుకొనవచ్చును.

## 96

## కాలయాపన

**మా** బృందము నందెల్లప్పుడును, ఒక హెచ్చరిక యుండును. అది ఏమన "కాలమును వృథా చేయకుందుము కాక." జీవన ప్రవాహము కాలము రూపమున సాగుచుండును. కాలమును వృథా చేయువారు జీవితమును వృథా చేసుకొనుచు వ్యథ చెందుచుందురు. వృథా చేసిన కాలము తిరిగి రాదని అందరికిని తెలియును. తెలిసియు తప్పులు చేయుట అలసత్వము. కాలమును సద్వినియోగము చేయు వారు తమయందు సమర్థతను తెలియకయే పెంచుకొందురు. పై కారణముగ ప్రతి సాధకుడును తనదైనందిన కార్యక్రమమును తగు రీతిని అమర్చుకొని దానిని పాటింపవలెను. దినమంతయు పరిశీలించి చూచినచో వృథాయగుచున్న కాలము గమనింపబడును. ఆ కాల మును కూడ నిర్మాణాత్మకమగు పనులకు వినియోగించుట నేర్చు కొనవలెను. ఇట్లు తాము మెలుకువయందున్న కాలమంతయు సద్వినియోగము చేయుచున్న సాధకులకు తమ యందు గల అల సత్వము తొలగి సమర్థత పెరుగుచుండును. కాలము వృథా యగుటకు సోమరితనము, వ్యర్థభాషణము, అతి భోజనము, అతి నిద్ర ముఖ్య కారణములు. సున్నితముగ తమ జీవితమును చక్కగ పునర్నిర్మాణము గావించుకొనువాడే సాధకుడు.

**97**

## భూతప్రేతములు

**భూ**మి చుట్టును గల వాతావరణము నందు మనకు సన్నిహితముగ సూక్ష్మమగు పొరలలో భూత ప్రేత పిశాచములు తిరుగాడుచుండును. ఇది మీరు గుర్తెరిగి జీవించవలెను. వీని ప్రభావముననే సత్పురుషులకు కూడ చెడు భావములు కలుగు చుండును. వీని నుండి మీరు మిమ్ములను పరిరక్షించుకొనవలెను.

"భూత పిశాచ నికట నహియావై" అనుచు "నీదువాలంబునన్ బట్టి నేలంబడంగొట్టి" అనుచు "ఆగమార్ధంతు దేవానాం గమనార్ధంతు రాక్షసామ్" అనుచు సంప్రదాయమున ఎన్నియో భావములు పెద్ద లందించినారు. వీనియందు సూక్ష్మమగు సత్యము కలదు.

పిశాచ భావములే ప్రస్తుతకాలమున మానవజాతిని పీడించు చున్నవి. హింస, అత్యాచారములు, బలాత్కారములు, మారణహోమ ములు ఇవి అన్నియు దైనందిన వార్తలు. ఇది భూతప్రేత పిశాచముల పని. దేహములోని ఈ భూతములు దేహముగల జీవులద్వారా వారి వారి దాహమును తీర్చుకొనుచుండును. అలసులైన మానవులు వీనికి లొంగిపోవుచుందురు.

పై కారణముగ జీవులు ఈ పొరను దాటి దానిపై పొరలో కల ప్రజ్ఞామయలోకమును స్పృశించుటకే ప్రార్థనలు.

ప్రార్థనల మూలమున భూతప్రేత పిశాచాది శక్తులు ఛేదింపబడును. ప్రజ్ఞామయమూర్తుల నుండి ప్రసరించు కిరణములు రామబాణములై సోకి భూత ప్రేతములను నశింపచేయును. తత్కారణముగ వాతావరణమందలి దుష్టశక్తుల ప్రభావములన్నీ నశించును. దుష్టభావములు దరిచేరకుండుటకు ప్రార్థనలు అత్యంత ఆవశ్యకములు.

98

## జిజ్ఞాసువులు

**నా** చిరకాల మిత్రుని ప్రణాళిక ననుసరించి ఒక శతాబ్దము వెనుక మేము పాశ్చాత్య జిజ్ఞాసువులకు కొందరకగుపించితిమి. మరికొందరితో ఉత్తరప్రత్యుత్తరములు జరిపితిమి. కొన్ని ప్రకృతి రహస్యములను వివరించితిమి. ప్రకృతి ధర్మములను కూడ తెలిపితిమి. మహిమలను చూపితిమి. పర్యవసానము ఆశించిన విధముగ గాక మిశ్రమ ఫలితముల నిచ్చినది.

జిజ్ఞాసువులలో ఎక్కువ భాగము ఆత్మజిజ్ఞాసువులు కారు. శాస్త్ర జిజ్ఞాసువులే మెండు. శాస్త్ర జిజ్ఞాసువునకు, ఆత్మ జిజ్ఞాసువునకు భేదము కలదు. ఆత్మ జిజ్ఞాసువు తెలుపబడిన ధర్మమును, రహస్య మును, ప్రజ్ఞను తనయందు దర్శించుటకు ప్రయత్నించును. శాస్త్ర జిజ్ఞాసువు వానిని ప్రకృతి యందు దర్శించుటకు ప్రయత్నించును. ఒకరి శోధన అంతర్ముఖము కాగ మరియొకరి శోధన బహిర్ముఖము. అంతర్ముఖ శోధనము ఆత్మజ్ఞానులను తయారు చేయగలదు. బహిర్ముఖ శోధనము శాస్త్రజ్ఞులను తయారు చేయగలదు.

మేము స్పృశించిన జిజ్ఞాసువులలో పదిమంది మాత్రమే ఆశించిన ఫలితముల నిచ్చిరి. ఇతరులు ఆత్మ జిజ్ఞాసువులు కాలేదు. శాస్త్ర జిజ్ఞాసువులు కూడ కాలేదు. వారు కేవలము కుతూహలముతో ప్రశ్నించుటయే గాని, అందించిన విషయమున శ్రద్ధ చూపలేదు. ఒకటి తెలిపిన మరి పది అడుగుదురు. సహనముతో పది తెలిపిన మరియొక పాతిక అడుగుదురు. కేవలము తెలుసుకొనుటకే ఆసక్తి కాని తెలిసినది ఆచరించుటలో ఆసక్తి లేదు. ఆచరించు వారికే వికాసము కలుగును కాని కేవలము తెలుసు కొనుట వలన కలుగదు.

ముప్పది సంవత్సరములు నా స్నేహితునితో సహకరించిన వెనుక మా సహనమునకీ జిజ్ఞాసువులు పరీక్ష పెట్టిరి. తత్ఫలితముగ మౌనము వహించితిమి. జిజ్ఞాసువులందరు ఆత్మ జిజ్ఞాసువులే అయినచో నా స్నేహితుని ప్రణాళిక ఫలించును. కానిచో కొత్త వెఱ్ఱులు ఈ ప్రణాళిక నుండి పుట్టగలవు.

ఈ నాటికిని మేమందించిన విజ్ఞానమును ఆచరింపక కాఫీ క్లబ్బులలోను, భోజన వేళలలోను వివరించుకొనుచు, విచికిత్స చేసుకొనుచు ఎందరో మిగిలియున్నారు.



## 99

# స్నేహము

స్నేహమెంత పవిత్రమో, అంత నిగూఢము కూడ. నిజమైన స్నేహితుడు "నేను నీ స్నేహితుడును" అని కూడ అనడు. అట్లనుట స్నేహమను పదమునకు అమర్యాద. స్నేహమందరును చేయలేరు. స్నేహమున ఆశించుట యుండదు. సహకరించుటయే యుండును. స్నేహమున ప్రేమ సహజము. ప్రేమ స్నేహమందలి యొకభాగము. స్నేహము నిజమగు దివ్యశక్తి. అది సన్నిహితత్త్వమును తెలుపును. మనయందు అత్యంత సన్నిహితమగు విషయము స్పందనము. స్పందనమాధారముగనే మనము జీవించుచున్నాము. అది మన నుండి ఏమియు ఆశించదు. మనము లక్ష్యపెట్టినను పెట్టకున్నను తనవంతు సహకారము నిత్యము అందించుచునుండును. తన ఉనికిని కూడ మనకు ఎఱుకపరచదు. మన శ్రద్ధను బట్టి దాని ఉనికిని తెలుసుకొనవచ్చును.

దైవము స్నేహమునకు మారుపేరు. అతడు నిజమైన స్నేహితుడు. అతనిని నీవు గుర్తించుటకు శ్రద్ధ అత్యావశ్యకము.

స్పందనమునే గుర్తించని నీవు దైవము నెట్లు గుర్తింపగలవు? దైవము స్పందనమునకు స్నేహితుడు. స్పందనము నీకు స్నేహితుడు. నీ వెవరికి స్నేహితుడవు?

పై ప్రశ్నకు సమాధానము దొరకుట కష్టము. దైవమువలె స్పందనమువలె నేమియు నాశించక ఎల్లప్పుడును సహకరించు గుణము నీయందుండగ, ఆశింపక, సహకరించు గుణము నీయందు న్నదా? స్నేహమను మాట పలుకక స్నేహితుడుగ నుండు గంభీరత నీయందున్నదా?

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ఏసుక్రీస్తు స్నేహమును నిర్వర్తించి చూపించిరి.

స్నేహము దైవగుణమని ఎరిగి దానిని ఉపాసించినచో ఇతర సద్గుణములన్నియు నీయందు చేరగలవు.



## 100

## విశ్వాసము - భయము - రోగము


**అ**స్వస్థతను గూర్చి ఎక్కువ ఆలోచింపకుడు. దేహమునకు ప్రస్తుతకాలమున అస్వస్థత చాల సహజము. పూర్ణ ఆరోగ్యము నేతి బీరకాయలోని నేయి వంటిదే. మానసికముగ అస్వస్థత లేకుండునట్లు శ్రద్ధ వహింపుడు. భౌతిక అస్వస్థతను వీలున్నంత వరకు భరించుటకు ప్రయత్నింపుడు.

దైవమునందు, మానవుని యందు, అత్యంత విశ్వాసముతో పనిచేయువారికి నాదొక సూచన. మానవులయందలి మీ విశ్వాసమును కోల్పోకుడు. జీవులు వారి వారి స్వభాము ననుసరించి ప్రవర్తించుచుందురు. మీరును అంతే! విశ్వాసము కోల్పోవుట, దీర్ఘరోగములకు దారి జూపును. నమ్ముట వలన నష్టము లేదు. కొంత కర్మరాహిత్యముండవచ్చును. నమ్మి, తోటి మానవులకు సహాయ సహకారములందించు వారికి వచ్చు నిరాశ, నిస్పృహల నుండి కొన్ని జబ్బులు పుట్టును. అవి ఏమన గొంతు నొప్పి, గుండె నొప్పి, మోకాళ్ళ నొప్పి, మోచేతుల నొప్పి. ఇట్టి నొప్పులు తరచు వచ్చుచునుండును.

ఐనను లెక్క చెయ్యక మీరందించు సహాయ సహకారముల యందు విశ్వాసము కోల్పోక ముందుకు సాగుడు. నొప్పి యున్నచోట మీరు నమ్మిన దైవమునో, గురువునో భావన చేయుచుయుండుడు. తప్పక రోగములు నయము కాగలవు. దీనికి కూడ మీకుండవలసినది విశ్వాసమే. విశ్వాసమున్నచోట దైవముండును. దైవమున్నచోట ఏ దరిద్రముండదు.

మరొక ముఖ్య విషయము. విశ్వాసము కలిగి దానధర్మాదులతో జీవించుచున్న మీరు ఎట్టి పరిస్థితియందును భయము చేరనీయకుడు. భయమొక భయంకర శత్రువు. దానికి తావిచ్చినచో సమస్తమును ధ్వంసము చేయగలదు. భయమున్నచో విశ్వాసము లేనట్లే కదా! విశ్వాసమున్నచో భయమెట్లుండును? కావున భయము చేరునపుడల్ల విశ్వాసమను వెలుగు నాహ్వానింపుడు. భయమును చీకటిని పారద్రోలుడు.

మరియొక మాట. మంచిని నమ్మి ఆచరించినవాడు ఈ సృష్టి యందెన్నడును నశించదు.



## 101

## ధ్యానము - మత్తు

ధ్యానము వలన మత్తు కలుగుట, అది కారణముగ విసుగు కలుగుట జరుగుచునుండును. మత్తు, మేఘమువంటిది. సూర్యుని మరుగుపరచునటువంటిది. సాధకునకు కలుగు మత్తు చేతన, భౌతికమును దాటి సూక్ష్మమున ప్రవేశించునపుడు జరుగును. ధ్యానమున స్థూలలోకపు అంచులు దాటుట ఎఱుకకు కొత్త. అట్టి సమయమున శరీరకణములు ఎఱుకను పట్టియుంచును. అది కారణముగ సాధకుడు మత్తులో పడును. ఈ విషయమై సాధకుడు నిస్పృహ చెందరాదు. సూక్ష్మలోక ప్రవేశ ముఖద్వారము తెరచు కొనుటకై వేచి వుండవలెను. మత్తు వచ్చినను నిస్పృహ చెందక వేచి వుండవలెను. మత్తులో పడిన ప్రతిసమయము అతడొక సువర్ణావ కాశమును కోల్పోయినట్లే. మత్తుకు కారణము తన శరీర ధాతువులని తెలిసి, వాని సాంద్రతను తగ్గించుకొనవలెను. అట్లు తగ్గించుకొనుటకు ఈ క్రింది సూచనలుపయోగపడును.

1. సూర్యోదయకాంతికి ఉన్ముఖముగ ఆసీనుడై ధ్యానము కావించుట.


2. ధ్యానమునకు ముందు ఇరువది నాలుగు నిమిషములు దీర్ఘమగు ఉచ్ఛ్వాస, నిశ్వాసలు చేయుట.

3. అగ్ని హోత్రమునుఏర్పరచుకొని ఆ జ్వాలలను పరికించుట.

4. ఆహార విషయములో పాలు, నీరు, మజ్జిగ, కూరగాయల రసము (సూపు), తేనె, నిమ్మరసము పెంచుకొనుచు స్థూలమగు ఆహారమును తగ్గించుకొనుట.

5. దినము కొకమారు ముప్పది నిమిషములపాటు శరీర వ్యాయామము (నడక, ఆసనములు) నిర్వర్తించుకొనుట చేయవలెను.

ముప్పది నెలలపాటు పై సూచనలను అమలు పరచినచో ధాతువుల సాంద్రత తగ్గి, ధ్యానమున మత్తు వదలి, బుద్ధి లోకమున ప్రవేశించుటకు వీలుపడును.



## 102

# యువత

మీ పరివారమున గల యువకులను మరువకుము. యువకు లెప్పుడునూ ఉత్సాహవంతులై యుందురు. జ్ఞానమునకున్ముఖులై యుందురు. వారి జీవ లక్షణమును బట్టి వారిని సరియైన మార్గమున ప్రోత్సహించుట మీ కర్తవ్యము. వారి మనస్సునింకను కన్యల వంటివి. మీరందించు ఉన్నత భావములకు దీటైన అనుసరణీయ మార్గమును కూడ వారికందింపవలెను. యువకులలో ఎవరైనను మౌనముగ నున్నచో వారు మార్గమునకై వెదకుచున్నారని గమనింపుడు. వారికుత్సాహము కలిగింపుడు. వారి ఉత్సాహము, వారధి (సముద్రము)పై, వారధి (వంతెన) కూడ నిర్మింపగలదు.

ఉత్సాహము, సంసిద్ధత యువకుల లక్షణము. వారిని సరియైన మార్గమున ప్రోత్సహించుట పెద్దల కర్తవ్యము. వారికి అవిశ్వాస మేర్పరచుట, వెనుకకు లాగుట, వారి ఉత్సాహమును నీరు కార్చుట మూర్ఖులు చేయుపని. పెద్దలయందిట్టి మూర్ఖులు మిక్కుటముగ నుండుట చేతనే యువత వికాసము అంతంత మాత్రముగ జరుగు చున్నది.

యువకుల యందుగల ఉత్సాహము, సంసిద్ధత బావిలోని ఊట వంటివి. ఎంతనీరు బావి నుండి తోడుకున్నను మరల ఊట నుండి నీరు చేరును. అట్టి యువచైతన్యమును నిర్మాణాత్మకముగ వినియోగింపని సమాజము ప్రధాన బలమును కోల్పోవునదై చతికిల పడగలదు. ఉన్నతాశయము గల యువతనొకచోట చేర్చుడు. వారి మధ్య పరస్పరత్వము వృద్ధి చెందుటకు కృషి చేయుడు. ఆశయములకు పరస్పరత్వమునకు ఉన్ముఖతయే అర్హతయని భావింపుడు. యువత యందలి స్మృతి పెరిగిన మనుష్యులకన్న త్వరితగతిని మేల్కాంచ గలదు. వారికి ఆచరణ పెద్దల కన్న సులభము.

మరియొక రహస్యము. పిన్నలచే వయస్సుకు మించిన పనులు చేయించుట కూడ అభ్యాసము గావింపవలెను. చిన్నతనముననే బాధ్యతలనందుకొనువారు, జీవితమున సుదూరతీరములను చేరగలరు. చిన్నతనముననే తండ్రిని కోల్పోయిన పాండవులు బాధ్యత పడి జీవించుట ప్రారంభదశ నుండి నేర్చిరి. ఇందలి రహస్యమును కూడ గుర్తింపుడు.

## 103

## అపాయము - ఉపాయము

పూర్వమున శిష్యుడొకడు నావద్ద కేతించి, నమస్కరించి "నా ఆయుర్దాయమెంత? ఇంకెంత కాలము బ్రతుకుదును?" అని ప్రశ్నించెను. "దాని వలన నీకేమి ప్రయోజనము?" అని నేను ప్రశ్నించితిని. "తెలిసినచో పనులు చక్కపెట్టుకొనగలను. త్వరితముగ ఆశ్రమము చేరి సాధన యందు నిమగ్నుడనగుదును." అని పలికెను. అతనికి నేనొక చిరునామా నిచ్చి అచటికేగి, అచట గల ఒక యోగిని సంప్రదించమని తెలిపితిని. శిష్యుడు హుటాహుటిని ప్రయాణమై చిరునామా ప్రకారము చేరవలసిన ప్రదేశము చేరినాడు. దర్శించ వలసిన యోగిని దర్శించినాడు. ఆ యోగి ఉన్న ప్రదేశము యొక అగ్నిపర్వతము. పర్వతము దిగువనే అతడొక కుటీరమున నున్నాడు. పర్వతము తరచు అగ్నిని కక్కుచునే యుండును. అందుండి అగ్ని ద్రవము (లావ) జాలువారుచునే యుండును. శిష్యున కాశ్చర్యము కలిగినది. "అగ్ని ముఖమున ఆశ్రమమా? ఏ క్షణమైనను మరణము కలుగవచ్చును కదా! ఈ యోగపుంగవుడు ఇచట ఆశ్రమము

నిర్మించుకొని జీవించుట ఏమి?" అని భావించుచు లోనికేగెను. లోన యోగి కనులు తెరచి వచ్చిన శిష్యుని మందహాసముతో స్వాగతము పలికెను. ఆసీనుడైన శిష్యునితో యోగి ఇట్లు అనెను. "మరణము సన్నిధినే జీవనము. మరణము సన్నిధినే సాధన. మరణము ఏ క్షణమునైనను కలుగవచ్చును. మరణింతునని భయపడ కుము. మరణము వచ్చినప్పుడు వచ్చును. అది యిప్పుడైనను రాగలదు. దానిని గూర్చి నీవు ప్రణాళికలు వేయకుము. నీ కర్తవ్యము మేరకు నీవు పనిచేయుచు జీవించుము. తుది శ్వాసవరకు పనిచేయుము. 'మరణము ఈ క్షణమున కూడ రాగలదు', అనునది అంగీకరించి నీ పని నీవు కానిమ్ము. అపాయము తెలిసినపుడు క్రొత్తగ నుండును. భయము కలుగును. అపాయమెప్పుడును పొంచి యున్నదని తెలిసినపుడు యిక భయముండదు. ఇచ్చట ఆశ్రమము ఏర్పరచుకొని జీవించుట వలన నాకా భయము పోయినది. ప్రశాంతత చిక్కినది. ఈ ఉపాయము నా కందించినది నా సద్గురువు. అతడే నీకును గురువు."

## 104

# సోదరత్వము

సోదరత్వమనునది, ఆత్మసాధకుని సద్గుణములలో ఉత్త మోత్తము అనగా ఉత్తమ గుణములలో ఉత్తమము. ఇది మీ యందు నేతి బీరకాయలోని నేయి వంటిది. పేరునకే సోదరుడు, భావమున ప్రవర్తనమున అది కానరాదు. అవసరమునకే సోదరత్వము. అటుపైన అది మృగ్యము. సోదరత్వము అత్యున్నత సంస్కారము. ఇతర సంస్కార ములు లేనివాడు సోదరత్వము కలిగియుండలేడు. మానవుడు దివ్యత్వ మును చేరినపుడు అతని చేతన నుండి వికసించు పుష్పము సోదర త్వము. అట్టి సోదరత్వమున్న చోట సహకారము సంపూర్ణము. సోదరత్వమున్నచోట జ్ఞానము పరిపూర్ణము. సోదరత్వము నందు స్నేహము, ప్రేమ అనురాగము సంపూర్ణము. రామలక్ష్మణ భరత శతృఘ్నులట్టివారు. పంచపాండవులట్టివారు.

ఆత్మసాధకునకు సర్వమానవ సోదరత్వము అనునది ఒక ఆశయము. ఈ ఆశయసిద్ధికి వలసిన కృషి యోగజీవనము. అందు పాటించవలసిన నియమములు, యమ, నియమములు. అవి 10 గుణములు.

అసాధ్యముగ గోచరించు సోదరత్వమును క్రమముగ సాధింప వచ్చును. రామలక్ష్మణులను, పంచపాండవులను, గురువులుగ నంగీకరించి వారి ప్రవర్తనలలోని సుళువులను గ్రహించి, మీ ప్రవర్తనమున క్రమముగ కొనివచ్చుటకు ప్రయత్నింపుడు.

సోదరత్వమునకు ప్రధానమగు సూత్రము ఆత్మత్యాగము. సోదరుని కొరకు అవసరమగునెడల త్యాగము చేయుట అను గుణము ముఖ్యము. రాముని కొరకు లక్ష్మణుడు, భరత శతృఘ్నులు త్యాగము గావించిరి. లక్ష్మణ భరతులను గురించి రాముడట్లే త్యాగము కావించెను. అట్లే పంచపాండవుల చరిత్రనందుకూడ పరస్పర త్యాగము గోచరించును. ఇది ఉత్తమ మానవలక్షణము.

దీనికి భిన్నముగ రామాయణము నందే వానర సోదరుల కథ, రాక్షస సోదరుల కథ కూడ తెలుపబడినవి. వారిలో కుంభ కర్ణుడొక్కడే సోదరత్వమును గౌరవించినాడు. త్యాగములేని సోదరత్వము లేదని తెలియుడు. విభీషణ, సుగ్రీవులు మాత్రము సోదరత్వమునకన్న ధర్మమునకు ప్రాధాన్యత నిచ్చినారు.

## 105

## నమ్మిక

దివ్యత్వమును గూర్చి అంగీకరించువారు మానవజాతిలో ఎక్కువ భాగమున్నారు. మతము, విశ్వాసము ఏదైనను దైవమున్నాడని నమ్మువారు ఎక్కువ. ఎవరికి తోచిన రీతులలో వారు దైవమును గూర్చి ఆరాధన చేయుదురు. భౌతికసృష్టికి సూక్ష్మ శక్తుల ఆధారమున్నదని కూడ నమ్ముదురు. కాని విచిత్రమేమన తమ దైనందిన జీవితములో దివ్య శక్తుల ప్రభావము సహాయ సహకారములుండునని నమ్మువారు తక్కువ.

మానవుడు దైవారాధకుడైనప్పటికిని పనులు చేయుచున్నప్పుడు తానే చేయుచున్నాడని భావించును. తానారాధించు దైవము తనతోడుగ నున్నాడని మరచును. కావుననే దివ్యత్వమును భౌతికమునకు కొనివచ్చి అనుభూతిచెందుట కష్టమగుచున్నది. అట్లే భౌతికము నుండి దివ్యత్వము లోనికి ప్రవేశించుట కష్టతరమగుచున్నది. దీనికి కారణము దైవము నందలి నమ్మకము అసంపూర్ణమై యుండుట. ఇది యొక విచిత్రము. మానవుడు దైవమును విశ్వసించుచున్నాడని

భావించుచున్నాడుకాని, నిజమునకట్లు భావించుటలేదు. అతని నమ్మిక నామమాత్రమే. ఇట్టివారు ఆస్తికులలో నాస్తికులు. వీరు నాస్తికులకన్న అవస్థితిలో నుందురు.

పై కారణముగనే చాలా భాగము ఆస్తికులకు మనస్పర్ధ ఎక్కువగ నుండును. ఈ విషయమున నీవెట్లున్నవో నీవే పరిశీలించు కొనుట మంచిది.

## 106

## అసమగ్ర సాధన

ఇంద్ర ధనస్సు నుండి ఏ రంగును, మిగిలిన రంగులతో వేరుచేయుట అసాధ్యము. ఒక రంగు నుండి మరియొక రంగు బయల్పడుచు నుండును. మరియొక రంగులోనికి లీనమగుచుండును. రంగుల ఆది అంతము తెలియుట కష్టము. అట్లే ఒక బోధన నుండి మరియొక బోధనను విడదీయుటకు ప్రయత్నించకుము. ముత్యాల దండ నుండి ఒక ముత్యమును పెటికినచో అన్ని ముత్యములు రాలిపోగలవు. రైలు మార్గమున ఒక పట్టాను తప్పించినను ప్రయాణము చెడును. ఒక బోధనలోని అంశములన్నిటికీ సమానమైన ప్రాధాన్యము కలదు. నీకు నచ్చినవి కొన్ని ఆచరించుట, కొన్ని ఆచరింపకుండుట అవివేకము. చెప్పుల జతలో ఒక చెప్పును మాత్రమే ఎన్నుకొనువాడు మూర్ఖుడే కదా!

అష్టాంగ యోగమును నభ్యసింపదలచినవారు అందలి అష్టాంగములను క్రమముగ సాధింపవలెను. అందు కొన్ని ఎన్ను కొనుట కుదరదు. గీత యందలి ప్రతి అధ్యాయము సంపూర్ణమే.

అధ్యాయ మందలి అన్ని అంశములనట్లే పాటింపవలెను. అట్లే సద్గురు వందించిన ఆచరణాత్మక సూత్రములను పరిపూర్ణముగ పాటింప వలెను. అట్లు కానిచో నీ సాధన అసంపూర్ణమని ఎరుగుము. అసమగ్ర సాధన నిన్ను వెక్కిరించుచుండును.



## 107

# క్రియాశక్తి

క్రియాశక్తిని గూర్చి అనాది కాలమునుండి యోగులు నిర్వచించుచునే యున్నారు. క్రియాశక్తి యందు ఇచ్ఛాజ్ఞానములు అంతర్లీనమై యుండును. ప్రస్తుత కాలమున జీవితము ఎక్కువ భాగము మానవునకు గానుగ ఎద్దు జీవితముగ తయారైనది. ఒక శతాబ్దమునకు ముందు మానవజాతి ఇంత గానుగెద్దు జీవితము జీవించియుండలేదు. వారికి కొంత స్వతంత్రత, విశ్రాంతి తరచుగ దొరుకుచునుండెడిది. ఆంగ్లేయుల పాలన యందు కూడ భారతీయులు మొన్న మొన్నటి వరకు శాంతి యుతమైన దినచర్య కలిగి యుండెడివారు. ఆరు గంటల కన్నా సంఘమున పని, వృత్తి, ఉద్యోగ వ్యాపారముల పని యుండెడిది కాదు. ప్రజలు ఇతర సమయములలో తమలోని సృజనాత్మకతను వినియోగించుచు కవిత్వము, రచన, నాటకములు, కళాపోషణ యిత్యాది సంస్కృతీ పరమగు కార్యముల యందు నిమగ్నులై సమతూక జీవనము గావించెడివారు. 20వ శతాబ్దము నాలుగవ పాదమునుండి జాతిని రజస్సు ఆవరించినది.

పశ్చిమము నుండి వీచు వాయువులు జాతిని రజోగుణ ప్రేరితులను చేసెను. దీని వలన ఆర్థిక పురోగతి కలుగుచున్నను, పేదరికము కూడ పెరుగుచున్నది. అశాంతి అందరికి సమానముగ పెరిగినది. దీనికి కారణము క్రియలో రజస్సుపాలు ఎక్కువ అగుటయే.

ఈ పరిణామమును గమనించుచున్న మాకు మానవులలో ఎక్కువ భాగము గానుగెద్దులుగ గోచరించుచున్నారు. మనోలోకమున బానిసత్వము పెరిగినది. ఇది భౌతిక బానిసత్వము కన్న దురదృష్ట కరమైనది. ఆర్థికబానిసత్వము సర్వసామాన్యమై నిలచినది. గానుగాడు వారు కొందరే ! గానుగెద్దులెందరో! ఇక మనో వికాసమునకు తావేది? జాతి అంతయు రజోప్రేరితమై, వాసుదేవ వ్యూహము నుండి సంకర్షణ వ్యూహమునకు మరలినది. ఫలితము అహంకారపూరితమగు జాతియే. మంచిని గొప్ప కబళించి గొప్పతనమే మంచితనముగ వెకిలిగ నవ్వుచునుండును.

సత్సాధకులకు నా సూచన ఏమన, క్రియాశక్తి యందు సత్వమునకు పెద్దపీట వేయుడు. రజస్సు, తమస్సులకు సమభాగము కల్పింపుడు. అప్పుడే యోగజీవనము సాధ్యము.



## 108

## సనక సనందనాదులు

**యో**గ పరంపరలో సనక సనందనాదులు, నారదుడు మకుటము వంటివారు. అటుపైన యిక పరబ్రహ్మమే. సృష్టి మొత్తము త్రిమూర్తులతో సహా వారిని గౌరవింతురు. కుమారుల భావనయే జీవులను పవిత్రీకరింపగలవు. పరమపదమునకు అత్యంత సమీపమున నుండి పరబ్రహ్మమును సతతము అనుభూతి చెందుచు లోకములన్నిటి యందును సంచరించు మహామహితాత్ములు వారు. దేవతలు సహితము వారి పాదములను సోకి నమస్కరింతురు.

వారును ఒకప్పుడు మీవలె భూమిపై జీవించినవారే. మావలె చరించినవారే. పూర్వ కల్పములయందు వారొనరించిన అసామాన్య మైన కృషియే వారిని ఈ కల్పమున అట్టి స్థితియందు నిలిపినదని తెలియుడు. వారును మీవలె భూమిపై చరించి సుఖ దుఃఖముల నొందినవారే. కష్టసుఖముల ననుభవించినవారే. చమటోడ్చి పనిచేసిన వారే. వారి జీవనయాత్రలో వారనుభవపూర్వకముగ దయ, కరుణ, ధైర్యము, ధర్మము, ఆత్మత్యాగము అనగా నేమో తెలుసుకొనినారు.

కావున సృష్టిజీవులకు మార్గదర్శకులై, గురువులై, నాయకులై అవగాహనతో, ప్రేమతో అన్ని లోకముల జీవులను పరమపదమునకు మళ్ళించు అనితరసాధ్యమగు యజ్ఞములయందు కోట్ల సంవత్సరముల నుండి నిమగ్నమై యున్నారు.

వారి స్మరణము సర్వశుభప్రదము.

## OTHER BOOKS THROUGH MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

| | | |
|---|---|---|
| 1. | Agni (E/G/S) | 60-00 |
| 2. | Amanaskudu (T/K) | 18-00 |
| 3. | Antardarsana Dhyanamulu (T) | 100-00 |
| 4. | Anveshakudu (T) | 60-00 |
| 5. | Asangudu (T) | 15-00 |
| 6. | Ashram Leaves (E/G/S) | 100-00 |
| 7. | Ayurvedic Principles (E) | |
| 8. | Bharateeya Sampradayamu (T/Hi) | 10-00 |
| 9. | Cow ('Govu' Mahatyam Vivarana) (E/T/K) | 20-00 |
| 10. | Devapi Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 11. | Dhanakamuni Katha (T) | 25-00 |
| 12. | Doctorine of Eternal Presence (E) | 10-00 |
| 13. | Gayatri Mantra - Avagahana (T) | 10-00 |
| 14. | Geetopanishad - Gnana Yogamu (T) | 25-00 |
| 15. | Geetopanishad - Karma Yogamu (T) | 20-00 |
| 16. | Geetopanishad - Sankhya Yogamu (T) | 25-00 |
| 17. | Geetopanishad - Karmasanyasa Yogamu (T) | 20-00 |
| 18. | Geetopanishad - Dhyana Yogamu (T) | 40-00 |
| 19. | Good Friday (E/G/S/F/H) | 10-00 |
| 20. | Gurupaduka Sthavam (E) | |
| 21. | Health & Harmony (E) | 120-00 |
| 22. | Hercules-The Man and the Symbol (E/G/S/F) | 100-00 |
| 23. | Himalaya Guru Parampara (T/Hi) | 12-00 |
| 24. | Jupiter-The Path of Expansion (E/G/S) | 40-00 |
| 25. | Jyotirlinga Yatra (T) | 20-00 |
| 26. | Katha Deepika (T) | 40-00 |
| 27. | Listening to Invisible Master (E/G/S/F/H) | 20-00 |
| 28. | Lord Maitreya-The World Teacher (E/G/S/F/H) | |
| 29. | Maitreya Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 30. | Mana Mastaru Garu (T) | 60-00 |

| | | |
|---|---|---|
| 31. | Mantrams-Their Significance and Practice (E/G/S) | 35-00 |
| 32. | Maria Magdalena (E/S/G/F) | |
| 33. | Marriage-A Sacrament (E) | |
| 34. | Maruvu Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 35. | Master C.V.V. (Birthday Message) (T) | 30-00 |
| 36. | Master C.V.V. Noothana Yogamu (T) | 20-00 |
| 37. | Master C.V.V. Yogamu (T) | 20-00 |
| 38. | Master C.V.V. Yogamu-Karma Rahityamu (T) | 10-00 |
| 39. | Master C.V.V. - May Call !(E/G/S) | 100-00 |
| 40. | Master C.V.V. - May Call ! II (E) | 100-00 |
| 41. | Master C.V.V. The Initiator - Master E.K. The Inspiror (E) | 15-00 |
| 42. | Master C.V.V. - Saturn Regulations | 125-00 |
| 43. | Master E.K. - The New Age Teacher (E/G/S) | 70-00 |
| 44. | Mithila-A New Age Syllabus (E/G/S) | 100-00 |
| 45. | Occult Meditations (E/G/S) | 100-00 |
| 46. | Omkaram (T) | 30-00 |
| 47. | On Change (E/G/S) | 50-00 |
| 48. | On Healing (E/G/S) | 100-00 |
| 49. | On Love (E/G/S) | 50-00 |
| 50. | On Service (E/G/S) | 50-00 |
| 51. | On Silence (E/G/S) | 50-00 |
| 52. | Pranayamam (T) | 10-00 |
| 53. | Prayers (E/G/S) | 100-00 |
| 54. | Rudra (E/G/S) | 30-00 |
| 55. | Sankhya - The Sacred Doctrine (E/G/S) | 75-00 |
| 56. | Saraswathi - The Word (E/G/S) | 60-00 |
| 57. | Saturn-The Path of Systematised Growth (E/G/S) | 40-00 |
| 58. | Shodasopachara Pooja - Avagahana (T) | 10-00 |
| 59. | Sound-The Key and its Application (E/G/S) | 40-00 |
| 60. | Spiritualism - Business and Management (E/G/S) | 25-00 |
| 61. | Sri Dattatreya (E/G/S/T/Hi) | 33-00 |
| 62. | Sri Gurupaduka Sthavam (T) | 30-00 |
| 63. | Sri Krishna Namamrutham (T) | 25-00 |
| 64. | Sri Lalitha-1 (T) | 40-00 |
| 65. | Sri Lalitha-2 (T) | 40-00 |
| 66. | Sri Lalitha-3 (T) | 40-00 |
| 67. | Sri Lalitha-4 (T) | 40-00 |

| | | |
|---|---|---|
| 68. | Sri Lalitha-5 (T) | 40-00 |
| 69. | Sri Lalitha-6 (T) | 40-00 |
| 70. | Sri Lalitha-7 (T) | 40-00 |
| 71. | Sri Sastri Garu (E/G/S/F/T/H) | 40-00 |
| 72. | Sri Shiridi Sai Sayings (E/G/S/T/Hi) | 80-00 |
| 73. | Steps on Silence (E) | 75-00 |
| 74. | Suvarna Sopanamulu | |
| 75. | The Aquarian Cross (E/G/S) | 100-00 |
| 76. | The Aquarian Master (E/G/S) | 75-00 |
| 77. | The Doctorine of Ethics (E) | 35-00 |
| 78. | The Etheric Body (E/G/S) | |
| 79. | The Path of Synthesis (E) | 40-00 |
| 80. | The Splendor of Seven Hills (E/T/Hi) | 15-00 |
| 81. | The Teachigs of Lord Sanatkumara | 150-00 |
| 82. | The Theosophical Movement (E/G/S) | 60-00 |
| 83. | The White Lotus (E/G/S) | 20-00 |
| 84. | Time - The Key (E/G/S) | |
| 85. | Uranus - The Alchemist of the Age | 150-00 |
| 86. | Venus - The Path of Immortality (E/G/S) | 80-00 |
| 87. | Violet Flame Invocation (E/G) | 60-00 |
| 88. | Vrutrasura Rahasyam (T) | 35-00 |
| 89. | Varunagraha Prabhavamu (T) | 22-00 |
| 90. | Wisdom Buds (E/S) | 20-00 |
| 91. | Wisdom Teachings of Vidura (E/G/S) | 80-00 |
| 92. | Moon & Spiritual Astrology (S) | |
| 93. | The Death & Reincarnation (S) | |
| 94. | Commentary on Om Namonarayanaya (S) | |
| 95. | Master Jesus, Life and Teachings (S) | |
| 96. | The Science of Ayurveda & Homoeopathy (S) | |
| 97. | The Teachings of Master D.K. (S) | |
| 98. | The Human Constitution (S) | |
| 99. | The Masters of Wisdom (S) | |
| 100. | The Path of Meditation (S) | |
| 101. | Stories for Disciples (S) | |
| 102. | Spirituality in Daily Life (S) | |
| 103. | Special Practices for Disciples (S) | |
| 104. | Fundamentals of Health & Healing (S) | |
| 105. | Ganesha, The Cosmic Lord of Groupings (S) | |
| 106. | Astrology and Healing (S) | |